16 . 09. 2025

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

మంగళవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 109 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



పీసీసీ చీఫ్ గా మహేష్ కుమార్ గౌడ్ పదవి బాధ్యతలు స్వీకరించి ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం రోజున వారి నివాసంలో మహేష్ కుమార్ గౌడ్ కి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 15:

## పేద ప్రజలకు అండగా నిలబడ్డాం

### వారి సంక్షేమమే మా ధ్యేయం:మోడీ



**పాట్నా, సెప్టెంబర్ 15(వెలుతురు):** పేద ప్రజలను ఆదుకోవడమే తన ధ్యేయమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు నాలుగు కోట్ల పక్కా గృహాల

2 లో..

## కళాశాలల యాజమాన్యలతో చర్చలు సఫలం

- నేటినుంచి యధావిధిగా కాలేజీల ప్రారంభం
- దీపావళి లోగా 1200 కోట్ల బకాయిల విడుదల
- గత బిఆర్ఎస్ ఫీజ్ రియంబర్స్‌మెంట్‌ను తుంగలో తొక్కిందన్న భట్టి

2 లో..



## పకడ్బందీగా వీధి దీపాల నిర్వహణ

### సోలార్ పవర్‌పై సాధ్యాసాధ్యాల పరిశీలన

ఐఐటి సంస్థలతో ఆడిటింగ్ జరిపేలా చర్యలు

పెద్ద కంపెనీల నుంచి టెండర్ల ఆహ్వానం

*వీధిదీపాల నిర్వహణ కోసం పెద్ద కంపెనీల నుంచి వెంటనే టెండర్స్ పిలవాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్, పంచాయతీ రాజ్, జీహెచ్ఎంసీ అధికారులతో సీఎం రేవత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులకు పలు అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశర చేశారు.*



### అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం


**హైదరాబాద్, సెప్టెంబరు15 ( వెలుతురు):** వీధి దీపాలకు సోలార్ పవర్‌ను వినియోగిం చడంపైన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. ఐఐటీ లాంటి సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని మార్గనిర్దేశర చేశారు. రాష్ట్రంలోని అన్ని వీధిదీపాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయాలని ఆదేశించారు. ఏఐతో ఎప్పటికప్పుడు విశ్లేషణ చేయాలని సూచించారు. గ్రామాల్లో వీధిదీపాల నిర్వహణను గ్రామ పంచాయతీకి అప్పగించాలని మార్గనిర్దేశర చేశారు . రాష్ట్రంలో వీధిదీపాల ఏర్పాటు-, నిర్వహణలో సమూల మార్పులు తీసుకురావాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేమ నరేందర్‌రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవి, కోర్ అర్బన్

2 లో..

## జర్నలిస్టుల సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నాం

### అక్రిడిటేషన్ పాలసీపై యాక్షన్ ప్లాన్

### జర్నలిస్టుల సమస్యలపై మంత్రి పొంగులేటి సుదీర్ఘ సమీక్ష



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 15:**

గౌరవ ముఖ్యమంత్రి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం కట్టుబడి ఉ ందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్ కార్డ్ లు అందేలా విధివిధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నాడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో హోమ్ శాఖ

2 లో..

## తీరనున్న యూరియా కష్టాలు

మంత్రి గారి విజప్తితో రాష్టానికి అదనంగా మరో 40 వేల మెట్రిక్ టన్నుల యూరియా

- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర రసాయనాలు మరియు ఎరువుల శాఖ
- రాష్ట్రానికి మరో 5 ఓడల నుండి కేటాయింపులు
- ఇప్పటికే కేటాయించిన 40 వేల టన్నులకు ఇది అదనం
- సెప్టెంబర్ మాసంలో మొదటి 15 రోజులలో 1,04,000 మెట్రిక్ టన్నులు సరఫరా

**న్యూఢిల్లీ వెలుతురు సెప్టెంబర్ 15:**

తెలంగాణ రైతుల అవసరాలకు సరిపడా యూరియాను వీలైనంత త్వరగా కేటాయించి, పంపిణీ అయ్యేలా చూడాలని ఢిల్లీలోని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ కార్యదర్శి రజత్ కుమార్ మిశ్రాను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా తెలంగాణ రైతులకు సరిపడా యూరియాను ఈ పది రోజుల్లో సరఫరా చేయాలని, వివిధ కారణాలతో యూరియా



దిగుమతి ఆశించిన స్థాయిలో లేదని మంత్రి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "ప్రస్తుతం రాష్ట్రంలో సాగులో ఉన్న వరి, మొక్కజొన్న, పత్తి వంటి ప్రధాన పంటలకు యూరియా అత్యవసరం. ముఖ్యంగా ఈ పదిహేను రోజులు వ్యవసాయ సీజన్‌లో కీలకమైనవి. ఈ సమయంలో రైతులకు ఎరువులు అందుబాటులో

2 లో..

## విద్యార్థుల భవిష్యత్ అగమ్య గోచరం

మీ నిర్వాకంవల్లే 15 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమైన కన్పిస్తలేదా?

కేసీఆర్ కు, మీకు తేడా ఏముంది?

ఆనాడు చెక్కులిచ్చి బౌన్స్ చేసి ప్రజలను పిచ్చోళ్లను చేశారు

మీరు టోకెన్ల మీద టోకెన్లు ఇస్తూ మోసం చేస్తున్నారే తప్ప పైసలియ్యడం లేదు

మూసీ సుందరీకరణ, ఫోర్త్ సిటీ, మిస్ వరల్డ్ పోటీలకు వేల కోట్లు ఖర్చు పెడతారు



● తుపాకీ చేతపట్టి చర్చలు జరపాలంటే భయపడే పిరికి ప్రభుత్వం మోదీది కాదు, ● పేద విద్యార్థుల కోసం 8 వేల కోట్లు ఖర్చు చేయలేరా?, ● తుపాకీ ఆర్మీ, పోలీసుల చేతుల్లోనే ఉండాల్సిందే, ● వచ్చే మార్చి నాటికి మావోయిస్టులను నిర్మూలించి తీరుతాం, ● యూరియాపై రైతుల గోస ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే, ● ప్రణాళిక లేకుండా చేయడంవల్లే ఈ దుస్థితి, ● బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నా చేష్టలుడిగి చూస్తున్నారు, ● రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

2 లో..



## నాలాల కబ్జా వల్లనే అకస్మాత్తు వరదలు

కొట్టుకుపోయిన ఇద్దరికి 5లక్షల చొప్పనపరిహారం

నగరంలో అనేక చోట్ల ఇలాంటి కబ్జాల వల్లనే ప్రమాదాలు

మాగంబస్తీలో రంగనాథ్, కలెక్టర్ హరిచందన పర్యటన

**హైదరాబాద్,సెప్టెంబరు15 ( వెలుతురు):** భారీ వర్షం నేపథ్యంలో ఆదివారం రాత్రి

9 లో..

## యూరియా వాడకం తగ్గించండి

- అభివృద్ధి,సంక్షేమం వైపుగా కృషి
- ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా పని
- కలెక్టర్లు స్మార్ట్ వర్క్ అలవాటు చేసుకోవాలి
- స్వర్ణాంధప్రదేశ్-2047 లక్ష్యం కోసం పనిచేయాలి
- వాట్సప్ గవర్నెన్సు ద్వారా పౌరసేవలు
- సాంకేతికతను ప్రజలకు చేరువచేశాం
- ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేస్తేనే ఫలితాలు
- సమర్థ నీటి నిర్వహణతో రిజర్వాయర్లు నింపాం
- కలెక్టర్లకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం



క్యాన్సర్‌కు అదే ప్రధాన కారణం

యూరియా తగ్గిస్తే 800 నగదు ప్రోత్సాహకం

**అమరావతి,సెప్టెంబర్15( వెలుతురు):** ఏపీ సీఎం చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. వచ్చే ఏడాది నుంచి యూరియా వాడకం తగ్గించే రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. తగ్గించే ప్రతి కట్టకు రూ.800 నేరుగా రైతుకు అందిస్తామని చెప్పారు. రైతు నష్టపోకూడదు, ప్రజారోగ్యం బాగుండాలని పేర్కొన్నారు. కలెక్టర్ల సదస్సులో వ్యవసాయ రంగంపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. యూరియా ఎక్కువ వాడటం వల్ల క్యాన్సర్ వస్తుంది. దీని వాడకంపై రైతుల్లో చైతన్యం తీసుకురావాలి. ఏపీలో క్యాన్సర్ టాప్-5 రోగాల జాబితాలో ఉంది.

10 లో..



## కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై పరువు నష్టం దావా వేసిన కెటిఆర్

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 15:**

భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, మరియు కొన్ని మీడియా సంస్థలు, సోషల్

2 లో..

## బీహార్ సర్ ప్రక్రియపై సుప్రీం కీలక వ్యాఖ్యలు

చట్టబద్ధత లోపిస్తే మొత్తం ప్రక్రియను రద్దు చేస్తాం

కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీం ధర్మాసనం హెచ్చరిక

2 లో..

(మొదటి పేజీ తరువాయి..)

## పకడ్బందీగా వీధి దీపాల నిర్వహణ

ఏరియా మున్సిపల్ సెక్రటరీ ఇలంబర్తి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో పాటు- అనేక ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో వీధిదీపాల ఏర్పాటు-, నిర్వహణ కోసం పెద్ద కంపెనీల నుండి -టె-ండర్లను పిలవాలని సూచించారు. దీనివల్ల పారదర్శకత పెరిగి, సేవల నాణ్యత మెరుగుపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే, వీధిదీపాల కోసం సౌరశక్తి వినియోగం సాధ్యాసాధ్యాలను లోతుగా పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. వీధిదీపాల పనితీరును నిర్ధారించడానికి ఐఐటీ- వంటి ప్రతిష్టాత్మక సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని సీఎం ఆదేశించారు. అంతేకాకుండా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని వీధిదీపాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేసి, కేంద్రంగా పర్యవేక్షించే విధానాన్ని రూపొందించాలని సూచించారు. దీని ద్వారా ప్రతి దీపం స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. వీధిదీపాల నిర్వహణలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించాలని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. కృత్రిమ మేధస్సు ద్వారా ఎప్పటికప్పుడు విశ్లేషణ జరిపి, సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కారాలు తీసుకోవాలని సూచించారు. సీఎం రేవంత్ ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో వీధిదీపాల నిర్వహణను పూర్తిగా గ్రామపంచాయతీలకే అప్పగించాలని నిర్ణయించారు. సర్పంచ్‌లకు దీపాల ఏర్పాటు-, నిర్వహణపై పూర్తి అధికారం ఇవ్వబడుతుంది. అయితే, ఈ పనులపై ఎంపీడీవో స్థాయిలో పర్యవేక్షణ ఉ ండాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి వీధిదీపం, ప్రతి పోల్‌పై సర్వే చేయాలని సీఎం ఆదేశించారు. దీని ద్వారా సమస్యలు, లోపాలు, అదనపు అవసరాలను గుర్తించి త్వరితగతిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటు-ందని అన్నారు. వీధిదీపాల వ్యవస్థను ఆధునీకరించడానికి తీసుకుంటున్న ఈ చర్యలు రాబోయే రోజుల్లో రాష్ట్రానికి ఒక మోడల్‌గా నిలుస్తాయని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. పారదర్శక విధానాలు, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ, గ్రామీణ స్థాయి అధికారానికి బాధ్యత కల్పించడం ద్వారా వీధిదీపాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించగలమన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

## పేద ప్రజలకు అండగా నిలబడ్డాం

పంపిణీ చేపట్టామని, మరో మూడు కోట్ల ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నట్లు- వెల్లడించారు. బిహార్‌లోని పూర్ణియాలో దాదాపు రూ.36 వేల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేసిన అనంతరం ప్రసంగించారు. ఆర్జేడీ, కాంగ్రెస్‌ల హయాంలో రాష్ట్రంలో దుష్పరిపాలన సాగిందంటూ మండిపడ్డారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పార్టీలకు ప్రజలు తగిన సమాధానం చెబుతారన్నారు. బిహార్ లో ప్రతిపక్షాలు చొరబాటుదారులను ప్రోత్సహిస్తున్నాయి. కానీ, మా సర్కారు వారిని తరిమేస్తుంది. ఆర్జేడీ, కాంగ్రెస్ ల పాలనాపరమైన వైఫల్యాల కారణంగా రాష్ట్రం చాలా నష్టపోయింది. రాష్ట్రాభివృద్ధిని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆ పార్టీల నేతలు కేవలం తమ కుటుంబాలను పట్టించుకుంటారు. నేను మాత్రం 'సబ్‌కా సాథ్.. సబ్‌కా విశ్వాస్'ను నమ్ముతానని మోదీ పేర్కొన్నారు. అంతకుముందు పూర్ణియా విమానాశ్రయంలో తాత్కాలిక టెర్మినల్ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీఎం నీతీశ్ కుమార్, పౌరవిమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఆర్జేడీ, కాంగ్రెస్‌లతో గతంలో పొత్తులు కుదుర్చుకోవడంపై చింతిస్తున్నట్లు- సీఎం నీతీశ్ కుమార్ పేర్కొన్నారు. అధికారాన్ని పంచుకున్నప్పుడల్లా ఆ పార్టీలు దుర్మార్గాలకు పాల్పడ్డాయని ఆరోపించారు. తాను ఎన్డీయేలోనే ఉంటానని సభా వేదికగా ప్రధాని మోదీకి హామీ ఇచ్చారు. బిహార్‌లో తొలిసారి 2005లో జేడీయూ- భాజపా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు- చేసింది. సొంత పార్టీ నేతల బలవంతంతో ఒకటి రెండుసార్లు వేరే కూటముల్లో చేరాను. కానీ, అదంతా గతం. ఆ పార్టీలతో ఎప్పుడూ సౌకర్యంగా లేను. అధికారాన్ని పంచుకున్నప్పుడల్లా దుర్మార్గంగా వ్యవహరించాయి. ఇప్పుడు తిరిగి వచ్చాను. ఇకపై ఎక్కడికీ వెళ్లనని వ్యాఖ్యానించారు.

## కళాశాలల యాజమాన్యాలతో చర్చలు సఫలం

**హైదరాబాద్,సెప్టెంబర్ 15( వెలుతురు):**
తెలంగాణలోని వృత్తి విద్యా కళాశాలల యాజమాన్యాలతో ప్రభుత్వం చర్చలు సఫలమయ్యాయి. దీపావళిలోగా రూ.1200 కోట్ల బకాయిలు విడుదల చేసేందుకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఫీజురియింబర్స్‌మెంట్ అంశంపై మంత్రులు భట్టివిక్రమార్క, శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులతో జరిపిన చర్చలు ముగిశాయి. నాలుగేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ వృత్తి విద్యా కళాశాలలు బంద్ పాటిస్తున్న విషయం తెలిసిందే. ఫీజురియింబర్స్‌మెంట్ అంశంపై మంత్రులు భట్టివిక్రమార్క, శ్రీధర్‌బాబు, ఉ త్తమ్‌కుమార్ రెడ్డి ప్రైవేటు- కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులతో జరిపిన చర్చలు ముగిశాయి. చర్చలు సఫలం కావడంతో తరగతుల బంద్‌ను ఉపసంహరించుకున్నట్లు- వృత్తి విద్యా కళాశాలల యాజమాన్యాలు ప్రకటించాయి. దీంతో మంగళవారం నుంచి తరగతులు యథాతథంగా కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా డిప్యూటీ- సీఎం మల్లు భట్టివిక్రమార్క మీడియాతో మాట్లాడుతూ.. 'విద్యార్థుల భవిష్యత్తు తెలంగాణ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతతో కూడిన అంశం. ఫీజు రియింబర్స్‌మెంట్ పథకం పేద, మధ్యతరగతి విద్యార్థులకు వరంలాంటిది. గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం ఫీజు రియింబర్స్‌మెంట్ పథకాన్ని ఛిన్నాభిన్నం చేసింది. పదేళ్ల పాటు- ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులను పెండిగ్‌లో పెట్టి భారంగా మార్చింది. వారు విధ్వంసం చేసిన అంశాలను మేం క్రమక్రమంగా సరిదిద్దుతున్నాం. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఫీజురియింబర్స్‌మెంట్ సమస్యను కూడా పరిష్కరిస్తాం. ఈ పథకానికి సంబంధించి కళాశాలల వద్ద రూ.600 కోట్ల విలువైన టోకెన్లు ఉన్నాయి. ఇప్పటికే టోకెన్లు ఇచ్చిన రూ.600 కోట్ల నిధులు ఈ వారంలోనే విడుదల చేస్తామని హామీ ఇచ్చాం. ఫీజు రియింబర్స్‌మెంట్ రేషనలైజేషన్ కోసం ఒక కమిటీ- వేయాలని నిర్ణయించాం. మా విజ్ఞప్తి మేరకు కళాశాలల బంద్‌ను విరమించుకున్నట్లు- యాజమాన్యాలు చెప్పాయి. బంద్ విరమణకు ముందుకొచ్చిన యాజమాన్యాలకు ధన్యవాదాలని తెలిపారు.

## జర్నలిస్టుల సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నాం

స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రవి గుప్తా, ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, ఐ & పిఆర్ స్పెషల్ కమీషనర్ సిహెచ్. ప్రియాంక, సీపీఆర్వో జి. మల్సూర్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా అక్రిడిటేషన్ పాలసీ, జర్నలిస్ట్‌ల హెల్త్ పాలసీ, జర్నలిస్టుల అవార్డులు, జర్నలిస్టులపై దాడులకు సంబంధించి హైపవర్ కమిటీ తదతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు జరగకుండా ప్రభుత్వం అన్నీ చర్యలు తీసుకుంటుందని, ఇందుకోసం హై పవర్ కమిటీని కూడా పునరుద్దరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఉమ్మడి రాష్ట్రంలో 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జి.ఓ. జారీచేసిందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆ ఊసే ఎత్తలేదని విమర్శించారు. అలాగే, జర్నలిస్టుల జీత భత్యాలకు సంబంధించి త్రైపాక్షిక కమిటీని కూడా పునరుద్దరిస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల హెల్త్ పాలసీపై సమగ్రంగా చర్చించామని, ఇన్సూరెన్స్ పాలసీలో ఏది జర్నలిస్టులకు ప్రయోజనకరంగా ఉంటుందో అనే అంశంపై ఆరోగ్యశ్రీ విభాగంతో కలిసి లోతైన అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. అక్రిడిటేషన్ పాలసీపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. జర్నలిస్టుల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రత్యేక వెబ్ సైట్ ను తక్షణమే రూపొందించాలని అధికారులకు సూచించారు. జర్నలిస్టులకు అవార్డులను పునరుద్దరించాలని ప్రెస్ అకాడెమీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి పట్ల మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశ్రీ సి.ఇ.ఓ. ఉదయ్ కుమార్, కార్మిక శాఖ అడిషనల్ కమిషనర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్ అగమ్య గోచరం

**మంచిర్యాల వెలుతురు సెప్టెంబర్ 15:**
ఫీజు రీయంబర్స్ మెంట్ బ్రాండ్ అంబాసిడర్లం తామేనని సంకలు గుద్దుకున్న కాంగ్రెస్ నేతల నిర్వాకంవల్లే కాలేజీలు మూతపడి లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమయ్యే పరిస్థితి ఏర్పడిందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. మూసీ సుందరీకరణ, ఫోర్త్ సిటీ, మిస్ వరల్డ్ పోటీల పేరుతో వేల కోట్లు ఖర్చు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం 15 లక్షల మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తు కనబడటం లేదా? రాష్ట్ర బడ్జెట్ లో నుండి రూ.8 వేల కోట్ల రూపాయలు చెల్లించలేరా? అంటూ ప్రశ్నించారు. నక్సలైట్లను ఎన్ కౌంటర్ చేయడంపైనా కేంద్ర మంత్రి తీవ్ర స్థాయిలో స్పందించారు. "దేశాన్ని రక్షించే ఆర్మీ, చట్టాన్ని కాపాడే పోలీసుల చేతుల్లోనే తుపాకీ ఉండాలి. అట్లా కాకుండా పర్మిషన్ లేకుండా ఎవరి చేతిలో తుపాకీ ఉన్నా సంఘ విద్రోహ శక్తిగానే భావిస్తాం. అందుకే తుపాకీ విడిచి లొంగిపోవాలని కోరుతున్నాం. అట్లా కాకుండా తుపాకులతో మేం కాలుస్తూనే ఉంటాం... మీరు మాత్రం చర్చలకు పిలవాల్సిందేనంటే వినే పిరికిపంద ప్రభుత్వం మాది కాదు. నరేంద్రమోదీ ఆధ్వర్యంలో అమిత్ షా నాయకత్వంలో 2026 మార్చి నాటికి మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించి తీరుతాం"అని స్పష్టం చేశారు. జాతీయ జెండా ఎగరనీయబోమని, ఎన్నికలే జరపనీయబోమని ఏ దేశపోళ్లు అనాలే... మీరే చెప్పాలంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో యూరియా కొరతకు ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. సరైన ప్రణాళిక లేకపోవడం, యూరియాను బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నా చర్యల్లేకపోవడంవల్లే ఈ దుస్థితి తలెత్తిందని చెప్పారు. మంచిర్యాల రైల్వే స్టేషన్ వద్ద ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథరావులతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఏమన్నారంటే...

ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు ఇవ్వకపోవడంవల్ల రాష్ట్రంలోని 15 నుండి 20 లక్షల మంది విద్యార్థుల జీవితాలు నాశనమయ్యే పరిస్థితి ఏర్పడింది. గత పదేళ్లపాటు కేసీఆర్ ఫీజు రీయంబర్స్ మెంట్ ఇయ్యక తిప్పలు పెట్టారు. ఫీజు రీయంబర్స్ మెంట్ కు బ్రాండ్ అంబాసిడర్ మేమేనని ఇన్నాళ్లు సంకలు గుద్దుకున్న కాంగ్రెసోళ్లు 20 నెలలుగా ఆ బకాయిలియ్యకుండా మోసం చేస్తున్నరు. ? కేసీఆర్ కు, మీకు తేడా ఏముంది? పంజాబ్ పోయి చెక్కులిచ్చి బౌన్స్ చేసి తెలంగాణ పరువును బజారున పడేస్తే.... ఈ కాంగ్రెసోళ్లు టోకెన్ల మీద టోకెన్లు ఇస్తూ మోసం చేస్తున్నరే తప్ప పైసా ఇయ్యడం లేదు. కాంగ్రెస్ నమ్మిన పాపానికి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్లయింది.

ఫీజు రీయంబర్స్ మెంట్ పై ఆధారపడి ఈ రాష్ట్రంలో ఏటా 15 లక్షల మందికిపైగా పేద విద్యార్థులు డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, మెడికల్, ఎంబీఏ, ఎంసీఏ వంటి ఉన్నత కోర్సులను చదువుకుంటున్నరు. నాలుగైదు ఏళ్లుగా ఫీజు రీయంబర్స్ మెంట్ పైసలు చెల్లించకపోతే వాళ్ల పరిస్థితి ఏంది? ఫీజు రీయంబర్స్ మెంట్ ఉందనే ఉద్దేశంతోనే ఉన్నత విద్యా కోర్సుల్లో చేరిన విద్యార్థులు ఇయాళ నడిరోడ్డున పడ్డరు. ఫీజుల కట్టకపోవడంవల్ల కాలేజీలు మెడపట్టి బయటకు నెట్టేస్తున్నయి. ఫోర్త్ సిటీ, మూసీ సుందరీకరణ, మిస్ వరల్డ్ పోటీల పేరుతో వేల కోట్లు ఖర్చు చేస్తున్నరు కదా?... పేద విద్యార్థుల కోసం రూ.8 వేల కట్టలేరా? కాలేజీలు బంద్ అయితే విద్యార్థులు ఎటు పోవాలి? ఏం చదువుకోవాలి? వాళ్ల భవిష్యత్తును రోడ్డున పడేస్తారా? ఇదేనా ఇందిరమ్మ రాజ్యమంటే? కాలేజీ యాజమాన్యాలకు ఆనాడే చెప్పిన. కాంగ్రెస్ టోకెన్ల పేరుతో మోసం చేస్తదే తప్ప మీ గోడు పట్టించుకోదని. ఆనాడు చర్చలకు వెళ్లి వాళ్ల మాటలు నమ్మి కాలేజీ యాజమాన్యాలు మోసపోయాయి. కాలేజీ యాజమన్యాల్లో కొందరు కాంగ్రెస్ తొత్తులు ఉన్నందునే వాళ్లకు ఈ దుస్థితి ఏర్పడింది. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి. తక్షణమే ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నా. పేదోడు తెలంగాణలో బతకాలంటే భయమైతుంది. రోగమొస్తే కూడా పట్టించుకునే నాథుడే లేకపాయే... ఆరోగ్యశ్రీ పథకం కూడా మాదేనని జబ్బలు చర్చుకున్న కాంగ్రెసోళ్లు ఆరోగ్యశ్రీ బకాయిలు ఇవ్వకపోవడంతో రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు రానీయ్యడం లేదు. ఆరోగ్యశ్రీ పైసలియ్యనిదే ఆసుపత్రుల్లోకి అడుగు పెట్టనిచ్చేదే లేదని ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులోళ్లు తెగేసి చెబుతున్నరు. పోనీ సర్కారు దవాఖానాకైనా పోదామంటే సూది లేకపాయే, మందు బిళ్లలు కూడా లేకపాయే. మరి ఏం చేయాలే.... పేదోడికి రోగమొస్తే చావాల్సిందేనా? ఇందుకోసమేనా? కాంగ్రెస్ కు ఓటేసి గెలిపించింది? ప్రజా సమస్యలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ స్పందించవు. ఏమైనా అంటే కాళేశ్వరం, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్, గొర్రెల స్కాం అంటూ రచ్చ చేస్తూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నయ్.

రైల్వే స్టేషన్ల అభివృద్ధి పేరుతో అదానీ, అంబానీలకు కట్టబెట్టాలని చూస్తున్నారంటూ కమ్యూనిస్టులు చేసిన వ్యాఖ్యలను మీడియా ప్రస్తావించగా....

అభివృద్ధిపై కాకుండా అడ్డగోలుగా మాట్లాడుతున్నారు కాబట్టే కమ్యూనిస్టులు కాలగర్భంలో కలిసిపోయారు. అభివృద్ధి కోసం పనిచేస్తున్నాం కాబట్టే 2 సీట్ల నుండి కేంద్రంలో వరుసగా 3 సార్లు అధికారంలోకి వచ్చినం.

**నక్సల్స్ ఎన్ కౌంటర్ పై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ...**

నక్సల్స్ చంపింది ఎవరిని? పేదలు, ఆదివాసీ బిడ్డలనే కదా? మావోయిస్టులను సమర్ధించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చిట్టెం నర్సిరెడ్డి, శ్రీపాదరావు, రాగ్యానాయక్ సహా ఎంతో మందిని నక్సల్స్ చంపారు. డ్యూటీ చేస్తున్న పోలీసులను కూడా నక్సల్స్ పొట్టనపెట్టుకుంటున్నారు కదా? పొట్ట కూటి కోసం డ్యూటీ చేస్తున్న వాళ్లను చంపితే మాట్లాడరా? చనిపోయినోళ్లంతా ప్రజలే కదా? తెలుగు వాళ్లే కదా?

దేశాన్ని రక్షించే ఆర్మీ, చట్టాన్ని కాపాడే పోలీసుల చేతుల్లోనే తుపాకీ ఉండాలి. అట్లా కాకుండా పర్మిషన్ లేకుండా ఎవరి చేతిలో తుపాకీ ఉన్నా సంఘ విద్రోహ శక్తిగానే భావిస్తాం. అందుకే తుపాకీ విడిచి లొంగిపోవాలని కోరుతున్నాం. అట్లా కాకుండా తుపాకులతో మేం కాలుస్తూనే ఉంటాం... మీరు మాత్రం చర్చలకు పిలవాల్సిందేనంటే వినే పిరికిపంద ప్రభుత్వం మాది కాదు. నరేంద్రమోదీ ఆధ్వర్యంలో అమిత్ షా నాయకత్వంలో 2026 మార్చి నాటికి మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించి తీరుతాం. జాతీయ జెండా ఎగరనీయని, ఎన్నికలే జరపనీయని, ఆదివాసీ అమాయకబిడ్డలను చంపేటోళ్లను ఏమనాలి? ఏ దేశపోళ్లు అనాలే... మీరే చెప్పండి.

**పంచాయతీ ఎన్నికల జాప్యంపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ...**

గ్రామ పంచాయతీలకు ఒక్క పైసా ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించే దమ్ములేక రకరకాల సాకులు చెబుతోంది. గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులిస్తోంది కేంద్రమే. అయినా కేంద్రం ఏమీ ఇవ్వడం లేదని తిట్టడం సిగ్గు చేటు.

**రాష్ట్రంలో యూరియా కొరత, రైతుల కష్టాలపై స్పందిస్తూ...**

రబీ సీజన్ లో 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను పంపితే... 2.05 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మిగిలింది. ఆ యూరియాను ఏం చేశారో చెప్పడం లేదు. పంపిణీ చేసిన యూరియాను ప్లాన్ ప్రకారం సరఫరా చేయడం లేదు. పైగా యూరియాను బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నా పట్టించుకోరు. నిన్ననే మిర్యాలగూడలో ఎమ్మెల్యే గన్ మెన్ లారీ యూరియాను బ్లాక్ మార్కెట్ కు తరలించబోవడమే ఇందుకు నిదర్శనం. అసలు కాంగ్రెస్ కు ప్లానే లేదు. రబీ యూరియా వినియోగంపై లెక్కా పత్రం లేదు. ఇదేమని అడిగితే... కేంద్రాన్ని బదనాం చేయడమే పెట్టుకున్నరు. ఇకనైనా కేంద్రాన్ని బదనాం చేయడం పక్కనపెట్టి యూరియా విషయంలో రైతులు పడుతున్న బాధను అర్ధం చేసుకుని ప్రణాళిక ప్రకారం పంపిణీ చేయాలని కోరుతున్నా.

# తీరనున్న యూరియా కష్టాలు

లేకపోతే పంటలు తీవ్రంగా దెబ్బతింటాయి. అందువల్ల యూరియా సరఫరా నిరంతరంగా కొనసాగేలా చూడాలని కేంద్రాన్ని కోరాం" అని తెలిపారు. అలాగే అంతకు ముందు నెలల్లో ఏర్పడిన యూరియా లోటును పూడ్చే విధంగా ఈ నెలలో 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కావాలని కోరామని చెప్పారు. అలాగే రానున్న 10 రోజుల్లో మరో లక్ష మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయాలని కోరగా.. ఈ వారంలో 80 వేల మెట్రిక్ టన్నులను సరఫరా చేస్తామని రజత్ కుమార్ మిశ్రా చెప్పారని అన్నారు. అందులో భాగంగానే ఈ రోజు %ఖూూ, జ×ూ, చీదీజూ% కంపెనీల నుండి %=వని +త్ఖువె (2700 మీ), +చీ =బవఎ (8100 మీ), +త్ఖువె ఝతీఎశీఅవ (7800 మీ), జుఅనమ్ఖుజశీతీ (13000 మీ), ఔఖంఱ ాాశ్రీఎశీర్ఖుఅ (8100 మీ%) ఓడల ద్వారా 40 వేల మెట్రిక్ టన్నులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసిందని మంత్రి అన్నారు. ఈ కేటాయించిన యూరియా త్వరలోనే రాష్ట్రానికి చేరుకుంటుందని, దీంతో తెలంగాణ రైతుల యూరియా కష్టాలు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దీంతో, సెప్టెంబర్ మొదటి 15 రోజులలోనే 1,04,000 మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రానికి సరఫరా చేసినట్లు అవుతుందని మంత్రి గారు వివరించారు. మిగతా మొత్తం కూడా పంపించడానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని మంత్రిగారు అన్నారు. దేశీయ ఉత్పత్తి ఆశించిన స్థాయిలో లేకపోయినా, దిగుమతుల ద్వారా తెలంగాణకు ప్రాధాన్యత ఇస్తామని కేంద్ర కార్యదర్శి హామీ ఇచ్చారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.

## బీహార్ సర్ ప్రక్రియపై సుప్రీం కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,సెప్టెంబరు15 ( వెలుతురు):**
అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బీహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ పక్రియపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం అనుసరించిన పద్ధతిలో ఏదైనా చట్టవిరుద్ధంగా జరిగితే మొత్తం సర్ పక్రియను రద్దు చేస్తామని ఈసీని హెచ్చరించింది. సర్‌కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా సర్ పక్రియపై ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.రాజ్యాంగబద్ధ సంస్థ అయినా ఎన్నికల సంఘం బీహార్ సర్ పక్రియలో చట్టం, తప్పనిసరి నియమాలను పాటిస్తుందని తాము భావిస్తున్నామని ధర్మాసనం అభిప్రాయం వ్యక్తం చేసింది. బీహార్ సర్ పక్రియపై ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని.. తుది తీర్పు దేశవ్యాప్త సర్ ప్రక్రియకు వర్తిస్తుందని పేర్కొంది. బిహార్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు ఎన్నికల కమిషన్ అనుసరించిన పద్ధతిలో ఏదైనా చట్టవిరుద్ధంగా కనిపిస్తే మొత్తం 'ఎస్ఐఆర్'ను రద్దు చేస్తామని సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌ను హెచ్చరించింది. అయితే రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణలో సరైన నిబంధనలను పాటించిందని భావిస్తున్నట్లు- పేర్కొంది. బిహార్‌లో ఈసీ చేపట్టిన ఓటరు జాబితా సర్వేకు వ్యతిరేకంగా దాఖలైన వ్యాజ్యాన్ని విచారించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుతం ఈ విషయంపై తాము అసంపూర్తి అభిప్రాయాలు వెల్లడించలేమని..అక్టోబర్ 7న తుది వాదనలు విన్న తర్వాత తీర్పును వెలువరిస్తామని అత్యున్నత న్యాయస్తానం స్పష్టం చేసింది. బిహార్ సమగ్ర ప్రత్యేక సవరణలో ఆధార్‌ను కూడా కచ్చితంగా గుర్తింపు కార్డుగా పరిగణించాలని ఇటీవల సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌కు మార్గదర్శకాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ముందస్తు సూచనలు ఉ న్నప్పటికీ ఎన్నికల అధికారులు ఆధార్‌ను గుర్తింపు కార్డుగా అంగీకరించడానికి నిరాకరిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో న్యాయస్థానం ఎన్నికల కమిషన్ చూపిస్తున్న అభ్యంతరాలను తోసిపుచ్చింది. ఆధార్ పౌరసత్వాన్ని నిరూపించలేక పోయినప్పటికీ.. అది ప్రజల గుర్తింపుకు చట్టబద్ధమైన రుజువుగా మిగిలిపోయిందని స్పష్టం చేసింది. కాగా బిహార్ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఓటరు జాబితాల 'ప్రత్యేక సమగ్ర సవరణ' పేరిట భాజపాతో కలిసి ఓట్ల చోరీకి ప్రయత్నిస్తోందని విపక్ష కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. గత కొన్నేళ్లుగా దేశంలో జరుగుతున్న అన్ని ఎన్నికల్లో ఇదే విధంగా ఓట్ల చోరీ జరిగిందని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇప్పటికే ఈ విషయంలో ఆధారాలను ప్రజలముందుకు తీసుకువచ్చామని..త్వరలో మరిన్ని ఆధారాలతో ఈసీ చేస్తున్న చట్ట వ్యతిరేక చర్యలను బయటపెడతామని హెచ్చరించారు.

## ఫీజు రియంబర్స్‌మెంటులో ఇంత నిర్లక్ష్యమా?

### ప్రభుత్వ తీరుపై మండిపడ్డ ఎంపి ఈటెల

**హుజూరాబాద్,సెప్టెంబరు15 ( వెలుతురు):**
తెలంగాణలోని ఇంజినీరింగ్ కళాశాలలకు గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించలేదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వమే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తోందని అన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని మధువని గార్డెన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. తెలంగాణలో రూ.9 వేల కోట్ల రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నట్లు చెప్పారు. విదేశాలకు వెళ్లే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం వల్ల చాలా నష్టం జరుగుతోందని ఆరోపించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో బీసీ విద్యార్థులకు వందశాతం రీయింబర్స్‌మెంట్ ఇస్తామని హామీ ఇచ్చి.. పాత విధానంలోనూ రీయింబర్స్‌మెంట్ చేయలేదని విమర్శించారు. ప్రభుత్వాలు మారినప్పుడు పాత బకాయిలు కూడా చెల్లించాల్సిందేనని అన్నారు. తన రాజకీయ జీవితంలో ఇంత బాధ్యత లేని ప్రభుత్వాన్ని చూడలేదు. సమస్యలు పరిష్కరించకపోతే.. ప్రజాగ్రహానికి గురికాక తప్పదు. రాష్ట్రానికి కావాల్సిన యూరియాను ఒక సంవత్సరం ముందు నిల్వ చేసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్లే రాష్ట్రంలో యూరియా కొరత తలెత్తింది. కేంద్ర ప్రభుత్వంపై నెపం నెట్టకుండా ఎరువులు వచ్చే మార్గంపై దృష్టి పెట్టాలని ఈటల సూచించారు.



## కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై పరువు నష్టం దావా వేసిన కెటిఅర్

మీడియా ప్లాట్‌ఫారమ్‌లపై హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో పరువు నష్టం దావా వేశారు. తప్పుడు మరియు నిరాధారమైన ఆరోపణలను ప్రచురించినందుకు, ప్రసారం చేసినందుకు ఆయన ఈ దావా వేశారు. ఈ దావాలో, పరువు నష్టం కలిగించినందుకు గాను తప్పుడు సమాచారాన్ని తొలగించాలని, బహిరంగ క్షమాపణ చెప్పాలని, మరియు లి₹లి10 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తన న్యాయవాది ఎం/ఎస్ పి.వి. జానకీ %డ% అసోసియేట్స్ ద్వారా ఈ కేసు నమోదు చేశారు.

కేటీఆర్ ఫిర్యాదులోని ముఖ్యాంశాలు:
2025 ఆగస్టు 8న బండి సంజయ్ తప్పుడు, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలలో తెలంగాణ ఎస్ఐబీ (స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్) దుర్వినియోగం, ఫోన్ ట్యాపింగ్ మరియు ఆర్థిక అవకతవకలకు కేటీఆర్‌ను ముడిపెట్టారు. ఏబీఎన్ తెలుగు, ఎన్టీవీ, టీవీ5, వీ6, ఏఎన్ఎన్ తెలుగు వంటి టీవీ ఛానెళ్లు, అలాగే ఇండియా టుడే, ఎన్డీటీవీ, డెక్కన్ హెరాల్డ్, టైమ్స్ ఆఫ్ ఇండియా వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, మరియు ఎక్స్ (ట్విట్టర్), యూట్యూబ్, గూగుల్, మెటా (ఫేస్‌బుక్/ఇన్‌స్టాగ్రామ్) వంటి సోషల్ మీడియా సంస్థలు ఈ వ్యాఖ్యలను విస్తృతంగా ప్రసారం చేశాయి. ఈ వ్యాఖ్యలు కేవలం పరువుకు భంగం కలిగించడమే కాకుండా, కేటీఆర్ వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడానికి ఉద్దేశించినవిగా ఉన్నాయి. 2025 ఆగస్టు 11న లీగల్ నోటీసు పంపినప్పటికీ, బండి సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పడానికి నిరాకరించారు. దీంతో కేటీఆర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. బండి సంజయ్ కేవలం రాజకీయ కక్షతో "విపరీతమైన నిందారోపణలతో దుష్ప్రచారానికి" పాల్గపడ్డరని ఈ ఫిర్యాదులో కేటీఆర్ పెర్కోన్నారు అధికారంలో ఉన్న కేంద్ర మంత్రి ఇటువంటి బాధ్యతారహితమైన, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేయడం వల్ల ప్రజా ప్రతినిధుల విశ్వసనీయత, గౌరవానికి తీవ్రమైన పరిణామాలు ఉంటాయని కూడా ఈ ఫిర్యాదు నొక్కి చెప్పింది. తన కేసులో కెటిఅర్ డిమాండ్ చేసిన పరిహారాలు బండి సంజయ్ నుండి బేషరతుగా, బహిరంగ క్షమాపణ. తదుపరి పరువు నష్టం కలిగించే కంటెంట్‌ను ప్రచురించకుండా లేదా ప్రసారం చేయకుండా నిందితులను నిరోధించే ఉత్తర్వులు ఇవ్వాలని విజ్ఞప్తి ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు, మీడియా పోర్టల్‌ల నుండి పరువు నష్టం కలిగించే కథనాలు, వీడియోలు, పోస్టులను తక్షణమే తొలగించాలి.

### రాబోయే 10 ఏళ్లలో తెలంగాణలో

# రైల్వేల అభివృద్ధికి దాదాపు 80 వేల కోట్లు ఖర్చు చేయబోతున్నాం





- గత పదేళ్లలో తెలంగాణలో రైల్వేల కోసం 42 వేల కోట్ల రూపాయలకుపైగా ఖర్చు చేసిన కేంద్రం
- వందే భారత్ తో 3 కోట్ల మంది ప్రయాణం
- రాష్ట్రానికి మరో 2 వందే భారత్ రైళ్లు రాబోతున్నాయి
- మోదీ హయాంలో రైల్వే స్టేషన్ల, రైల్వేల రూపురేఖలే మారిపోయినయ్
- "అమృత్ భారత్" పథకంతో మినీ ఎయిర్ పోర్టుల్లా మారుతున్న రైల్వే స్టేషన్లు
- మంచిర్యాలకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయిస్తా
- కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు
- మంచిర్యాలలో "వందే భారత్" రైలు హాల్టింగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బండి
- వందే భారత్ రైలును జెండా ఊపి ప్రారంభించిన కేంద్ర మంత్రి

మంచిర్యాల వెలుతురు సెప్టెంబర్ 15:

***రాబోయే 10 ఏళ్లలో తెలంగాణలో రైల్వేల అభివృద్ధికి దాదాపు 80 వేల కోట్లు ఖర్చు చేసేందుకు కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసినట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు. మోదీ పాలనలో రైల్వే వ్యవస్థ రూపురేఖలే మారిపోయాయని, గత పదేళ్లలో ఒక్క తెలంగాణలోనే రైల్వేల అభివృద్ధి కోసం 42 వేల కోట్ల రూపాయలకుపైగా ఖర్చు చేసిందని చెప్పారు. భారతీయ రైల్వే చరిత్రలో వందే భారత్ విప్లవం సృష్టిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా 150 వందే భారత్ రైళ్ల ద్వారా ఇప్పటి వరకు 3 కోట్ల మంది ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేర్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 5 వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయని, అతి త్వరలోనే మరో 2 వందే భారత్ రైళ్లు రాబోతున్నాయని ప్రకటించారు. సికింద్రాబాద్ నుండి పూణె వరకు, హైదరాబాద్ నుండి నాందెడ్ వరకు కొత్త వందే భారత్ రైళ్లను నడపాలనే ప్రతిపాదనలు రడీ అయ్యాయని, త్వరలోనే రైల్వే మంత్రిత్వ శాఖ సానుకూల నిర్ణయం తీసుకోబోతోందని వెల్లడించారు.***

మంచిర్యాలలో నేటి నుండి "వందే భారత్" హాల్టింగ్ సౌకర్యం అందుబాటులోకి వచ్చిన సందర్భంగా మంచిర్యాల రైల్వే స్టేషన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ తోపాటు రాష్ట్ర మంత్రి జి.వివేక్, స్థానిక ఎంపీ వంశీక్రిష్ణ, ఎమ్మెల్సీ అంజిరెడ్డి జెండా ఊపి వందే భారత్ రైలును ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు తరలివచ్చారు. జై బీజేపీ, జై బండి సంజయ్ నినాదాలతో మంచిర్యాల రైల్వే స్టేషన్ మారుమోగింది. కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేయడంతో అక్కడ గందరగోళం నెలకొంది. పరిస్థితిని గమనించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ మైక్ అందుకుని "మీరు ఇట్లా నినాదాలు, గొడవలు చేసి డిస్టబ్ చేస్తే ఇక్కడ ఒక్క అభివృద్ధి కూడా జరిగే అవకాశం లేదు. ఒక్క పని కూడా రాదనే సంగతి గుర్తుంచుకోవాలి" అని గట్టిగా చెప్పడంతో ఇరు పార్టీల కార్యకర్తల నినాదాలు సద్దుమణిగాయి.



ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ బండి సంజయ్ సహకారంతోనే మంచిర్యాలలో వందే భారత్ రైలు హాల్టింగ్ వచ్చిందని చెప్పారు. ప్రస్తుతం మంచిర్యాలలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేక ప్రజలు అల్లాడుతున్నారని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఫుట్ ఓవర్ బ్రిడ్జిని మంజూరు చేయాలని కేంద్ర, రాష్ట్ర మంత్రులను కోరారు. అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ

భారతీయ రైల్వే చరిత్రలో "వందే భారత్" చరిత్ర సృష్టిస్తోంది. 2019 ఫిబ్రవరిలో మొదటి "వందేభారత్" రైలు ప్రారంభమైంది. ఇయాళ దేశవ్యాప్తంగా 150 వందేభారత్ రైళ్లు నడుస్తున్నయ్. ఈ రైళ్ల ద్వారా ఇప్పటి వరకు 3 కోట్ల మంది ప్రయాణీకులను గమ్యస్థానాలను చేర్చింది. ఒక్కో వందే భారత్ రైలు తయారీకి 130 కోట్లు ఖర్చవుతుంది. మన రాష్ట్రంలో 5 వందేభారత్ రైళ్లు (సికింద్రాబాద్ – విశాఖపట్నం (2 రైళ్లు), సికింద్రాబాద్ – తిరుపతి (1 రైలు), కాచిగూడ – యశవంత్‌పూర్ (1 రైలు), సికింద్రాబాద్ – నాగపూర్ (1 రైలు)) నడుస్తున్నాయి. ఇయాళ మన ప్రాంత ప్రజలకు సైతం సోమవారం రోజు నుండి వందే భారత్ రైలు అందుబాటులోకి రావడం, నా చేతుల మీదుగా జెండా ఊపి ప్రారంభించడం చాలా సంతోషంగా ఉంది. త్వరలోనే మన రాష్ట్రానికి మరో 2 వందే భారత్ రైళ్లు నడపాలనే ప్రతిపాదన కూడా ఉంది. 1.హైదరాబాద్ నుండి పూణె, 2. హైదరాబాద్ నుండి నాందెడ్ వరకు వందే భారత్ రైళ్లను నడపాలనే ప్రతిపాదనలు రడీ అయ్యాయి. త్వరలోనే రైల్వే మంత్రిత్వ శాఖ సానుకూల నిర్ణయం తీసుకోబోతోంది.

తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రం ప్రత్యేక దృష్టి సారించింది. 2014 బడ్జెట్ లో యూపీఏ ప్రభుత్వం తెలంగాణకు కేటాయించిన రైల్వే బడ్జెట్ ఎంతో తెలుసా? 258 కోట్లు మాత్రమే. మరి ఇయాళ... ఈ ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే 5 వేల 336 వేల కోట్లు తెలంగాణలో రైల్వేలకు కేటాయించారు. అంటే 20 రెట్లు ఎక్కువ ఖర్చు చేయబోతున్నం. రాష్ట్ర చరిత్రలో బహుశా ఇంత పెద్ద మొత్తంలో నిధులను కూడా ఎన్నడూ కేటాయించలేదు. ప్రధానమంత్రికి అన్ని రాష్ట్రాలు సమానమే.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో దేశంలోని రైల్వే స్టేషన్ల, రైల్వేల రూపురేఖలే మారిపోయినయ్. ఒక్క తెలంగాణలోనే మొత్తం 40 రైల్వే ప్రాజెక్టుల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయి. సుమారు 4,353.26 కి.మీ. మేరకు కొనసాగనున్నాయి. రాబోయే 10 వీటి నిర్మాణం కోసం దాదాపు 80 వేల కోట్ల రూపాయలకుపైగా కేంద్రం ఖర్చు చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఇప్పటికే గత పదేళ్లలో 42 వేల కోట్ల రూపాయలకుపైగా తెలంగాణలోని రైల్వేల అభివృద్ధికి మోదీ ప్రభుత్వం ఖర్చు చేసింది. మీకో విషయం చెప్పాలి.

2014 ముందు వరకు భారతీయ రైల్వేలు, రైల్వే స్టేషన్లంటే ఎట్లుండేవో మీకు తెలుసు. కంపు కొట్టే టాయిలెట్లు, అశుద్ధంతో నిండిపోయిన రైల్వే ట్రాక్ లు, కనీస సౌకర్యాల్లేక ఇబ్బంది పడుతున్న జనం, ఎప్పుడు ట్రైన్ వస్తుందో తెలియక టెన్షన్ పడుతున్న ప్రయాణీకులే కన్పించే వాళ్లు... కానీ మోదీ పాలనలో రైల్వే స్టేషన్ల రూపురేఖలు మారిపోతున్నయ్. మొన్నా మధ్య చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభానికి పోతే షాక్ అయ్యా. అద్భుతంగా నిర్మించారు. ఎయిర్ పోర్ట్ లా కన్పిస్తోంది. "అమృత్ భారత్" పథకం కింద రాష్ట్రంలోని దాదాపు 40 రైల్వే రైల్వే స్టేషన్లను దాదాపు 2 వేల 751 కోట్ల రూపాయలను ఖర్చు చేసి అభివృద్ధి చేస్తున్నం.

ఏ దేశంలోనైనా రైల్వే, రోడ్లు, ఏవియేషన్ వ్యవస్థ బాగుపడితేనే ఆ దేశంలో ఆర్థిక వ్యవస్థ పరుగులు పెడతుంది. ఈ విషయాన్ని గుర్తించిన మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఈ రంగాలకు ఏటా లక్షలాది కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోంది. తెలంగాణలో జాతీయ రహదారుల అభివృద్ధి కోసం గత 11 ఏళ్లలో లక్షన్నర కోట్ల రూపాయలు ఖర్చు చేసినం. అట్లాగే గత 11 ఏళ్లలో తెలంగాణలో రైల్వేల అభివృద్ధి కోసం 30 వేల కోట్లకుపైగా ఖర్చు చేసినం. ఇవన్నీ చేయడంవల్లే 11వ స్థానం నుండి 4వ స్థానానికి చేరిందంటే అందుకు కారణం మోదీ ప్రభుత్వ దూరదృష్టి, సమర్ధ



నాయకత్వంవల్లే రైల్వే శాఖ లాభాల బాటలో నడుస్తోంది. మంచిర్యాల ప్రజలకు శుభవార్త. అతి త్వరలో రూ.3.5 కోట్ల వ్యయంతో మంచిర్యాలలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని మంజూరు చేస్తా. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. అట్లాగే మంచిర్యాల స్టేషన్ ను అమ్రుత్ భారత్ పథకం కింద రూ.26 కోట్లు ఖర్చు చేస్తున్నాం. అతి త్వరలో మంచిర్యాలను ఎయిర్ పోర్టులా మారుస్తాం. మంచిర్యాలతో నాకు అనుబంధం ఉంది. ఏబీవీపీ నుండి ఇప్పటి వరకు మంచిర్యాలకు వచ్చి వెళుతుంటా. మంచిర్యాల అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తాం. రాజకీయాలను పక్కనపెడదాం. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పదేపదే కేంద్రంపైన, మోదీని తిట్టడంవల్లే రాష్ట్రానికి నిధులు రాకుండా పోయాయి. వాటిని పక్కనపెట్టి కేంద్ర, రాష్ట్రాలు సమన్వయంతో అభివృద్ధి చేసుకుందాం. వివేక్ ను కోరుతున్నా... దయచేసి కేంద్రాన్ని తిట్టడం ఆపాలని మీ మంత్రులకు చెప్పండి. రాష్ట్రానికి సహకరిస్తున్న ప్రధానమంత్రి మోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ లకు ధన్యవాదాలు చెప్పండి...

## కేటిఆర్ పరువు నష్టం కేసుపై స్పందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

*-కేటిఆర్ ఇజ్జత్ దావా వేసి బెదిరించే ప్రయత్నం చేస్తున్నారు*
*- న్యాయపరంగా ఎదుర్కొంటా..*
*- తొమ్మిది సార్లు జైల్ కు వెళ్ళి వచ్చినా... వందకు పైగా కేసులు ఉన్నాయి.*
*- కేటిఆర్ మాదిరిగా ఇజ్జత్ దావాలు వేయాలంటే తాము అనేక కేసులు వేయవచ్చు*
*- నేను రాజకీయంగా ఎదుర్కొంటా... బెదిరించేందుకు ఇజ్జత్ దావా వేయను*
*- తాను లవంగం తింటే తంబాకు అన్నారు.*
*- దమ్ముంటే కుటుంబ సభ్యులతో దేవుడు సన్నిధికి రమ్మని సవాల్ విసిరాను*
*- కేటిఆర్ ఎందుకు రావడం లేదు*
*- అమెరికాలో ఎవరెవరికి ట్విట్ చేశావో? నీ సంగతి ఎందో త్వరలో అన్ని ఆధారాలతో బయటపెడతా*
*- తెలంగాణకు కేంద్రం 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సప్లై చేసింది*
*- కేవలం 9 లక్షల యూరియా మాత్రమే పంపిణీ చేశారు.*



*- మిగతా మూడు లక్షలు ఏమైంది...బ్లాక్ మార్కెట్ చేశారు*
*- కేటీఆర్ కు బండి సంజయ్ సవాల్*
*- నువ్వు డ్రగ్స్ తీసుకోలేదని ముందుకు వచ్చే ధైర్యం ఉందా?*
*- సిరిసిల్లలో వరదలు వస్తె కేటీఆర్ ఎందుకు స్పందించడు?*
*- వ్యక్తిగతంగా వద్దని చెప్పను. నేను రాజకీయ నాయకుడిని రాజకీయంగా ఎదుర్కొంటా.*
*- పట్టు సోఫాలో కూర్చున్న నేత డిఫమేషన్ ( పరువు నష్టం) కేసుల వెనుక దాక్కొని ఈ వీధి పోరాట యోధుడిని సైలెంట్ చేయలేరు!*
*- నన్ను ఆర్ఎస్ఎస్ తీర్చిదిద్దింది, ఏబీవీపీతో వీధుల్లో పోరాడాను .*
*- బీజేపీతో ప్రజల కోసం పోరాడుతున్నాను.*
*- నేను 9 సార్లు జైలుకి వెళ్లాను,*
*- బీఆర్ఎస్ ప్రభుత్వం నాపై 100కి పైగా కేసులు వేసింది.*
*- నన్ను బ్లాక్‌మెయిల్ చేయాలనుకుంటున్నారా? గుడ్ లక్ మీకు.*

కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 15:



# సంపాదకీయం.. పాలకులు అధికార దాహం వీడాలి !




దేశంలో దాదాపు ఏడెనిమిదేళ్ల పాటు జిఎస్టీతో వాతలు పెట్టిన మోడీ ప్రభుత్వం ఇప్పుడు, అందులో కొంత తగ్గించి నెక్స్ట్ జనరేషన్ సంస్కరణలు అంటోంది. ఆషాడం సేల్ లాగా తగ్గించి అమ్ముకోవడం అన్నది గుర్తుకు వస్తోంది. నిజానికి జిఎస్టీ ప్రకటించినప్పుడు అతిపెద్ద సంస్కరణగా అభివర్ణించారు. ఇప్పుడేమో రాబోయే తరం కోసం సంస్కరణ అంటున్నారు. ఇంతకాలం నెత్తీనోరు మొత్తుకున్నా జిఎస్టీ తగ్గించలేదు. ఇన్సూరెన్స్‌లపైనా జిఎస్టీ విధించారు. దాదాపు 11 ఏళ్ల తరవాత ఇంకా కాంగ్రెస్‌ను విమర్శిస్తూ..వారు అలా చేశారని..ఇలా చేశారని విమర్శిస్తూ పాలన సాగించడం సిగ్గుచేటు. జిఎస్టీ తగ్గింపులే కాదు...నిరుద్యోగ సమస్యకు కూడా పరిష్కారం చూపాలి. అలాగే ఉపాధి, ఉద్యోగాల కల్పనపై దృష్టి సారించాలి. యూరియ కొరతతో రైతులు నానా అగచాట్ల పడుతున్నా, వారు తిరుగుబాటు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇదో హెచ్చరికగా చూడాలి. రైతాంగం పట్ల నిర్లక్ష్యానికి పరాకాష్టగా చూడాలి. ధరలను అదుపు చేయడం, నిరుద్యోగం లేకుండా చూడడం, పండించిన ధాన్యం లేదా వ్యవసాయ ఉత్పత్తులు కొనేలా మార్కెట్ సౌకర్యం కల్పించడం చేయాలి. బంగారం ధరలు పెరుగుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. అంతర్జాతీయ కారణాలు చూపి తప్పించుకోకుండా ఎందుకిలా పెరుగుతున్నాయో విశ్లేషించాలి. అలాగే రాజకీయ పెత్తనం తగ్గాలి. రాజకీయంగా ఎంపిలు, ఎమ్మెల్యలే జీతభత్యాలు తగ్గాలి. ఒక్కో ఎమ్మెల్యేకు కనీసం 4-5 లక్షల మధ్య నెలవారీ చెల్లింపులు అధికంగా భావించాలి. డబుల్ పెన్షు వెంటనే ఆగాలి. కేంద్రంతో పాటు రాష్ట్రాలు కూడా ఖర్చులు తగ్గించు కోవాలి. ఆస్తులు అమ్ముకోవడం ద్వారా ఆస్తులు సమకూర్చాలన్న భవన సరికాదు. పొరుగుదేశాల్లో ఆందోళనలు కనువిప్పు కావాలి. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో ప్రజల తిరుగుబాటుకు కారణాలు తెలుసుకుని మనవద్ద కూడా అలాంటివి జరక్కుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. చిన్నదేశాల్లో అస్థిరతకు విదేశీ హస్తం కూడా కారణం ఉండవచ్చు. అయితే ప్రజల్లో అసంతృప్తి, అసహనం గూడుకట్టుకొని ఉండడం వల్లనే తిరుగుబాట్లు వస్తున్నాయి. ఇలాంటి సందర్భాల్లో విదేశీ శక్తి కూడా తోడవుతుండవచ్చు. ఎందుకంటే ధరలు, అణచివేత, నిరుద్యోగం, రైతుల సమస్యలు ఇత్యాదివన్నీ ప్రజల్లో ఆందోళనకు కారణంగా చూడాలి. ఇందిరాగాంధీ అధికారంలో ఉన్నప్పుడు తన ప్రభుత్వానికి ఇబ్బంది ఏర్పడినప్పుడల్లా విదేశీ హస్తం అని నిందించేవారు. ఇప్పుడు మోడీ కూడా పదేపదే కాంగ్రెస్‌ను బూచిగా చూపి తప్పించుకో జూస్తున్నారు. ప్రభుత్వాలు, వ్యవస్థలలో అవినీతి పెరిగిపోవడం వల్లనే మన దేశం అభివృద్ధి చెందాల్సి నంతగా చెందలేదు. రాజకీయ లాలూచీ, అవినీతి కారణంగా దేశం భ్రష్టు పట్టిపోతోంది. రాజ్యాంగబద్ధ సంస్థలలో కూడా అవినీతి చొరబడటం వల్ల సామాన్యులకు న్యాయం దొరకని దుస్థితి ఏర్పడింది. వివేకా నందరెడ్డి హత్య జరిగి ఆరేల్లయినా తేల్చలేక పోయారు. సిబిఐ, ఇడి కేసులు కూడా ఏమీ తేల్చడం లేదు. కాళేశ్వరం,ఇ-కార్ రేసులో అవినీతిని నిగ్గ తేల్చడం లేదు. కేసులే అపరిష్కృ తంగా ఉన్నాయంటే న్యాయ వ్యవస్థపైన, ప్రభుత్వాలపైన ప్రజలకు నమ్మకం ఎలా ఉంటుందన్నది పాలకులు ఆలోచన చేయాలి. నేపాల్‌లో కేవలం ఒక్క కారణంతోనే తిరుగబాటు రాలేదు. ప్రభుత్వంపై ప్రజల్లో అప్పటికే అసంతృప్తి గూడుకట్టుకొని ఉంది.అనేక అంశాలు ఇందుకు తోడయ్యాయి. శ్రీలంకలో కూడా ఆ దేశ అధ్యక్షుడి భవనంపై ప్రజలు దాడి చేసి అధ్యక్షుడి బెడ్ రూంలోనూ, స్నానాల తొట్టిలోనూ కూర్చొని ఫొటోలకు పోజులిచ్చారంటే ప్రభుత్వంపై ఎంత విరక్తి చెందారో అర్థం చేసుకోవచ్చు. ఆ తిరుగు బాట్ల తర్వాత శ్రీలంక, బంగ్లాదేశ్‌లో ప్రభుత్వాలు మారినా ప్రజల జీవితాలు మాత్రం బాగుపడలేదు. గతంలో విప్లవాలన్నీ పాలకులు అవినీతి, అక్రమాలు,నిరంకుశంపైనే వచ్చాయి. మనదవేశంలో రోజువారీ కేసులన్నీ రాజకీయాల కు సంబంధించినవిగానే ఉంటున్నాయి. వాటి చుట్టే కోర్టు తీర్పులు తీరుగుతు న్నాయి. అనేక కేసుల్లో న్యాయం దక్కడం లేదన్న ఆందోళన ప్రజల్లో ఉంది. ఇవన్నీ కూడా మననం చేయాలి. సమీక్షించాలి. అందువల్ల న్యాయ వ్యవస్థపైనా ఇక్కడి ప్రజలు విశ్వాసం కోల్పోకుండా భరోసా నింపాలి. కొంతకాలంగా శ్రీలంక, నేపాల్..బంగ్లాదేశ్ దేశాలలో చోటుచేసుకున్న ప్రజల ధర్మాగ్రహం నుంచి మన పాలకులు, రాజ్యాంగ వ్యవస్థల అధిపతులు నేర్చుకోవాల్సిన పాఠాలు అనేకం ఉన్నాయి. మన దేశం భిన్న జాతులు, భిన్న మతాలు, భిన్న సంస్కృతులు, భిన్న భాషల సమాహారం కనుక ఆ చిన్న దేశాలలో వలే తిరుగుబాట్లు చేయరని నమ్మరాదు. రైతుల ఉద్యమాన్ని తక్కువగా చూడరాదు. ఇందిరాగాంధీ వంటి శక్తిమంతమైన నేత కూడా ప్రజాగ్రహానికి గురికాక తప్పలేదు. ఎందుకంటే కేంద్ర రాష్ట్రాల్లో విపరీతమైన అవినీతి పెరిగింది. లంచగొండి తనం వేళ్లూనుకుపోయింది. ఏపనికీ లంచం లేనిదే ఫైలు కదలడం లేదు. రాజకీయ నేతలు విలాసాలకు అలవాటు పడ్డారు. అందుకే ప్రజలు పాలకులపై ప్రజలు విశ్వాసం కోల్పోతు న్నారు. ఆయా వ్యవస్థలపై ప్రజల్లో అసంతృప్తి గూడుకట్టుకుంటోంది.అధికారం లక్ష్యంగా సంక్షేమం పేరిట హద్దుమీరి ప్రజా ధనాన్ని పంచి పెట్టడంపై పన్ను చెల్లింపుదారులు ఆగ్రహంగా ఉన్నారు. ప్రజలకు అవసర మైన మౌలిక సదుపాయాలు కల్పించకుండా ప్రజలను సోమరులుగా మార్చే పథకాలను ప్రవేశపెట్టే అధికారం రాజకీయ నాయకులకు లేదు. ప్రజాధనానికి కాపలా ఉండి కేర్‌టేకర్‌గా పనిచేయాల్సిన వారు విచ్చలవిడిగా ఖర్చు పెడుతున్నారు. సామాన్యులకు న్యాయం ఎండమావిగా మారుతోంది. అధికార దుర్విని యోగం హద్దుమీరుతోంది. ఈ పరిస్థితిని చక్కదిద్దాల్సిన బాధ్యత అటు పాలకులు, ఇటు రాజ్యాంగ సంస్థల అధిపతులపై ఉంది. న్యాయాధికారులు, న్యాయమూర్తులు ఈ వాస్తవాన్ని గుర్తించి బాధితులకు సత్వర న్యాయం అందిస్తే ప్రజల్లో విశ్వాసం పెరుగుతంది. అలాగే రాజకీయా నాయకులు తమ అతిని వదులుకుని ప్రజలకోసం, దేశం కోసం పనిచేయడం అలవాటు చేసుకోవాలి. లేకుంటే ప్రజాగ్రహం తప్పదు.

## అమెరికాను సురక్షితం చేయడమే లక్ష్యం

**- నాగమల్లయ్య హత్యపై తీవ్రంగా స్పందించిన ట్రంప్**



**వాషింగ్టన్,సెప్టెంబర్15( వెలుతురు):** అమెరికాను మళ్లీ సురక్షితం చేయడమే తమ లక్ష్యమని అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించబోమని అన్నారు. అక్రమ వలసలను ఇక ఎంతమాత్రం ఉపేక్షించబోమని అన్నారు. డాలస్‌లో భారతీయుడు చంద్ర నాగమల్లయ్యను క్యూబా వలసదారుడు హత్య చేయడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. నిందితుడిపై ఫస్ట్ డిగ్రీ కింద అభియోగాలు నమోదు చేసి విచారణ చేపడతామని హామీ ఇచ్చారు. 'ఇకపై అక్రమ వలసదారులపై మెతకవైఖరి అవలంబించబోమని స్పష్టం చేశారు. 'చంద్ర నాగమల్లయ్య హత్య కేసులో సంచలన విషయాలు నా దృష్టికి వచ్చాయి. డాలస్‌లో మల్లయ్యకు మంచి పేరుంది. అలాంటి వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. తన భార్య, కుమారుడు చూస్తుండగానే ఈ ఘోరం జరిగింది. మా దేశానికి సంబంధం లేని, క్యూబాకు చెందిన అక్రమ వలసదారుడు ఈ దురాగతానికి పాల్పడ్డాడు' అని ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికలో పోస్టు పెట్టారు. గతంలో బైడెన్ ప్రభుత్వం అనుసరించిన విధానమే నిందితుడు మార్టినెజ్ అమెరికాలో నివసించేందుకు దోహదపడిందని ట్రంప్ విమర్శించారు. అతడికి నేరచరిత్ర ఉన్నా.. నివాసానికి అనుమతించారని ధ్వజమెత్తారు. 'ఈ వ్యక్తి క్రూరమైన నేరాలకు పాల్పడి గతంలోనే అరెస్టయ్యాడు. చిన్నారిపై లైంగిక దాడి, దొంగతనం తదితర కేసులు అతడిపై నమోదయ్యాయి. అలాంటి వ్యక్తిని బైడెన్ మా గడ్డ మీదకు తీసుకొచ్చారు. ఎందుకంటే క్యూబా ఇలాంటి దుష్టులను తమ దేశంలో ఉంచుకోవాలను కోలేదు. అక్రమ వలసదారులపై ఇక సున్నితంగా వ్యవహరించబోను' అంటూ ట్రంప్ పేర్కొన్నారు. సెప్టెంబర్ 10న ఓ మోటెల్‌లో నాగమల్లయ్య హత్యకు గురయ్యారు. క్యూబాకు చెందిన యోర్డానిస్ కోబోస్ మార్టినెజ్ ఈ దారుణానికి పాల్పడ్డాడు. వెంటనే పోలీసులు అతడిని అరెస్టు చేశారు. నాగమల్లయ్య తల నరికి మరీ దానికి చెత్తబుట్టలో వేయడంతో ఈ కేసు సంచలనంగా మారింది.

## మహిళలంతా కలసికట్టుగా నడవాలి

**- అప్పడే మహిళా సాధికారత సాధ్యం**

**- మహిళా సదస్సులో స్పీకర్ అయ్యన్నపాత్రుడు**



**తిరుపతి, సెప్టెంబర్15(వెలుతురు):** మహిళలు ముందుకు వస్తేనే ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందుతుందని ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు అన్నారు. వారు ముందున్న వ్యవహారాల్లో అభివృద్ధి సాగుతోందన్నారు. వారు చొరవ తీసుకుంటే ఏ పనైనా పూర్తి చేయగలని అన్నారు. తిరుపతిలో నిర్వహిస్తున్న మహిళా సాధికార కమిటీల జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. మహిళలను విద్యావంతులను చేయాలని, వారిని ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఈ సదస్సులో చర్చించిన అంశాలు కొత్త దిశను చూపిస్తాయన్నారు.మహిళలకు అన్ని రాష్ట్రాల్లో సమాన హక్కులు కల్పించాలి. విద్య, ఉపాధి అవకాశాలు అందించాలి. వారు విద్యావంతులైతే వృద్ధి సాధించగలం. ఏటా ఇలాంటి సమావేశాలు జరగాలని కోరుకుంటున్నాను. 3 ఏళ్లలో ఏపీకి రాజధాని సిద్ధం అవుతుంది. అప్పుడు అమరావతిలోనూ ఈ సదస్సు నిర్వహించే అవకాశం ఇవ్వాలి. అందరం కలిసి నడిస్తేనే మహిళా సాధికారత కార్యరూపం దాలుస్తుందని అయ్యన్నపాత్రుడు తెలిపారు

## ఆత్మవిశ్వాసమే విజయదీపం

**యువకుడా!**

నీ రక్తంలో రగులుతున్న జ్వాల
భవిష్యత్తు మార్గాన్ని వెలిగించే దీప్తి.
పుట్టుకతో వచ్చిన పరిమితులేంటి?
నమ్మకం ఉంటే పరిమితులు లేవు.
ఆత్మవిశ్వాసమే విజయదీపం,
స్వశక్తిపైనే గెలుపు ఆధారం.

విజయానికి మొదటి అడుగు
నీ మనసులోని విశ్వాసం.
"నేను సాధిస్తాను" అనే తపన
రాతిబండల దారిని కూడా పువ్వుల మార్గం చేస్తుంది.
పరుల ఆధారమేనని వెతుక్కుంటే
అరగంటలో విరిగిపోతావు,
స్వశక్తిని నమ్మితే మాత్రం
పర్వతాన్నే కదిలించగలవు.

శ్రమతోనే సమృద్ధి!
చెమట చిందించని పంట పసిపచ్చగా ఉండదు,
మంచి శ్రమ లేకుండా కలలు మేఘాల్లోనే కరిగిపోతాయి.
నిద్రలో చూసిన స్వప్నం
కష్టంలో కరిగినప్పుడు మాత్రమే
అది నిజమైన విజయంగా రూపం దాల్చుతుంది.
ప్రతీ చెమటబొట్టు
జీవిత విత్తనానికి నీరుగా మారుతుంది.

నైపుణ్యం అంటే కేవలం విద్య కాదు,
జీవన పాఠాల సారం కూడా.
చదివిన పుస్తకాలతో పాటు
చూసిన అనుభవం, విన్న సలహా,
పడిన పొరపాట్లూ కూడా
నైపుణ్యాలే అవుతాయి.
ఒక్కో రోజు నేర్చుకునే అలవాటు
నీ మనసుని మెరుగుపరచే అద్దం.

నిరంతర అధ్యయనం -
గతం చెప్పిన పాఠాలను అర్థం చేసుకో,
వర్తమానం ఇచ్చే అనుభవాన్ని జీర్ణించుకో,
భవిష్యత్తు కోసం కొత్త మార్గాలను అన్వేషించుకో.
నది ఎప్పుడూ ప్రవహిస్తూనే ఉంటుంది,
అదే నీకు స్ఫూర్తి కావాలి.
నిలిచిపోతే చెరువు అవుతావు,
ప్రవహిస్తే సముద్రం అవుతావు.

యువజనులారా!
మీరు కలలు కంటున్నారా?
అయితే వాటిని గాలిలో విడవద్దు.
ప్రతీ కలకు శ్రమ అనే పునాది వేసి అదేంటో నిరంతర సాధనతో కట్టడమని తీర్చిదిద్దండి.
ఆత్మవిశ్వాసం మీ శక్తి,
స్వశక్తి మీ పథం,
శ్రమ మీ సాధన,
నైపుణ్యం మీ ఆయుధం,
నిరంతర అధ్యయనం మీ దీపం.

ఎవరైనా "సాధ్యం కాదు" అని నవ్వితే ఆ నవ్వును విజయహాసంగా మార్చు.
ఎవరైనా "నీకు శక్తి లేదు" అంటే నీ కృషితోనే సమాధానం చెప్పు.
పట్టుదలతో సాగితే
అసాధ్యం అనే పదమే
నీ కాళ్లదగ్గర రాయి అవుతుంది.

విజయానికి దారి పొడవైనదే,
కానీ అది అందమైనదే.
అందులో అడ్డంకులు ఉంటాయి,
కానీ అవి పాఠాలే అవుతాయి.
విఫలమైతే భయపడవద్దు,
అది విజయం వైపు దారి చూపే గురువు.

యువత అంటే ఆశ.
ఆశ అంటే కాంతి.
కాంతి అంటే జీవితం.
జీవితం అంటే శ్రమతో కూడిన గెలుపు.

అందుకే యువకుడా, యువతీ!
నువ్వు నీమీదే నమ్మకం పెట్టుకో నీ చెమటతోనే భవిష్యత్తు చెక్కబడుతుంది.

నీ శ్రమతోనే సమాజం మలుపు తిరుగుతుంది.
నీ నైపుణ్యమే దేశానికి సంపద అవుతుంది.

నీ నిరంతర అధ్యయనం
నిన్ను ఒక సజీవ దీపస్తంభంగా నిలబెడుతుంది.

ఆత్మవిశ్వాసమే నీ కిరీటం,
స్వశక్తే నీ సింహాసనం,
శ్రమే నీ రాజదండం,
నైపుణ్యమే నీ ఖడ్గం,
నిరంతర అధ్యయనమే నీ దీపం.

ఇవన్నీ కలిసినప్పుడు
నీ పేరు చరిత్రలో చిరస్థాయిగా వెలుగుతుంది!




**మన్నారం నాగరాజు**

## పితృపక్షాలకు ప్రసిద్ధం ఈ తీర్థం

**- నైమిశారణ్యం సమీపంలో వెలసిన క్షేత్రం**

**- హత్యహరణ తీర్థంలో ఏటా లక్షల మంది రాక**

**లక్నో,సెప్టెంబర్15( వెలుతురు):** ఈ నెలలో పితృపక్షాలు నడుస్తున్నాయి. పితృదేవతలకు తర్పణాలు వదులుతున్నారు. తిథుల ప్రకారం తద్దినాలు పెట్టని వారు ఈ మాసంలో పెద్దలకు బియ్యం ఇస్తుంటారు. పుష్కరా లసమయంలోనూ నదీ తారాల్లోనూ, ప్రత్యేకించి గయలో శ్రాద్దాలుపెడుతారు. కాశీ కూడా ఇందుకు అనువుగా భావిస్తారు. అయితే మరో తీర్పం కూడా ఇందుకు ప్రత్యేకించి ఉంది. మన దేశంలో అనేక ప్రాముఖ్య పుణ్యక్షేత్రాలు, తీర్థయాత్ర స్థలాలు ఉన్నాయి. ఒకొక్క స్థలం ఒకొక్క విశిష్టతని కలిగి ఉంటుంది. అదే విధంగా మన దేశంలో పితృపక్ష సమయంలో ఒక తీర్ధయాత్ర స్థలంలో శ్రాద్ధ కర్మలను నిర్వహించడం. తర్పణం విడవడం.. పూర్వీకుల ఆత్మలకు శాంతిని ఇస్తుందని, వారు మోక్షాన్ని పొందుతారని నమ్ముతారు. ఈ ప్రదేశం శతాబ్దాలుగా సంచరిస్తున్న ఆత్మలకు మోక్షానికి మార్గదర్శకంగా పరిగణించబడుతుంది. ఇక్కడే పాండవులు తమ పూర్వీకులకు శ్రాద్ధ కర్మలను నిర్వహించినట్లు- స్థల పురాణం..ఉత్తరప్రదేశ్‌లోని హర్డోయ్ జిల్లాలో ఉన్న హత్య హరణ తీర్థం,పితృపక్ష సమయంలో ప్రపంచానికి , మరణానంతర జీవితానికి మధ్య దూరాన్ని తొలగిస్తుంది. ఈ పవిత్ర స్థలం పూర్వీకులను ఋణం నుంచి విముక్తి, చేయడమే కాదు సంచరించే ఆత్మలకు శాంతిని, మోక్షాన్ని



అందించే తీర్థ యాత్రా స్థలంగా యుగయుగాల కాలం నుంచి ప్రసిద్ధి చెందింది. రామాయణం, మహాభారత కాలం నుంచి కొనసాగుతున్న సంప్రదాయాలు ఈ ప్రదేశాన్ని మరింత ముఖ్యమైనవిగా చేశాయి. భూమి మధ్యలో ఉన్న పవిత్ర స్థలం ఈ పుణ్యక్షేత్రం హర్డోయ్ జిల్లాలోని బెనిగంజ్ ప్రాంతంలో ఉంది. ఈ ప్రదేశం భూమి మధ్యలో ఉందని చెబుతారు. పితృపక్ష సమయంలో ఈ ప్రదేశం ప్రపంచానికి , మరణానంతర జీవితానికి మధ్య దూరాన్ని తొలగిస్తుందని నమ్ముతారు. ఇక్కడ చేసే నిర్వహించే శ్రాద్ధ కర్మలు, ప్రార్థనలు నేరుగా పూర్వీకులకు చేరుతాయని నమ్మకం. అందుకే పితృ పక్ష సమయంలో ఈ తీర్థయాత్రా స్థలంలో భారీ రద్దీ నెలకొంటుంది.సంచరిస్తున్న ఆత్మలకు శాంతి, మోక్షం ఇచ్చే ప్రదేశం హర్డోయ్ లోని బెనిగంజ్ ప్రాంతంలో ఉన్న హత్యహరన్ తీర్థం ప్రాముఖ్యత రామాయణం, మహాభారతకాలం నాటిది. వేదాల ప్రకారం ఈ ప్రదేశం ఒకప్పుడు శివుడు తపస్సు చేసిన ప్రదేశం. శివ పురాణం ప్రకారం పార్వతి దేవి దాహం తీర్చడానికి.. శివుడు సూర్య భగవానుడికి అర్ఘం ఇస్తూ.. ఆ నీటి ద్వారా ఒక చెరువును సృష్టించాడు. అప్పుడు పార్వతి దేవి ఈ చెరువులోని నీటిని తాగింది. సూర్య గ్రహణం రోజున దానం చేయడం ఫలవంతం.. వేటిని దానం చేయాలంటే.. మహాభారత యుద్ధం తర్వాత పాండవులు యుద్ధంలో మరణించిన తమ కుటుంబ సభ్యులకు ఇక్కడే తర్పణం ఆచరించారు. ఈ ప్రదేశంలో శ్రద్ధా తర్పణం చేయడం వల్ల అసంతృప్త ఆత్మలకు శాంతి, మోక్షం లభిస్తుందని నమ్ముతారు. అదేవిధంగా అయోధ్యకు తిరిగి వచ్చేటప్పుడు బ్రహ్మహత్యా పాపం నుంచి బయటపడటానికి శ్రీరాముడు కూడా ఈ కుండంలో స్నానమాచరించాడని నమ్మకం. ఆ తర్వాత ఈ ప్రదేశం మోక్షాన్ని అందించే తీర్థయాత్రగా ప్రసిద్ధి చెందింది. నైమిశారణ్యంతో ముడిపడి ఉన్న ప్రాముఖ్యత ఈ తీర్థయాత్ర స్థలం ఋషుల తపస్సు స్థలం అయిన నైమిశారణ్యానికి సమీపంలో ఉంది. ఇది దీని ప్రాముఖ్యతను మరింత పెంచుతుంది. వేదాలు , పురాణాలలో నైమిశారణ్యాన్ని తపస్సు , జ్ఞాన కేంద్రంగా పరిగణిస్తారు. అందువల్ల హత్య హరణ తీర్థం ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాముఖ్యత రెండూ చాలా లోతైనవి.పితృ పక్షంలో విశేష ప్రాముఖ్యత పితృ పక్ష సమయంలో దేశ విదేశాల నుంచి భక్తులు తమ పూర్వీకులకు తర్పణం, శ్రద్ధా కర్మలను చేయడానికి ఇక్కడకు వస్తారు. ఇక్కడ చేసే దానధర్మాలు , స్నానం పూర్వీకుల ఆశీస్సులను ప్రసాదిస్తుందని నమ్ముతారు.చెరువు చుట్టూ ఉన్న పురాతన చెట్లు- , రాళ్ళు ఇప్పటికీ ఈ ప్రదేశం ప్రాచీనత, దైవత్వానికి నిదర్శనంగా ఉన్నాయి.

# టిఈటి నుండి మినహాయింపు ఇవ్వాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేసిన తపస్ బృందం



**ఆదిభట్ల వెలుతురు సెప్టెంబర్15:**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గంఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఎబి అర్ ఎస్ యం) పిలుపు మేరకు తపస్ రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో 2010 ముందు నియామకం అయినా టీచర్లకు టిఈటి నుండి మినహాయింపు ఇవ్వాలని సోమవారం రోజున రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ ద్వారా మన దేశ ప్రధానమంత్రివర్యులకు విజ్ఞప్తి చేయడం జరిగింది ఈకార్యక్రమంలో తపస్, రాష్ట్ర అధ్యక్షులుశ్రీకానుగంటి హన్మంత్ రావు జిల్లా అధ్యక్షులు కోట్ల కాశి రావు జిల్లా ప్రధాన కార్యదర్శి పూజరి రమేశ జిల్లా గౌరవ అధ్యక్షులు ఘణపురం సురధీర్ రాష్ట్ర భాద్యులు శ్రీహరికృష్ణ యుగంధర్ రెడ్డి జిల్లా భాద్యులు మోర లక్ష్మణ్ శ్రీనివాస్ రెడ్డి వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జింకల వెంకటేష్, రత్నారెడ్డి రావుల శివకుమార్ మరియు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

# బీఎంస్ పోరాటం ఫలించింది

**- బీడీ కార్మిక్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి రేణికుంట శంకర్**




**కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 15:**
భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు ఈ సమావేశానికి బీడీ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి రేణిగుంట శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు అనంతరం ఆయన మాట్లాడుతూ తూనిక ఆకుపై జిఎస్టిని 18 నుంచి ఐదు శాతానికి కుదించడం హర్షణీయమని ఎట్టకేలకు బిఎంఎస్ పోరాటం ఫలించిందని అన్నారు కరీంనగర్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడాతు బీడీ పరిశ్రమపై రాష్ట్రంలో 10 లక్షల మంది కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు ఈ నేపథ్యంలో చేతివృత్తుల పరిశ్రమగా పరిగణించాలంటూ బిఎంఎస్ తరఫున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లామని సుదీర్ఘంగా ఉద్యమించమన్నారు రానున్న రోజుల్లో బీడీ ఉత్పత్తులపై కూడా జీఎస్టీని కుదించాలని డిమాండ్ చేశారు ప్రత్యామ్నాయంగా కార్మికులకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పప్పుల సురేష్, జిల్లా అధ్యక్షులు పసుల శ్రవణ్, జిల్లా కార్యదర్శి తొర్తి శ్రీనివాస్, మొగిలిపాలెం తిరుపతి, నక్క అరుణ్,ఆకుల తిరుపతి, దేవరనేని మహేందర్ రావు, నాగుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం దుకాణాలలో (వైన్ షాపులలో) గౌడ కులస్తులకు 25 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

**- హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గారిని కలిసి విజ్ఞప్తి చేసిన బీసీ నేత లింగంగౌడ్**



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 15:**
కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు (కామారెడ్డి బీసీ డిక్లరేషన్) హామీ ఇచ్చినట్లుగా వైన్ షాపులలో గౌడ కులస్తులకు 25 శాతం రిజర్వేషన్లు కల్పించాలని హైద్రాబాద్ లోని రవీంద్ర భారతిలో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గారిని కలిసి విజ్ఞప్తి చేసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు.సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు బీసీ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన భారీ బహిరంగ సభకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ముఖ్య అతిథిగా హాజరైన ఆ సభకి అప్పుడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సిద్ధరామయ్య కలిసి బీసీ డిక్లరేషన్‌ను విడుదలచేశారు.గౌడ కులస్తులకు మద్యం దుకాణాలలో ప్రస్తుతం 15 శాతం ఉన్న రిజర్వేషన్ ను 25 శాతానికి పెంచుతాం అని స్పష్టంగా హామీ ఇచ్చారని పేర్కొన్నారు.హామీ ప్రకారం గౌడ కులస్తులకు న్యాయం చేయాలని అన్నారు.

# సామాజిక వర్గ అభ్యున్నతికి పాటు పడదాం

**- అఖిల భారత వడ్డెర వడ్డెర సంక్షేమ సేవా సంఘం**

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 15:**



వడ్డెర సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకుంటూ అభ్యున్నతికి పాటుపడదామని అఖిలభారతం వడ్డెర వడ్డే సంక్షేమ సేవా సంఘం జాతీయ అధ్యక్షులు వేముల లక్ష్మణ్ పిలుపునిచ్చారు. సంఘాన్ని బలోపేతం చేసేందుకు కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు ఆయన ప్రకటించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి గా గుంజా శ్రీనివాస్ ఉపాధ్యక్షుడిగా దండుగుల అశోక్, జాతీయ సంయుక్త కార్యదర్శిగా మక్కల శేఖర్ యువజన అధ్యక్షుడిగా డాక్టర్ వేముల లోకేష్ యువజన కార్యదర్శిగా డాక్టర్ వేముల శ్రీనివాస్ రాష్ట్ర కార్యదర్శిగా వేముల మధుసూదన్ లను నియమించినట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో ఉన్న వడ్డెరలను ఐక్యం చేసి సామాజిక వర్గం సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటామని అన్నారు. పేదరికంలో మగ్గుతున్న వడ్డెరలను సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల ద్వారా అన్ని రంగాలలో అభివృద్ధికి కృషి చేసేందుకు కార్యవర్గం శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు.

# తన ఇంటి స్థలాన్ని అక్రమించుకోవలని చూస్తున్న లాయర్ జీలకర్ర శ్రీనివాస్ తో ప్రాణ హాని ఉంది

**- పోలీసులకు పిర్యాదు చేసిన పట్టించికోవడం లేదు**



**బషీర్బాగ్ వెలుతురు 15 సెప్టెంబర్:**
తమ కుటుంబాన్ని మానసికంగా హింసిస్తూ, శారీరకంగా ఇబ్బందుల గురి చేస్తు ఒక రౌడి షీటర్ లాగా వ్యవహరిస్తున్న లాయర్ జీలకర్ర శ్రీనివాస్ నుండి ప్రాణహాని ఉన్నదని తనకు,తన కుటుంబానికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని ఓ వృద్ధ మహిళా వేడుకుంది.హైద్రాబాద్ బషీర్బాగ్ లో జనగామ జిల్లా, ఖిలషాపూర్ గ్రామానికి చెందిన ఎల్మకంటి అమృతమ్మ దృద్ధ మహిళా కుటుంబం తో కలసి మాట్లాడారు.తన గ్రామంలో 196.3 విస్తీర్ణం గల ఇంటిలో 50 సంవత్సరాలుగా రెండు గదులు నిర్మించుకొని నివసిస్తున్ననని, అట్టి స్థలాన్ని అప్పటి ప్రభుత్వం తన భర్త పెరుమీదుగా ఇచ్చిందని దానికి సంబంధించిన అన్ని పత్రలు ఉన్నాయి,కరెంటు బిల్లు,ఇంటి ట్యాక్సీ,అన్ని కడుతున్నానని వాపోయింది.ఇంటి స్థలం కోసం నా ఇంటి పై నలుగురు అయినా ఎల్మాకంటి అనిల్ కుమార్, జీలుకర శ్రీనివాస్, జీలుకర సోమనాథం, జీలుకర నర్సయ్య లు నన్ను వృదురాలు అని చూడకుండా ఇష్టం వచ్చినట్లు బూతులు తిడుతూ ఇంట్లో నుండి బయటకి వెళ్ళు ఇల్లు నాది అంటూ నాపై దౌర్జ్యం చేసారని వాపోయింది.వీరిపై పోలీసులకు పిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.నిన్ను ఎప్పటికైనా తానే చంపుతా అని బెదిరిస్తూ ఏ పోలీసులకు చెప్పుతారో చెప్పుకో, నేను ఒక లాయర్ నీ ఏ పోలీసోడు కేసు తీసుకుంటాడో నేనూ చూస్తా అని బెదిరిస్తున్న శ్రీనివాస్ నుండి తనకు,తన కూతురి కుటుంబానికి ప్రాణహాని ఉన్నదని,ప్రభుత్వం తనను ఆదుకోవాలని తిరుపతమ్మ వేడుకుంది.

## ఫీజుల బకాయిల కోసం ప్రైవేట్ కళాశాల నిరవధిక బందుకు

# బీసీ సంక్షేమ సంఘం మద్దతు

### ఫీజుల రియంబర్స్మెంట్ విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పిదం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేయొద్దు

**బషీర్ బాగ్ వెలుతురు 15 సెప్టెంబర్:**
ఫీజురీయింబర్స్ మెంట్ పథకం కాంగ్రెస్ హాయంలోనే వచ్చిందని విషయం గుర్తుంచుకోవాలి గత నాలుగు సంవత్సరాలుగా 8000 కోట్ల ఫీజుల రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో రోడ్డున పడ్డ 22 లక్షల మంది విద్యార్థుల గోసను ప్రభుత్వం పట్టించుకోవాలి ఫీజుల రియంబర్స్మెంట్ సమస్య ప్రభుత్వానికి ప్రవేట్ కళాశాల యజమాన్యాల సమస్య కాదు ఇది లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తు సంబంధించిన సమస్య తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల రియాంబర్స్ మెంట్ బకాయిలను దశలవారీగా విడుదల చేయాలి ఫీజుల రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా బీసీ విద్యార్థుల పోరాటాన్ని ఉధృతం చేస్తాం కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీ విద్యార్థుల పూర్తి ఫీజులను ప్రభుత్వమే చెల్లించాలి ఫీజుల బకాయిల కోసం కామారెడ్డి డిక్లరేషన్ అమలు కోసం 5 లక్షల మంది విద్యార్థులతో హైదరాబాద్ దిగ్బంధం చేస్తాం అమరవీరుల స్థూపం వద్ద జరిగిన నిరసనలో బీసీ సంక్షేమ సంఘం జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు.బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి



సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాం కుర్మా, బీసీ మహిళా సంఘం అధ్యక్షురాలు బి మని మంజరి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్, సంచారజాతుల సంఘం అధ్యక్షుడు నరసింహా తదితరులు పాల్గొన్నారు..

# పెండింగులో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి

### - స్వామి గౌడ్.



**వెలుతురు, హైదరాబాద్ సెప్టెంబర్ 15 :**
పెండింగులో ఉన్న ఫీజు రియం బర్స్ మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామి గౌడ్ అన్నారు. ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీ ప్రాంగ ణంలో విలేకరుల సమావేశంలో బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కిం గ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామి గౌడ్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న మొత్తం 8500 కోట్ల ఫీజు రియంబ ర్స్ మెంట్ బకాయిలను వెను వెం టనే దశల వారీగా విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం 1200 కోట్ల రూపాయల ఫీజు రి యంబర్స్ మెంట్ బకాయిల టోకె న్లను జారీ చేయడం జరిగిందని, కనీసం జారీ చేసిన ఫీజు రియంబ ర్స్ మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి పేద విద్యార్థుల భవి ష్యత్తును దృష్టిలో పెట్టుకొని విడుద ల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి బొల్లెపల్లి స్వామి గౌడ్ సూచించా రు. కొంతమంది విద్యార్థులు ఉపాధి అవకాశాల కోసం, ఉన్నత విద్యను అభ్యసించడం కొరకు కాలేజీలలో సర్టిఫికెట్లు ఉండడం వలన విద్యా ర్థులు ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని పెండింగులో ఉన్న ఫీజు రి యంబర్స్ మెంట్ బకాయిలను వి డుదల చేసి విద్యార్థులను ఆదు కోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని స్వా మి గౌడ్ డిమాండ్ చేశారు. ఇం జనీరింగ్, డిగ్రీ, పీజీ, ఇంటర్ మరియు వృత్తి విద్య కళాశాలలు చేస్తున్న ధర్నాకు మద్దతుగా బీసీ విద్యార్థి సంఘం తరపున మద్దతూ ఉంటుందని బొల్లెపల్లి స్వామి గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మహే ష్, నిఖిల్, కౌశిక్, నీరజ్, చందు, రాజశేఖర్, శ్రీనివాస్, మధు, శివ మరియు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్లు పెంచకపోతే కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధమే

### -వి హెచ్ పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య

**మంచాల వెలుతురు సెప్టెంబర్ 15:**
మంచాల మండలం కేంద్రంలో పెన్షన్ లు పెంచాలని ఇప్పట్టి వరకు దరఖాస్తు చేసుకున్న పెండింగ్ లోఉన్న పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్, చేస్తూ సోమవారం రోజున విహెచ్,పిఎస్, ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్,



కార్యాలయాల ముట్టడిలో భాగంగా సోమవారం రోజున మంచాల మండల కేంద్రంలో గల తహసిల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వి హెచ్ పి ఎస్ రాష్ట్రఅధ్యక్షులు కాళ్ల జంగయ్య పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు వికలాంగులకు 6000పెన్షన్. వృద్ధులు వితంతువులు ఒంటరి మహిళలు, చేనేత, గీతకార్మికులకు 4000 పెన్షన్ పెంచుతామని చెప్పి నేటికీ 22 నెలలు గడుస్తున్న పెన్షన్లు పెంచకపోవడం ఏంటని ప్రశ్నించారు.అదేవిధంగా ఇప్పట్టి వరకు దరఖాస్తు చేసుకొని సంవత్సరాలు గడుస్తున్న పెండింగ్ లో ఉన్న పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు పెన్షన్లు పెంచకపోతే కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధం చేయడానికి పెన్షన్దారులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు స్థానిక సంస్థల ఎన్నికల లోపు పెన్షన్లు పెంచకపోతే పెన్షన్ దారుల సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి పెన్షన్లు పెంచాడని గుర్తు చేశారు ప్రతి నెల ఒకటో తారీకునే పెన్షన్లు ఇస్తున్నాడని చంద్రబాబు నాయుడు ని అభినందించారు రేవంత్ రెడ్డి చంద్రబాబు నాయుడుని చూసి నేర్చుకోవాలని గుర్తు చేశారు ఇప్పటికైనా పెన్షన్లు పెంచాలని అన్నారు ఈ కార్యక్రమంలో వి హెచ్ పి ఎస్ మంచాల మండల అధ్యక్షులు అశ్వాల బాలరాజ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పల్నాటి సుధాకర్ మాదిగ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు జంగయ్య, వి హెచ్ పి ఎస్ సీనియర్ మండల నాయకులు చీర దానయ్య చేయూత పింఛన్దారుల హక్కుల పోరాట సమితి నాయకురాలు రావుల అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు

# దశలవారీగా పెండింగ్లో ఉన్న ఫీజు బకాయిలన్నింటినీ విడుదల చేయండి లేకపోతే ఎమ్మెల్యేలు జీతాలు తీసుకోవడం ఆపేయండి

**- ఫీజు బకాయిల కోసం ప్రైవేట్ కళాశాల నిరవధిక బందుకు బీసీ సంక్షేమ సంఘం మద్దతు.**

**- బీసీ నేత లింగంగౌడ్ వెల్లడి**



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 15:**
దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థులపట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయంబర్స్మెంట్ విడుదల గురించి ఆర్థిక శాఖ మరియు ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క గారిని కళాశాలల యాజమాన్యాలు కలిసినప్పుడు మా దగ్గర చిల్లిగవ్వ కూడా లేదనడం చాలా బాధాకరం ఒక డిప్యూటీ సీఎం హోదాలో అలా మాట్లాడడం సరికాదన్నారు.బిఆర్ఎస్ ప్రభుత్వము అన్ని వర్గాలను అన్యాయానికి గురిచేసిందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే మీరు కూడా ఇలా విద్యార్థులకు అన్యాయం చేయడం సరి కాదన్నారు.బకాయిల విడుదల కోసం ప్రైవేట్ కళాశాలలు చేస్తున్న నిరవధిక బందుకు బీసీ సంక్షేమ సంఘం పూర్తి మద్దతు తెలుపుతుందన్నారు. తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్

# రక్తదాన శిబిరం బ్రోచర్ ఆవిష్కరణ

**- నరేంద్ర మోడీ జన్మదినం పురస్కరించికొని రక్తదాన శిబిరం ఏర్పాట్లు**



**బషీర్ బాగ్ వెలుతురు 15 సెప్టెంబర్:**
రక్త్ దాన్ అమృత్ మహోత్సవ్ 2.0 పేరిట ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం పురస్కరించుకుని ఈ నెల 17న రాష్ట్ర వ్యాప్తంగా మెగా బ్లడ్ డోనేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు క్యాంప్ కన్వీనర్ రాహుల్ జైన్ వెల్లడించారు. హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో రక్తదాన శిబిరం బ్రోచర్ ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 200, గ్రేటర్ పరిధిలో 100 రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తలసేమియా బ్లడ్ బ్యాంక్, రెడ్ క్రాస్, ప్రభుత్వ బ్లడ్ బ్యాంకులకు తాము సేకరించిన రక్తాన్ని అందిస్తున్నట్లు వివరించారు. రక్తం కొరత తీవ్రంగా ఉండడం వల్ల చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని, అందువల్ల రక్తదానంపై ప్రజల్లో విస్తృతమైన అవగాహన పెంపొందిస్తున్నామన్నారు.

### ఫీజు రియంబర్స్‌మెంట్ బంద్‌కు మద్దతు: బిజెపి

**హైదరాబాద్,సెప్టెంబరు15 ( వెలుతురు):**
ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ప్రైవేటు- కళాశాలల యాజమాన్యాలు చేపట్టిన బంద్‌కు మద్దతు తెలుపుతున్నామని భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి ప్రైవేటు- కళాశాలలకు ఉందని చెప్పారు. విద్యావ్యవస్థను గత ప్రభుత్వం చెడగొట్టిందని ఆరోపించారు. ఈ ప్రభుత్వమైనా యాజమాన్యాలతో చర్చించి వారికి సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. విద్యపై ప్రభుత్వ వైఖరిని భాజపా తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు.

# సమాజ నిర్మాతలు గురువులే

## - ఎంపీడీవో రాములు

**- రామన్నపేటలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**



**రామన్నపేట వెలుతురు న్యూస్ సెప్టెంబర్ 15**

సమాజ నిర్మాతలు గురువులే అని విద్యారులకు మంచి విద్య, నడవడిక నేర్పినపుడే వారు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని తద్వారా, సమాజం మంచి మార్గంలో పయనిస్తుందని, అందుకు గురువు నుంచి లభించే విద్య, మార్గదర్శనం ఎంతో అవసరమని గురువు లేని విద్య గుడ్డిదని, రేపటి రోజు విద్యారి ఎలా తయారవ్వాలో అది గురువు అందించే విద్య ద్వారానే సాధ్యం అని రామన్నపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆవుల రాములు అన్నారు. సోమవారం రామన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల విద్యాధికారి గవ్వ జ్యోతి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలాలంకరణ, జ్యోతి ప్రకాశనం చేసిన అనంతరం . మాట్లాడారు. తదుపరి పిఎసిఎస్ చైర్మెన్ నంద్యాల బిక్షం రెడ్డి మాట్లాటుతూ గురువులు లేకుండా సరైన విద్యను పొందలేమని గురువే రేపటి సమాజ నిర్మాతలని అన్నారు. అనంతరం పురస్కార గ్రహీతలను మెమొంటో, ప్రశంసాపత్రం.శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి , కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, స్వామి, శేఖర్, శేషాచారి, జిహెచ్ఎంలు విజయమాధవి, హనుమంతరావు, భవాని, వివిధ సంఘాల బాధ్యులు లింగాచారి, బాసరాజు యాదగిరి, పాల్వంచ హరికిషన్, వెంకట్ రెడ్డి, యు.భిక్షమయ్య, బొడ్డుపల్లి రాములు ఎస్ ఏ రహీం, అనిల్ కుమార్, ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలు, విజయకుమార్, పిచ్చిరెడ్డి, మంగమ్మ, జ్యోతి, భూపాల్, రేణుక, శ్రీనివాస్ రెడ్డి, వరలక్ష్మి, శ్రీలత, రాంమోహన్, శివపార్వతి, భద్రయ్య, శేఖరయ్య వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గవ్వ జ్యోతి మండల విద్యాధికారి రామన్నపేట.

# హాస్టల్ వసతులను సద్వినియం చేసుకోవాలి.



**రామన్నపేట వెలుతురు న్యూస్ సెప్టెంబర్ 15**

వసతి గృహంలో ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలను కల్పించిందని విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక హాస్టల్ వెల్ఫేర్ అధికారి సుధాకర్ సూచించారు. స్థానిక ఎస్సీ బారుర వసతి గృహంలో తల్లిదండ్రులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు సౌకర్యాలు తదితర విషయాలను విద్యార్థులతోపాటు తల్లిదండ్రులకు వివరించారు. హాస్టల్లోని మెనూ వివరాలను, పౌష్టిక ఆహారం యొక్క వివరాలను వసతి గృహ సంక్షేమ అధికారి వివరించారు. ఈనాడు ఉన్నత స్థానంలో ఉన్న అనేకమంది ప్రభుత్వ వసతి గృహంలోనే ఉండి చదువుకున్నారని వారు తెలిపారు. వసతి గృహంలో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు తరచూ విద్యార్థులు యొక్క వివరాలను తెలుసుకుంటూ ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు మల్లేశం, స్వామి, జమ్మయ్య, సైదులు, కృష్ణ, చారి తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్ స్కూల్‌లో ఘనంగా హిందీ దివస్



**వెలుతురు నారాయణఖేడ్ సెప్టెంబర్ 15 :**

సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ పట్టణంలోని విజ్ఞాన్ ప్రైవేట్ పాఠశాలలో కరస్పాండెంట్ జి. సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ దేశ జాతీయ భాషగా ఉన్న ప్రాధాన్యం, ప్రతి ఒక్కరూ హిందీ నేర్చుకోవలసిన అవసరాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు హిందీ భాష ప్రాముఖ్యతపై ప్రసంగాలు, వ్యాసరచనలు, కవితా పఠనాలతో ఆకట్టుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విశ్వనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిస్వార్థ కమ్యూనిస్టు నాయకుడు

# ఎల్లంకి శ్రీనివాస్

**- మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు**



**సంస్థాన్ నారాయణపురం మాజీ ఎంపీపీ ఎల్లంకి శ్రీనివాస్ 10 వ వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు,**



**నారాయణపురం వెలుతురు సెప్టెంబర్ 15:**

సంస్థాన్ నారాయణపురం మండలం అల్లందేవి చెరువు గ్రామంలో సీపీఐ నాయకుడు, మాజీ ఎంపీపీ ఎల్లంకి శ్రీనివాస్ 10 వ వర్ధంతి ని ఆయన స్థూపం వద్ద పూలమాలలు వేసి జోహార్లు అర్పించి ఘనంగా నిర్వహించారు. ఈ వర్ధంతి సభలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు మాట్లాడుతూ శ్రీనివాస్ నిస్వార్థ గల కమ్యూనిస్టు నాయకుడు అని కొనియాడారు. సాధారణ కుటుంబంలో పుట్టినా, ప్రజల సమస్యల పరిష్కారం కోసం, ఈ ప్రాంత అభివృద్ధి కి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన జీవితం యువత కు ఆదర్శమని సమాజానికి వెలుగు పంచే దిశగా శ్రీనివాస్ ఆశయాలను కొనసాగించాలని తెలిపారు. ఈ గ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గుండు కిష్టయ్య, కురుమిద్ద లింగయ్య లతో కలిసి భూ పోరాటాలు నిర్వహించి అప్పటి ఎమ్మెల్యే ఉజ్జిని నారాయణరావు చొరవతో అల్లందేవి చెరువు గ్రామంలో ఇంటి నిర్మాణాలు చేయించారని గుర్తు చేశారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కే. శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు కలకొండ సంజీవ, సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ దేశిడి నరేందర్ రెడ్డి, సురవి నరసింహ, గుండు నరసింహ, పొట్ట శంకరయ్య, పల్లె మల్లారెడ్డి, ముత్యాల అంజయ్య, ఎర్రోళ్ల లింగస్వామి, బద్దుల పెంటయ్య, ఈద మల్లయ్య, గడ్డం యాదగిరి, శ్రీనివాస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# రామన్నపేట గీత కార్మిక సంఘం నూతన మండల కమిటీ ఎన్నిక

## అధ్యక్ష,కార్యదర్శులుగా కూనూరు మల్లేశం,ఎర్ర రవీందర్ ఎన్నిక.

**రామన్నపేట వెలుతురు న్యూస్ సెప్టెంబర్ 15**





మండల కల్లుగీత కార్మిక సంఘం మూడో మహాసభ రెండవ రోజు బోగారం గ్రామంలో బావండ్లపల్లి బాలరాజు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది . ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బోలగాని జయరాములు, జిల్లా అధ్యక్షులు రాగీరు కృష్ణయ్య హాజరై నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షులుగా బావండ్లపల్లి బాలరాజు, అధ్యక్షులుగా కునూరు మల్లేశం, ప్రధాన కార్యదర్శిగ ఎర్ర రవీందర్, ఉపాధ్యక్షులుగా తాళ్లపల్లి జితేందర్, ఎర్ర కాటమయ్య, కోశాధికారిగా మునికుంట్ల లెనిన్, సహాయ కార్యదర్శులుగా తూర్పునూరు శ్రీనివాస్, తాటిపాముల నవీన్, గుండాల ప్రసాద్, సోషల్ కమిటీ కన్వీనర్లుగా బైరు రామకృష్ణ ఆకటి శ్రీను మరియు కమిటీ సభ్యులుగా పబ్బతి ఆంజనేయులు, గంగాదేవి అంజయ్య, కొమ్మగాని అశోక్, పల్సం కనకయ్య, బొడిగే సుదర్శన్, పులిపలుపుల వీరస్వామి, సుర్వి సత్యం, కూనూరి గణేష్, సుర్వి నవీన్, కమ్మంపాటి శ్రీకాంత్, నాతి రమేష్, పబ్బతి జాహంగీర్, పబ్బు గంగాధర్, అంతటి నరసింహ, బైరు రమేష్, నోముల శివ గార్లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఇట్టి ఎన్నికను హర్షిస్తూ అధ్యక్ష, కార్యదర్శులు కూనూరు మల్లేశం ఎర్ర రవీందర్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మరణించిన గీత కార్మిక కుటుంబాలకు 10 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ప్రతి సొసైటీకి ఐదు ఎకరాల భూమి కేటాయించాలని, 50 సంవత్సరాలు నిండిన ప్రతి సొసైటీ సభ్యునికి 4000 రూపాయలు పెన్షన్ పెంచి ఇవ్వాలని, గీత కార్మికుల వృత్తిని దెబ్బతీస్తున్న బెల్టు షాపులను అరికట్టాలని ఈ సందర్భంగా వారు తెలిపారు.

# వికలాంగుల కు,చేయూత పెన్షన్ దారులకు

# వెంటనే పెన్షన్ పెంచాలి...!

**- పెన్షన్ దారులను మోసం చేసిన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి...**

**- వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కో కన్వీనర్ రాయికోటి నర్సిములు**



**జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 15:**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన ప్రకారం వికలాంగులకు రూ. 6000లు, యుత పెన్షన్ దారులకు రూ. 4000లు వెంటనే పెన్షన్ పెంచాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కో కన్వీనర్ రాయికోటి నర్సిములు డిమాండ్ చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ వికలాంగు లకు, వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, చేనేత కార్మికులకు, బీడీ, గీత కార్మికులకు, కండరాల క్షీణత రూ. 15000ల పెన్షన్ పెంచాలని డిమాండ్ చేయడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వికలాంగులకు రూ.4000 ల నుండి 6000లు, చేయూత పెన్షన్ దారులకు రూ. 2000ల నుండి రూ. 4000లు ఇస్తానని ఎన్నికలో హామీ ఇచ్చి ఇప్పటికి రేవంత్ రెడ్డి సర్కార్ అధికారం లోకి వచ్చి 21 నెలలు గడిచిపోయిన ఇప్పటివరకు వారికి పెన్షన్ పెంచలేదని విమర్శించారు. పెన్షన్ పెంచకుండా నిర్లక్ష్యం చేస్తున్న రేవంత్ రెడ్డి తీరుకు నిరసనగ తహసీల్దార్ కార్యాలయం వికలాంగుల హక్కుల పోరాట సమితి (VHPS) మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (MRPS) ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు పెన్షన్ దారులతో మహాధర్న నిర్వహించడం జరిగింది. తదనంతరం డిప్యూటీ తహసీల్దార్ కర్ణాకర్ రావు కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో పెన్షన్ పెంచాలని అనేక రకాలుగా పోరాటం చేస్తూనే ఉన్నాము. పెన్షన్ దారులకు వెంటనే పెన్షన్ పెంచాలని తమరు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరడం జరిగింది, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, నేత, బీడీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కుప్పా నగర్ నర్సిములు, వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు శోభరాణి సావిత్రి, బిస్మిల్లా, ఖాదర్ అల్లి గినియర్ పల్లి నబీ,నాగమ్మ, గుండమ్మ నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నిషేధిత చరస్ పట్టివేత...!

**- వివరాలు వెల్లడించిన ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ రెడ్డి...**



జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 15:

గోవా నుండి హైదరాబాద్ కు అక్రమంగా తరలిస్తున్న నిషేధిత చరస్ ను అబ్కారీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన లో ఒకరిని అరెస్ట్ చేశారు.దసంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణం లోగల అబ్కారీ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం స్థానిక అబ్కారీ సీఐ టీ. శ్రీనివాస్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....చిరాగ్ పల్లి అబ్కారీ చెక్ పోస్ట్ వద్ద అబ్కారీ పోలీసులు జరిపిన వాహనాల తనిఖీ లో గోవా నుండి హైదరాబాద్ కు జీపులో తరలిస్తున్న 50వేల రూపాయల విలువైన 8గ్రాముల నిషేదిత చరస్ను స్వాధీనం చేసుకొని, చరస్ తరలిస్తున్న ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలిస్తున్నామని తెలిపారు. దీంతో పాటు చరస్ ను తరలిస్తున్న జీప్ను సీజ్ చేసినట్లు దాని విలువ సుమారు 20 లక్షల వరకు ఉంటుందని వెల్లడించారు. ఇట్టి దాడులలో సీఐ గాంధినాయక్ , ఎస్సైలు హనుమంతు, యాదయ్య, రమేష్, మురళి , ఇబ్రహీం, రాజా, అబ్కారీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారని సీఐ తెలిపారు.

# మెగా రక్తదాన శిబిరం విజయవంతం చేద్దాం

**భావదియా సిందోల్ దశరథ్ కురుమ**
**బీజేపీ నారాయణఖేడ్ మండల అధ్యక్షులు**






**వెలుతురు నారాయణఖేడ్ సెప్టెంబర్ 15 :**

మంగళవారం రోజు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నరేంద్రమోడీ గారి 75వ పుట్టినరోజు సందర్భంగా నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రి లో నిర్వహించే నిర్వహించే మెగా రక్తదానం కార్యక్రమని విజయవంతం చేయాలనీ బీజేపీ నారాయణఖేడ్ మండల అధ్యక్షులు సిందోల్ దశరథ్ కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని ప్రతి బూత్ అధ్యక్షులు మండల కమిటీ బాధ్యులు అధికసంఖ్యలో పాల్గొనాలని ప్రతి ఒక్కరు కూడా పార్టీలకు అతీతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేకల జ్ఞానేశ్వర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభానికి సిద్ధమైన నారాయణి మెగా షాపింగ్ మాల్




**వెలుతురు నారాయణఖేడ్ సెప్టెంబర్ 15 :**

నారాయణఖేడ్ పట్టణ ప్రముఖ వస్త్ర వ్యాపార దిగ్గజం నారాయణి మెగా షాపింగ్ మాల్ రెండవ బ్రాంచ్ పట్టణంలోని బసవేశ్వర చౌక్ లో ఈనెల 18న ప్రారంభించడానికి తెలుగు సినిమా నటి నాగదుర్గ పట్టణానికి విచ్చేస్తున్నట్లు షాపింగ్ మాల్ నిర్వాహకులు అనంతం అండ్ బ్రదర్స్ తెలిపారు. నియోజకవర్గ ప్రజల పెళ్లిళ్లకు వివిధ ఫంక్షన్లకు పండగలకు అన్ని రకాల వస్త్రాలను సరసమైన ధరలకు అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర హెల్త్ మినిస్టర్ దామోదర్ నరసింహ,జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డిలు పాల్గొంటారని, ఓపెనింగ్ సందర్భంగా ప్రజలకు మంచి ఆఫర్లు అందుబాటులో ఉంటాయని కస్టమర్లు ఇట్టి అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

# బాటసారులపై కొండముచ్చు వీరంగం....



**జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 15:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో శనివారం, ఆదివారం, సోమవారం మూడు రోజుల నుండి కొండముచ్చు వీరంగం సృష్టించి సుమారు ఎనమిది మంది పై విరుచుకు పడి గాయలాపాలు చేసింది. జహీరాబాద్ పట్టణంలోని రాంనగర్, హమాలీ కాలనీ, శివాలయం, గాంధీనగర్ ప్రాంతాలలో బాటసారుల పై దాడి చేసి సుమారు ఎనమిది మందిని గాయపరిచింది. కొండముచ్చు ప్రజలపై దాడి చేసిన సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని జహీరాబాద్ ప్రాంతానికి చెందిన హరికృష్ణ, ఆకాష్, జగన్, నర్సిములు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బందికి కొండముచ్చుల నుండి కాపాడాలని అధికారులకు లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేశారు.

# బీసీ విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్ర

**- బీసీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దుర్గయ్య గౌడ్.**



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 15:**
ముఖ్యమంత్రే రేవంత్ రెడ్డి స్వయాన విద్యాశాఖ మంత్రి గా కొనసాగుతున్న పేద,మధ్య తరగతి విద్యార్థులకు పీజు రియాంబర్స్ మెంట్ స్కాలర్ షిప్స్ చెల్లించక పోవడం చేత ప్రవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు కోర్స్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్ ఇవ్వకుండా , డబ్బులు చెల్లిస్తే కానీ సర్టిఫికెట్స్ ఇవ్వమని ప్రభుత్వం పీజులు చెల్లించిన తర్వాత మీకు తిరిగి చెల్లిస్తామని విద్యార్థులను పీడించుకు తింటున్నారు, కేవలం స్కాలర్ షిప్స్ మరియు పీజు రియంబర్స్ మీద ఆధారపడి విద్యను కొనసాగించే వారికి డబ్బులు చెల్లించలేక తీవ్ర మనస్తాపం చెందుతున్నారు, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలకు , ప్రాజెక్టులకు,నిధులు కేటాయించి విద్యార్థులకు మొండి చెయ్యి చూపడం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు,ఇక డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క బడ్జెట్ లేదు ఏమి చేయలేమని చెప్పడం వెనక ప్రభుత్వం ఉద్దేశం ఏమిటని,పేద విద్యార్థులకు ఇచ్చే ఫీజు రీయింబర్స్ మెంట్ స్కాలర్ షిప్స్ ఎత్తివేయాలని ఆలోచన చేస్తుందా అని అనుమానం వస్తుంది. ఇదేనా సంక్షేమ ప్రభుత్వం ఇదేనా ప్రజా ప్రభుత్వం అంటే విద్యార్థులకు ఇవ్వాల్సిన పూర్తి ఫీజు రియంబర్స్ మెంటు వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర బీసీ సమాఖ్య అధ్యక్షుడు ఎస్ దుర్గయ్య గౌడ్ డిమాండ్ చేశారు.

# ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలి కలెక్టర్ కు వినతి పత్రం - తపస్





మెదక్ కలెక్టర్ ఆఫీస్ ముందు

**మెదక్ టౌన్ వెలుతురు సెప్టెంబర్ 15:**
తపస్ మెదక్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని వినతి పత్రం సమర్పణ. ఈ సందర్భంగా తపస్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ ఉద్యోగంలో ప్రవేశించిన ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని తపస్ మెదక్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ల ద్వారా ప్రధానమంత్రికి వినతి పత్రం ఇవ్వటం జరిగింది అని, ఉపాధ్యాయుల కు టెట్ పరీక్ష నుండి ఉపశమనం కలిగేలా అత్యున్నత న్యాయ స్థానం ఇచ్చిన తీర్పు పై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని మేలు చేయాలని రాష్ట్ర శాఖ పిలుపుమేరకు అన్ని జిల్లా కలెక్టర్ ల ద్వారా ఏబి ఆర్ ఎస్ ఎం( ABRSM) అనుబంధ సంఘాలు తెలంగాణ నుండి తపస్ ప్రధానమంత్రి గారికి మెమోరాండం ఇచ్చాము అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా నాయకులు సుమతి, రేఖా,రాజేశ్వర్, నర్సింలు,శ్రీధర్ రెడ్డి, పోచయ్య, సిద్ధూ, సుధాకర్, ప్రభాకర్, ఆంజనేయులు, ప్రసాద్ రెడ్డి, తులసి రామ్, మల్లేశం, నరేందర్ రెడ్డి, కృష్ణ, లక్ష్మీనారాయణ, నరేందర్, సంతోష్, సతీష్, శ్రీకాంత్ రెడ్డి, తిరుపతి, కిషన్, శ్రీహరి, రమేష్, మకాం రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇంజనీర్ల దినోత్సవం ని ఘనంగా నిర్వహించిన మసాబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

**- కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ ని జీపీటీ 1988 సివిల్ బ్యాచ్ అల్యూమ్నీ విద్యార్థులు సన్మానించి గౌరవించారు**



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 15:**
ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా మసాబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ ని జీపీటీ 1988 సివిల్ బ్యాచ్ అల్యూమ్నీ విద్యార్థులు సన్మానించి గౌరవించారు. కార్యక్రమంలో తెలంగాణ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీవో) హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.బి. కృష్ణయ్య యాదవ్, శ్రవణ్ కుమార్, పలు విభాగాల ఇంజనీర్లు, మాజీ విద్యార్థులు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ ఇంజనీరింగ్ రంగం ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు కృషి, క్రమశిక్షణ, నూతన ఆవిష్కరణలతో సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. శ్రీనివాసులు కంప్యూటర్ హెడ్. ఎన్ శ్రీనివాసరావు ఎలక్ట్రికల్ హెడ్. హరికృష్ణ ఆటోమొబైల్ హెడ్. కుమారస్వామి ఎలక్ట్రికల్. పూర్వ విద్యార్థి ఏ రాజశేఖర్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, మాజీ విద్యార్థులు ఈ వేడుకలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ఆసరా పింఛన్ పెంపు చేయాలని డిమాండ్

**- ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తూప్రాన్ తహసిల్దార్ కార్యాలయం ముట్టడి**

**- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు చెట్లపల్లి యాదగిరి మాదిగ నేతృత్వంలో ర్యాలీ - ధర్నా**

**"వెంటనే పింఛన్ పెంచాలి" అంటూ నినాదాలు**









**తూప్రాన్, వెలుతురు సెప్టెంబర్ 15:**
మెదక్ జిల్లా తూప్రాన్ మండల కేంద్రంలో ఆసరా పింఛన్ పెంపు కోసం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆధ్వర్యంలో భారీ ఆందోళన జరిగింది. జిల్లా అధ్యక్షులు చెట్లపల్లి యాదగిరి మాదిగ నేతృత్వంలో వందలాది మంది పింఛన్ దారులు హైవే నుండి భారీ ర్యాలీగా బయలుదేరి తూప్రాన్ తహసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. "పింఛన్ పెంచాలి – పేదల బతుకులు గట్టెక్కాలి" అంటూ నినాదాలతో కార్యాలయ ప్రాంగణం మార్మోగిపోయింది. ప్రస్తుత పరిస్థితుల్లో వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని, ఇంతకుముందు ఇచ్చిన పింఛన్ సరిపోవడం లేదని పింఛన్ దారులు బాధ వ్యక్తం చేశారు. మాకు ఒక్కటే ఆదాయం అదే పింఛన్. అది పెంచకపోతే బతుకు భారమవుతుంది అని వారు తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చెట్లపల్లి యాదగిరి మాదిగ మాట్లాడుతూ పేదల జీవనోపాధికి పింఛన్ పెంపు తప్పనిసరి. ప్రభుత్వం వెంటనే స్పందించి పింఛన్ మొత్తాన్ని పెంచకపోతే మరింత పెద్ద ఉద్యమాలు చేపడతాం అని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సర్గల పరశురాములు మాదిగ, కాలకంటి సత్యం మాదిగ, అర్గల శంకర్ మాదిగ, కృష్ణ మాదిగ తదితరులు మాట్లాడుతూ పింఛన్ లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు. ముసలి వారు, దివ్యాంగులు, విధవలు అందరూ ఈ పింఛన్‌కే ఆధారపడుతున్నారు. కనీసం మానవత్వం దృష్ట్యా ప్రభుత్వం వెంటనే పెంచాలి" అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బుడగ జంగం సుజాత, నాగరాణి, హుస్సేన్, లక్ష్మి, శివరాజు, పోచయ్య, అనిత, భూమయ్య తదితర పింఛన్ దారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారంతా కలిసి తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్ కార్యాచరణ కోసం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు చెట్లపల్లి యాదగిరి మాదిగ మాట్లాడుతూ పింఛన్ పెంపుపై ప్రభుత్వం స్పందించకపోతే జిల్లా, రాష్ట్ర స్థాయిలో పెద్ద ఉద్యమాలు చేస్తాం. అవసరమైతే చలో కలెక్టరేట్, హైదరాబాద్‌లో చలో అసెంబ్లీ కార్యక్రమాలకు పిలుపునిస్తాం" అని హెచ్చరించారు.

# ఎన్కౌంటర్లో మరణించిన మావోయిస్టు మోడెం బాలకృష్ణ పార్థివదేహానికి నివాళులర్పించిన మధుయాష్కీ గౌడ్

**ఆపరేషన్ కంగారును వెంటనే ఆపాలి మావోయిస్టులను చర్చలకు పిలవాలి**

**- మధుయాష్కీగౌడ్**



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 15:**
పోలీస్ ఎన్కౌంటర్ లో మరణించిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు మోడెం బాలకృష్ణ పార్థివదేహాన్ని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద కుటుంబంలో పుట్టిన బాలకృష్ణ ఆ రోజుల్లోనే ఇంజనీరింగ్ చదివి.. నక్సలిజం వైపు ఆకర్షితులయ్యారని, ఇంగ్లీషులో ఉన్న బ్రిటిష్ కాలం నాటి జైల్ మాన్యువల్ ను తెలుగులో అనువదించిన మొదటి వ్యక్తి బాలకృష్ణ గారన్నారు. మావోయిస్టు ఉద్యమంలో చేరి ప్రజల కోసం తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. మావోయిస్టులంటే ఉగ్రవాదులు కాదని, సమాజంలో దోపిడీ, అన్యాయాలను ప్రశ్నించేవారన్నారు. మావోయిస్టులు అడుగుతున్న ప్రజలకు సామాజిక, ఆర్థిక న్యాయం లాంటి సమస్యలను పరిష్కరించకుండా.. వారిని లేకుండానే చేయాలని కేంద్ర ప్రభుత్వ ఆలోచన దుర్మార్గమన్నారు. చర్చలకు సిద్ధమని చెప్పినా, వారిని పిలవకుండా ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను అంతమొందించడమే లక్ష్యంగా కేంద్రంలోని మోదీ– అమిత్ షా లు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర ఆక్షేపనీయమన్నారు. 2026 మార్చి 31 వరకు మావోయిస్టులు లేకుండా ఏరి వేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం దుర్మార్గమని, కానీ అదే మర్చి 31, 2026 వరకు దేశంలో పేదరిక నిర్మూలన చేపడుతాం... ఆర్థిక అసమానత రూపుమాపుతాం.. నిరుద్యోగం నిర్మూలిస్తాం.. అని చెప్పాలిగే దమ్ముందా కేంద్ర ప్రభుత్వానికని ప్రశ్నించారు. తనకు అనుకూల పారిశ్రామిక వేత్తలకు దేశంలోని సహజ సంపదలను దోచి పెట్టేందుకే నక్సలిజం నిర్మూలన తప్పా.. దేశంలో పేదల హక్కుల రక్షణ, వారి సమస్యల నిర్మూలనకు కాదన్నారు. హింసకు హింస పరిష్కారం కాదు. తుపాకీతో సమస్యలు తీరవన్నారు. వెంటనే ఆపరేషన్ కగార్ ను ఆపాలని, మావోయిస్టులను చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు. దేశంలోనే ఉంటున్న దేశ పౌరులైన మావోయిస్టులను చంపడం హేయమైన చర్య అన్నారు. ప్రజలు ఎవరైనా మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అర్బన్ నక్సలైట్స్ అని ముద్ర వేసి అణిచివేయాలని చూస్తున్నారని విమర్శించారు. మోడెం బాలకృష్ణ సతీమణి జైల్లో ఉన్నదని, బాలకృష్ణ దహన సంస్కారాలకు కూడా బెయిల్ ఇవ్వకపోవడమంటే ప్రభుత్వానికి మానవత్వం లేనిదని పేర్కొన్నారు.

# హలో విద్యార్థి చలో ఇందిరాపార్క్ పోస్టర్‌ను ఆవిష్కరించిన బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీఆర్

**ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేటీఆర్, బిఆర్ఎస్వి రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పాల్గొననున్నారు**

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 25:**
పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ మరియు ఫీజు రీయింబర్స్మెంట్ , ఫీ బకాయిలను వెంటనే విడుదల చెయ్యాలని బిఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి నాగారం ప్రశాంత్ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్ దగ్గర ఈ నెల సెప్టెంబర్ 25 న ఉదయం 11:00 గంటల కి మహా ధర్నా నిర్వహించనున్నారు కావున పెద్ద ఎత్తున రాష్ట్రం లో ఉన్న విద్యార్థులంతా వేలాదిగా తరలివచ్చి ఈ యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఫీ రీయింబర్సుమెంట్స్ బకాయిలు విడుదల చేయకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం తో తాడోపేడో తేల్చుకునేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నామన్నారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ , బిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన



కార్యదర్శులు పెద్దమ్మ రమేష్, శశిపాల్, బూరుగు నవీన్ గౌడ్, డాక్టర్ సత్య గౌతమ్ ప్రసాద్, కొడంగల్ మాజీ జడ్పీటీసీ మహిపాల్, ఏల్పుకొండ రామకృష్ణ, సుధీర్, పవన్, నల్ల అనిల్,అంబేద్కర్, తదితరులు పాల్గొన్నారు

# ఫీజురియంబర్స్‌మెంట్లో కమిషన్ల కక్కుర్తి: కవిత

**హైదరాబాద్,సెప్టెంబరు15 ( వెలుతురు):**
ఆడబిడ్డల చదువులను కాంగ్రెస్ కమిషన్ల సర్కారు కాలరాస్తోందని ఎంఎల్ సి కవిత మండిపడ్డారు. ఉద్దేశపూర్వకంగా ఫీ రీయింబర్స్ మెంట్ బకాయిలను తెలంగాణ ప్రభుత్వం ఎగవేస్తుందని దుయ్యబట్టారు. సోమవారం ఆమె ట్వీట్ చేశారు. 20 శాతం కమిషన్లు ఇస్తేనే రీయింబర్స్ మెంట్ బకాయిలు ఇస్తామని ప్రభుత్వంలోని కొందరు డిమాండ్ చేస్తున్నారని... దీంతో కాలేజీల యాజమాన్యాలు ఆవేదన చెందుతున్నాయని ఆరోపణలు చేశారు. కమిషన్ల కోసమే బకాయిలు ఏళ్లకేళ్లుగా పెండింగ్ లో పెట్టారని, ఇప్పటికే కాలేజీలు నడపలేక యాజమాన్యాలు ఆర్థికంగా చితికిపోయాయని వివరించారు. కాలేజీలు మూతపడితే చదువుకు ఆడబిడ్డలు దూరం కానున్నారని ఆవేదని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ రాజ్యం తెస్తామని గప్పాలు కొట్టి ఆడబిడ్డలను చదువులకు దూరం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

# తమ కూమారుడికి కేటీఅర్ చేతుల మీదుగా నామకరణం చేయించుకున్న దంపతులు

**- బీఆర్ఎస్ కు చెందిన జెడ్పీటీసీ దంపతుల కుమారుడికి 'సూర్యాంశ్' అని పేరు పెట్టిన కేటీఆర్**

**- కేటీఆర్ ఇచ్చిన నేటి దీవెనలు మా కొడుకును ఆయనలాగే గొప్ప వ్యక్తిని చేస్తాయన్న నమ్మకం మాకు ఉందని సంతోషం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు**



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 15:**
పార్టీ నాయకుడిపై ఉన్న అభిమానాన్ని పలువురు విభిన్న రీతుల్లో వ్యక్తం చేస్తుంటారు. సరిగ్గా అలాంటి అపురూపమైన ప్రేమను, గౌరవాన్ని చాటుకున్నారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట నియోజకవర్గానికి చెందిన లావణ్య, రాంబాబు దంపతులు. తమ కుమారుడికి పేరు పెట్టాలని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వద్దకు తమ బిడ్డను తీసుకువచ్చారు. కేటీఆర్‌ను కలిసిన దంపతులు తమ సంతోషాన్ని పంచుకుంటూ, తమ కొడుకుకు కేటీఆర్ చేతుల మీదుగా పేరు పెట్టడం తమ జీవితంలో మర్చిపోలేని గొప్ప సంఘటన అని విన్నవించారు. ఈ అపూర్వమైన క్షణం తమకు అత్యంత గౌరవనీయమని వారు తెలిపారు. వారి విజ్ఞప్తికి భావోద్వేగానికి గురైన కేటీఆర్, ఆ చిన్నారి యోగక్షేమాల గురించి ప్రేమగా మాట్లాడారు. బాబుకు ఏ అక్షరంతో పేరు పెట్టాలని కేటీఆర్ అడిగినప్పుడు, తమ కుటుంబ సభ్యులకు 'సు' అనే అక్షరంతో పేరు పెట్టాలని బ్రాహ్మణులు సూచించిన విషయాన్ని రాంబాబు, లావణ్య దంపతులు కేటీఆర్‌కు తెలియజేశారు. దీనితో, తన కొడుకు హిమాన్షు పేరును గుర్తు చేసుకుంటూ, 'సు' అక్షరంతో 'సూర్యాంశ్' అనే పేరును ఆ చిన్నారికి కేటీఆర్ పెట్టారు. తమ కుమారుడికి కేటీఆర్ తన సొంత కొడుకు హిమాన్షు పేరు మాదిరిగానే సూర్యాంశ్ అని పేరు పెట్టడం అత్యంత సంతోషాన్ని ఇచ్చిందని ఆ దంపతులు తెలిపారు. ఈ అపురూపమైన గడియలు తమ జీవితాంతం గుర్తుండిపోతాయని వారు భావోద్వేగంతో చెప్పారు. "ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన మాకు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట నియోజకవర్గం, అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రం నుంచి జెడ్పీటీసీగా అవకాశం కల్పించి సమాజంలో గొప్ప గౌరవాన్ని ఇచ్చింది కేటీఆర్ గారే. అందుకే ఆయన పైన మాకు అపారమైన ప్రేమ, గౌరవం ఉన్నాయి. మా కుటుంబ పెద్దగా భావించి, ఆయన చేతుల మీదుగా మా కొడుకుకు నామకరణం చేయించుకున్నాం" అని వారు వివరించారు. "కేటీఆర్ ఇచ్చిన నేటి దీవెనలు మా కొడుకును ఆయనలాగే గొప్ప వ్యక్తిని చేస్తాయన్న నమ్మకం మాకు ఉంది" అని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన అనంతరం, ఆ తర్వాత వారు తమ సొంత గ్రామానికి తిరిగి బయలుదేరి వెళ్లారు. తమ అభిమాన నేతతో గడిపిన ఈ క్షణాలను వారు జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేమని అన్నారు. వారికి కేటీఆర్‌కు ప్రేమతో బహుమతిగా ఒక 'కేసీఆర్ కిట్టు'ను అందించారు.

## వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీంకీలక ఆదేశాలు

**- పలు సవరణల్లో ఆంక్షలు విధిస్తూ ఆదేశాలు**

**- చట్టసవరణను నిలిపివేయాలన్న పిటిషన్లపై విచారణ**

**న్యూఢిల్లీ,సెప్టెంబరు15 ( వెలుతురు):**
వక్ఫ్ సవరణచట్టం-2025 లో కీలక ప్రొవిజన్‌ను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కనీసం ఐదేళ్లపాటు- ఇస్లాంను అనుసరించిన వ్యక్తి మాత్రమే ఆస్తిని వక్ఫ్ చేయడానికి అవకాశం ఉంటుందన్న దానిని నిలిపివేసింది. ఒక వ్యక్తి ఇస్లాంను అనుసరిస్తున్నట్లు- నిర్ణయించేలా నిబంధనలు తయారుచేసేవరకు ఇది అమల్లో ఉండదని చెప్పింది. అదే సమయంలో వక్ఫ్(సవరణ)చట్టం-2025పై మొత్తంగా స్టే విధించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. కొన్ని సెక్షన్లకు మాత్రం కొంత రక్షణ అవసరమని వ్యాఖ్యానించింది. వక్ఫ్ బోర్డులో ముస్లిం సభ్యుల సంఖ్య కచ్చితంగా మెజార్టీలో ఉండాలని కోర్టు పేర్కొంది. బోర్డ్ లేదా కౌన్సిల్‌లో అత్యధికంగా ముగ్గురు లేదా నలుగురు ముస్లిమేతర సభ్యులు ఉండాలని చెప్పింది. ఇక చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ముస్లిమే ఉ ండటం మంచిదని పేర్కొంది. ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ (సవరణ) చట్టం-2025ను పూర్తిగా నిలిపివేయాలని దాదాపు 100కు పైగా పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. ముస్లింల ఆస్తిని మెల్లగా లాగేసుకొనేందుకే అని వీటిల్లో ఆరోపించాయి. ఇక కేంద్రం మాత్రం పబ్లిక్, ప్రైవేటు- ఆక్రణలకు గురికాకుండా రక్షించడానికి అని వాదించింది. వాస్తవానికి ఈ కేసు ఏప్రిల్‌లో పార్లమెంట్ ఈ బిల్లును క్లియర్ చేసిన గంటల్లోనే సుప్రీంకోర్టుకు చేరింది. ముఖ్యంగా కోర్టులతో వక్ఫ్ ఆస్తిగా గుర్తించినవి, వ్యక్తులు, డీడ్ల ఆధారంగా వక్ఫ్ అయిన ఆస్తుల డీనోటిఫై అధికారాలను దీనిలో ప్రశ్నించారు.

## సిఎం రేవంత్‌తో యూస్ కాన్సూల్ జనరల్ విలయమ్స్ భేటీ



**హైదరాబాద్,సెప్టెంబరు15 (వెలుతురు):**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని యూఎస్ కాన్సులేట్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి, తదితర అంశాలను వీరు చర్చించారు. ఇఈవలే విలియమ్స్ హైదరాబాద్ కాన్సుల్జనరల్‌గా బాధ్యతలు స్వీకరించారు.

## కవితతో విష్ణువర్ధన్ రెడ్డి భేటీ

**- జూబ్లీహిల్ ఉప ఎన్నికపై మంతనాలు**

**హైదరాబాద్,సెప్టెంబరు15 ( వెలుతురు):**
మాజీ ఎమ్మెల్యే, దివంగత పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్ రెడ్డి, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో భేటీ అయ్యారు. జూబ్లీహిల్స్ సెగ్మెంట్ ఉప ఎన్నిక జరగనున్న నేపథ్యంలో వీళ్లిద్దరి భేటీ- ప్రాధాన్యం సంతరించుకుంది. పీజేఆర్ వారసుడిగా రాజకీయ అరంగేట్రం చేసిన విష్ణువర్ధన్ రెడ్డి ఖైరతాబాద్ నుంచి 2008లో నిర్వహించిన ఉప ఎన్నికలో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తర్వాత 2009లో జూబ్లీహిల్స్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగి విజయం సాధించారు. 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన విష్ణు ఓటమి చెందారు. అప్పుడు దివంగత గోపీనాథ్ బీఆర్ఎస్ తరఫున విజయం సాధించారు. 2023 అసెంబ్లీ ఎన్నికలలో మరోసారి టికెట్ ఆశించినప్పటికీ కాంగ్రెస్ పార్టీ నిరాకరించడంతో ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్‌కు రాజీనామా చేసి కేసీఆర్‌ను కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ లో చేరినప్పటికీ రాజకీయంగా మాత్రం అంత చురుకుగా ఉండటం లేదు. మాగంటి మరణంతో జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నికలు రావడంతో బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న విష్ణును కవిత కలుసుకోవడం ఆసక్తిగా మారింది. వీళ్లిద్దరి మధ్య ఉప ఎన్నికపైనే ప్రధానంగా చర్చ జరిగినట్టు- సమాచారం. మీటింగ్ తర్వాత బయటికి వచ్చిన విష్ణు మీడియాతో మాట్లాడారు. తాను కేటీ-ఆర్ వెంటే ఉంటానని, పెద్దమ్మ ఉత్సవాలకు ఆహ్వానించేందుకు మాత్రమే కవిత ఇంటికి వెళ్లినట్టు- చెబుతున్నారు. అనంతరం జరిగిన వెంగళరావ్ నగర్ డివిజన్ సమావేశంలోనూ విష్ణు పాల్గొన్నారు.

## అమీర్‌పేట, టోలీచౌక్ పాస్‌పోర్టు కేంద్రాల మార్పు

**- ఎంజిబిఎస్ మెట్రోకు మారిన అమీర్ పేట**

**- రాయ్‌దుర్గకు మారిన టోలీచౌక్ కేంద్రం**




**హైదరాబాద్,సెప్టెంబరు15 (వెలుతురు):**
నగరంలోని రెండు పాస్‌పోర్ట్ కార్యాలయాల అడ్రస్‌లు, వాటి పేర్లుమారాయి. అమీర్‌పేట, టోలీచౌకీ పాస్ పోర్టు కార్యాలయాలను మార్చారు. ఈ రెండు మంగళవారం నుంచి కొత్త కార్యాలయాల్లో పనిచేస్తాయని పాస్‌పోర్ట్ అధికారులు తెలిపారు. హైదరాబాద్ నగరంలోని రెండు పాస్ పోర్ట్ సేవా కేంద్రాలు ప్రస్తుతం ఉన్న చోటి నుంచి వేరే చోట్లకు మార్చబడుతున్నాయి. అమీర్ పేట్, టోలీచౌకీ ప్రాంతంలోని పాస్ పోర్ట్ సేవా కేంద్రాలు కొత్త ప్రదేశాలకు మారాయి. సెప్టెంబర్ 16 నుంచి అమీర్ పేట్ ఆదిత్య ట్రేడ్ సెంటర్ లోని పాస్ పోర్ట్ కేంద్రం ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్ వద్దకు మార్చబడింది. ఇదే సమయంలో టోలీచౌకీ షేక్ పేట్ నాలా ఆనంద్ సిలికాన్ చిప్ వద్ద ఉన్న పాస్ పోర్ట్ సేవా కేంద్రాన్ని రాయదుర్గం ప్రాంతంలోని పాత ముంబై రోడ్ సిరి బిల్డింగ్ లోకి మార్చబడింది. మంగళవారం నుంచి కొత్తగా మార్చబడిన ప్రాంతాల నుంచి ఇవి సేవలను అందిస్తాయని విదేశీ వ్యవహారాల శాఖ ప్రకటించింది.

## మహిళా సాధికార జాతీయ సదస్సు ముగింపు

**- సాంస్కృతిక వారసత్వానికి ఆంధ్రప్రదేశ్ ప్రతీక**

**- రాజ్యసభ డిప్యూటీ- ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్**

**తిరుపతి,సెప్టెంబర్ 15( వెలుతురు):**
సాంస్కృతిక వారసత్వానికి ఆంధ్రప్రదేశ్ ఓ ప్రతీక అని రాజ్యసభ డిప్యూటీ- ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ అన్నారు. తిరుపతి వేదికగా 'మహిళా సాధికార జాతీయ సదస్సు' ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రానికి చెందిన స్వాతంత్ర్య సమర యోధురాలు దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ సేవలను ఈ సందర్భంగా హరివంశ్ కొనియాడారు. తరచూ మహిళా సాధికార సమావేశాలు ఏర్పాటు- చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సమావేశంలో అర్థవంతమైన చర్చలు నిర్వహించామన్నారు. మహిళల సమస్యలే కాదు వాటికి పరిష్కార మార్గాలను సూచించారని చెప్పారు. 'మహిళలకు సంబంధించిన అంశాలపై విధానాల రూపకల్పనలో మరింత దృష్టి సారించాలి. జీరో అవర్‌ను మహిళా సభ్యులు ఎక్కువగా వినియోగించుకునేలా లోక్‌సభ స్పీకర్ చర్యలు చేపట్టారు. రాజ్యసభలోనూ అదే పాటిస్తున్నాం. పాలసీలకు సంబంధించిన చట్టసభ చర్చల్లో మహిళలు పాల్గొనడం ద్వారా.. స్త్రీ, పురుషుల భాగస్వామ్య అంతరం అనే దృక్పథంలో కొంత మార్పు వస్తుంది. చాలా పథకాలు మహిళలను అభివృద్ధి వైపు నడిపిస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్‌లో మహిళా అధికారులు కీలకపాత్ర పోషించారు. ప్రపంచంలోనే అతిపెద్ద రైల్వే బ్రిడ్జి రూపకల్పనలో మహిళలే కీలకం' అని హరివంశ్ తెలిపారు.

# ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థుల రవాణా కష్టాలకు చెల్లు

**- కరీంనగర్ మెడికల్ కాలేజీకి బస్సును అందజేసిన కేంద్ర మంత్రి**

**- మెడికల్ కాలేజీకి జనరేటర్, ఆర్వో ప్లాంట్లతోపాటు కనీస సౌకర్యాలు కల్పిస్తానని హామీ**

**- మంచి భవనంలోకి మెడికల్ కాలేజీ సూచించిన కోరిన కేంద్ర మంత్రి**

**- కేంద్ర మంత్రి చొరవతో తమ కష్టాలు గట్టెక్కాయంటున్న మెడికల్ విద్యార్థులు**

**- బండి సంజయ్ కు ప్రత్యేక కృతజతలు తెలియజేసిన మెడికల్ కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు**





**కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 15:**
కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థులు రవాణా కష్టాలు తొలిగిపోయాయి. విద్యార్థుల కష్టాలను తొలగించేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ముందుకొచ్చారు. విద్యార్థుల రవాణాకు ఇబ్బంది లేకుండా ఉ ండేందుకు బస్సును అందజేశారు. ఎంపీ లాడ్స్ నిధులతోపాటు దాతల నుండి సేకరించిన నిధులతో బస్సును ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అందజేశారు. సోమవారం రోజున కరీంనగర్ ఎంపీ కార్యాలయం వద్ద మెడికల్ కాలేజీ విద్యార్థులు, అధ్యాపకుల సమక్షంలో నూతన బస్సుకు కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ఆ బస్సులో కేంద్ర మంత్రి కొద్దిదూరం ప్రయాణించారు. వాస్తవానికి కరీంనగర్ నియోజకవర్గంలోని కొత్తపల్లిలో ప్రభుత్వ మెడికల్ కాలేజీని నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అయితే మెడికల్ కాలేజీ విద్యార్థులుండే హాస్టళ్లు మాత్రం వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నాయి. బాలికలకు తీగలగుట్టపల్లిలో, బాలురకు సీతారాంపూర్, దుర్గమ్మగడ్డలో హాస్టళ్లు ఉ ండటంతో అక్కడి నుండి మెడికల్ కాలేజీకి వచ్చేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. మెడికల్ కాలేజీ విద్యార్థులు ఇటీవల కేంద్ర మంత్రి బండి సంజయ్ ను కలిసి ఇదే విషయంపై మొరపెట్టుకున్నారు. తప్పనిసరిగా మీ ఇబ్బందులను తీరుస్తానని హామీ ఇచ్చిన బండి సంజయ్ ఇచ్చిన మాట





ప్రకారం...ఈ రోజు ఎంపీ లాడ్స్ తోపాటు దాతల సహకారంతో నూతన బస్సును మెడికల్ కాలేజీకి అందజేశారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాలలో ఉన్న ఇబ్బందుల ను స్వయంగా కేంద్ర మంత్రి సంజయ్ విద్యార్థుల నుండి అడిగి తెలుసుకున్నారు. మంచి నీటి సమస్య ఉందని పేర్కొనగా కాలేజీ, హాస్టళ్లలో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తానని చెప్పగా... ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఆ బాధ్యత తాను తీసుకుంటానని, త్వరలోనే ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. కరెంట్ లేనప్పుడు మెడికల్ కాలేజీ చీకట్లో మగ్గుతోందని, ఇబ్బంది అవుతోందని విద్యార్థుల పేర్కొనగా అతి త్వరలోనే జనరేటర్ కొనుగోలు చేసి అందజేస్తానని ప్రకటించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్వహణను నెలరోజుల్లో మరో మంచి భవనంలోకి మార్చుకునేలా చర్యలు తీసుకోవాలని, అందుకు అవసరమయ్యే వ్యయాన్ని తాను భరిస్తానని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. బండి సంజయ్ ఉదారతను మెడికల్ కాలేజీ విద్యార్థులు, అధ్యాపకులు ప్రశంసిస్తున్నారు. తాము పడుతున్న కష్టాలను గుర్తించి సాయం చేసేందుకు ముందుకు వచ్చిన కేంద్ర మంత్రికి మెడికల్ కళాశాల విద్యార్థులు కృతజతలు తెలియజేశారు.

## అఖిల భారత మహిళా కాంగ్రెస్ 41వ స్థాపక దినోత్సవం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతరావు



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 15:**
సికింద్రాబాద్ జిల్లా జూబ్లీహిల్స్ కాన్స్టిట్యూయెన్సీ , అంబేద్కర్ నగర్ స్లమ్ ఏరియాలో జరిగిన అఖిల భారత మహిళా కాంగ్రెస్ 41వ స్థాపక దినోత్సవం కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా మహిళా కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ తో పాటు కేక్ కటింగ్ చేసి షేక్ పెట్ జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్లో సానిటరీ నాప్కిన్స్, పండ్ల పంపిణీ నిర్వహించబడింది. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు సురక్షిత మంచినీటి కోసం రాబోయే రోజుల్లో మంచినీటి వాటర్ ఫిల్టర్ ఇస్తానని సునీత రావు గారు హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమం సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షురాలు పుస్తకాల కవిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సునీతరావు మాట్లాడుతూ రజియా సుల్తానా, రుద్రమదేవి, సరోజినీ నాయుడు, ఇందిరా గాంధీ వంటి మహనీయ మహిళలు,, మహిళల అభ్యున్నతికి పోరాడారని గుర్తుచేశారు. నేటి మహిళలు నారీశక్తిని స్ఫూర్తిగా తీసుకొని శక్తివంతంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. 1984 సెప్టెంబర్ 15న బెంగళూరులో జాతీయ మహాసభలో మహిళా కాంగ్రెస్ ఫ్రంటల్ ఆర్గనైజేషన్‌గా ఆవిర్భవించిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సంవత్సరం అధిక వర్షాల కారణంగా అల్ ఇండియా మహిళా కాంగ్రెస్ ఇట్టి కార్యక్రమాన్ని జిల్లా వారిగా జిల్లా మహిళా అధ్యక్షురాలి అధ్యక్షతన కార్యక్రమాలు జరుపుకోవాలని సూచించారని సునీతా రావు ఈ సందర్భంగా సికింద్రాబాద్ లోని కార్యక్రమంలో హాజరైచేప్పడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారతను గర్వంగా తీసుకొని ప్రతి మహిళను కోటీశ్వరురాలిగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు. మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం, మహిళా శక్తి పెట్రోల్ బంకులు, ఆర్టీసీ డ్రైవర్లుగా అవకాశాలు, మహిళా క్యాంటీన్లు వంటి పథకాల ద్వారా రాష్ట్రంలో మహిళలకు ప్రాధాన్యం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి మహిళా కాంగ్రెస్ ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఆఫీస్ బేరర్స్, కాన్స్టిట్యూయెన్సీ ప్రెసిడెంట్స్, బ్లాక్ ప్రెసిడెంట్స్, డివిజన్ ప్రెసిడెంట్స్, మహిళా సోదరీమణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆవేదనపై ప్రభుత్వానికి విజ్ఞప్తి

### తెలంగాణ విద్యార్థుల మెడికల్ అడ్మిషన్లపై కేటీఆర్ స్పందన



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 15:**
విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమస్యలను సవివరంగా విన్న కేటీఆర్, వెంటనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో ఫోన్‌లో మాట్లాడారు మానవీయ కోణంలో ఆలోచించాలని ప్రభుత్వానికి సూచన మెడికల్ ఎంట్రన్స్ పరీక్షలలో అర్హత సాధించినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త స్థానికత జీవో కారణంగా ప్రవేశాలకు అనర్హులుగా మిగిలిపోతున్న తెలంగాణ విద్యార్థుల ఆవేదనపై భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకురావడానికి తెలంగాణ భవన్‌కు వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కేటీఆర్ సమావేశమయ్యారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం స్థానికతకు సంబంధించి ఒక ఇబ్బందికరమైన జీవోను తీసుకువచ్చిందని విద్యార్థులు కేటీఆర్‌కు తెలిపారు. గతంలో పదవ తరగతి వరకు 7 సంవత్సరాలు ఎక్కడ చదివితే అక్కడే స్థానికులుగా పరిగణించే నిబంధన ఉండేదని, అయితే ఇప్పుడు 9, 10, 11, 12 తరగతులు వరుసగా చదివిన వారికే స్థానికత వర్తిస్తుందని, వారికే మెడికల్ సీట్ల అడ్మిషన్లు దక్కుతాయని కొత్తగా ఇచ్చిన ఆదేశాల వల్ల వందల మంది విద్యార్థులు నష్టపోతున్నారని వారు వివరించారు. పదో తరగతి వరకు తెలంగాణలో చదివిన తర్వాత, అత్యుత్తమ శిక్షణ కోసం ఆంధ్రాతో పాటు అనేక నాన్-తెలుగు రాష్ట్రాలలో కోచింగ్‌లు తీసుకుని నీట్ పరీక్షలకు సన్నద్ధమయ్యారని, ఇప్పుడు ఆ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అర్హత సాధించినప్పటికీ, ప్రభుత్వం వారిని అనర్హులుగా ప్రకటించి ప్రవేశాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం మొండిగా సుప్రీంకోర్టు వరకు వెళ్ళిందని వారు తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమస్యలను సవివరంగా విన్న కేటీఆర్, వెంటనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సమస్యను సానుకూలంగా పరిశీలించాలని ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక ప్రతినిధి బృందం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలుస్తుందని తెలిపారు. కేటీఆర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పాలసీపరమైన మార్పులు లేదా స్థానికతకు సంబంధించిన అర్హతలను మార్చినప్పుడు, వాటిని గతానుగతంగా కాకుండా భవిష్యత్తు కోసం ఒక కటాఫ్ డేట్ పెట్టి, రెండు లేదా మూడు సంవత్సరాల సమయం ఇచ్చి అలాంటి నిబంధనలు తీసుకువస్తే బాగుంటుందని సూచించారు. కానీ, విద్యార్థులు అప్పటికే తమ ఇంటర్మీడియట్ కోసం ఇతర ప్రాంతాల్లో చదువుతూ, ప్రిపేర్ అవుతున్న వారిని పరిగణనలోకి తీసుకోకుండా ఇచ్చిన ఆదేశాల వల్లనే ఈ పరిస్థితి నెలకొందని కేటీఆర్ అన్నారు. ఈ అంశంలో మానవతా కోణంలో నిర్ణయం తీసుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యపై ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకొని విద్యార్థులకు ఉపశమనం కల్పిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# కరీంనగర్ లో పాస్ పోర్ట్ కేంద్రం అప్ గ్రేడ్

- ఇకపై ప్రతిరోజు 500 స్లాట్లకు అవకాశం కల్పించేలా చర్యలు తీసుకుంటా
- నూతన భవనంలో సేవలను ప్రారంభం సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ హామీ
- హాజరైన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్
- రాష్ట్ర ప్రభుత్వ స్థలం ఇస్తే పర్మినెంట్ భవనం నిర్మిస్తామన్న బండి సంజయ్
- పాస్ పోర్టు సేవలను నరేంద్ర మోదీ సామాన్యుల దరి చేర్చారని వెల్లడి
- కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రసంగం లోని ముఖ్యంశాలు ఈ కింది విధంగా వున్నాయి....
- ఒకప్పుడు పాస్ పోర్ట్ పొందాలంటే నెలల సమయం పట్టేది. బ్రోకర్లకు పెసలు ఇవ్వాల్సి వచ్చేది ఇప్పుడు ఆ సమస్య లేదు.



**కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 15:**
తెలంగాణలో 5 పాస్ పోర్టు సేవా కేంద్రాలుంటే (Begumpet, Ameerpet, Tolichowki, Nizamabad, Karimnagar) అందులో కరీంనగర్ ఉంది. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ వల్ల 2014లో ఈ కరీంనగర్ పాస్ పోర్టు సేవా కేంద్రం నుండి సేవలు ప్రారంభమైనయ్. ఈ ప్రాంత ప్రజల పెరుగుతున్న ఆకాంక్షలను తీర్చడంలో ముఖ్య పాత్ర పోషిస్తోంది. పెరుగుతున్న డిమాండ్ ను ద్రుష్టిలో పెట్టుకుని 2022లో దీన్ని పూర్తిస్థాయి పాస్‌పోర్ట్ సేవా కేంద్రంగా అభివృద్ధి చేసుకున్నం. నిన్నటి వరకు ఉన్న భవనంలో కొన్ని ఇబ్బందులుండేవి. పరిమితమైన సౌకర్యాలు మాత్రమే ఉండేవి. పాస్ పోర్టు సేవలకోసం వచ్చే ప్రజలు కొంత ఇబ్బందిగా ఫీలయ్యేవారు. వీటిని ద్రుష్టిలో ఉంచుకుని ఇప్పుడు 7 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఫార్చ్యూన్ మాల్‌లో పాస్ పోర్టు కేంద్రాన్ని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది. ఇకపై ప్రజలకు, ఇక్కడి స్టాఫ్ కు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుంది. పాస్‌పోర్ట్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే అవకాశం ఏర్పడింది. ఎందుకంటే ఈ కొత్త భవనంలో విస్తారమైన వెయిటింగ్ హాలు ఉంది. చిన్నపిల్లల సంరక్షణ గది, పార్కింగ్ సౌకర్యం, వీల్‌చైర్ వంటి అనేక సౌకర్యాలున్నాయి. ప్రతి వర్గానికి గౌరవప్రదంగా, సులభంగా సేవలు అందుబాటులోకి వస్తాయి.



కరీంనగర్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఇప్పటికే ప్రతిరోజు సగటున 230 శ్లాట్లను నిర్వహిస్తోంది. ఈ సంఖ్యను 500 కు పెంచేలా చర్యలు తీసుకుంటాం. ఈ కొత్త భవనం ద్వారా మరింత సామర్థ్యంతో పని చేసి, విద్య, ఉపాధి, వ్యాపారం లేదా వ్యక్తిగత కారణాల కోసం విదేశాలకు వెళ్లదలచిన యువతకు, వృత్తి, వ్యాపారుల ఆకాంక్షలకు అనుగుణంగా సేవలందించే అవకాశం ఏర్పడింది. కరీంనగర్ మధ్యలో ఉండటం వల్ల తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలకు ఇక్కడికి చేరుకోవడం సులభం అవుతుంది. తద్వారా భవిష్యత్తులో పాస్‌పోర్ట్ సేవల ప్రధాన కేంద్రంగా కరీంనగర్ మారే అవకాశాలున్నాయి. అందుకు అనుగుణంగా స్లాట్లను పెంచేలా చర్యలు తీసుకుంటా. రాష్ట్ర ప్రభుత్వం స్థలమిస్తే పర్మినెంట్ బిల్డింగ్ కట్టించేలా చర్యలు తీసుకుంటా.

ఈరోజు ఈ భవనంలో ఇంత త్వరగా మార్చుకోగలిగామంటే అందుకు ప్రధాన కారణం తెలంగాణ రీజనల్ పాస్‌పోర్టు అధికారి జొన్నలగడ్డ స్నేహజ. 8 నెలల గర్భవతిగా ఉంటూ కూడా కష్టపడి పనిచేస్తూ అందరినీ కో ఆర్డినేట్ చేయడంవల్లే ఇయాళ ఈ నూతన భవనంలో పాస్ పోర్టు సేవలను ప్రారంభించుకోగలుగుతున్నాం. ఆమె అనేక సంస్కరణలు చేపట్టారు. ఒకప్పుడు పాస్ పోర్టు రావాలంటే నెలల తరబడి సమయం పట్టేది. తత్కాల్ కింద కూడా చాలా రోజులు పట్టేది. కానీ ఇప్పుడు తత్కాల్ కింద అప్లయ్ చేసుకుంటే 1, 2 రోజుల్లోనే పాస్ పోర్టు వస్తోంది. జనరల్ గా అప్లయ్ చేసుకుంటే 10 రోజుల్లోపే పాస్ పోర్ట్ అందేలా చర్యలు తీసుకుంటున్నారు. డిజిటలైజేషన్ చేసి ఈ పాస్ పోర్టు జారీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ పోలీస్ విభాగంతో సమన్వయం చేసుకుంటూ verification ప్రక్రియను వేగవంతం చేయడంలోనూ స్నేహజ ముందున్నారు. ఫలితంగా పాస్ పోర్టుల జారీలో హైదరాబాద్ టాప్ 5లో నిలిపారు. ప్రజల్లో నమ్మకం పెంచగలిగారు. గత ఏడాది (2024) తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 9.02 లక్షలకుపైగా దరఖాస్తులను (పాస్‌పోర్ట్ జారీ, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్లు మరియు ఇతర సేవలు) విజయవంతంగా పూర్తి చేయగలగడం గొప్ప విషయం. ఈ విషయంలో పాస్ పోర్ట్ సిబ్బంది అందిస్తున్న సేవలు, ముఖ్యంగా స్నేహజ చేస్తున్న క్రుషి చాలా ఉంది. పాస్ పోర్టు సేవలను దేశ ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రియతమ ప్రధాని మోదీగారి నాయకత్వంలో గత 11 ఏళ్లలో అనేక సంస్కరణలు చేపట్టారు. 2014 నాటికి దేశవ్యాప్తంగా 110 పాస్ పోర్ట్ సేవా కేంద్రాలుంటే నేడు ఆ సంఖ్య 550కి పైగా పెరిగాయి. ఈ నూతన భవనం ద్వారా అందించే పాస్ పోర్టు సేవలతో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రజలు పెద్ద ఎత్తున ప్రయోజనం పొందాలని కోరుకుంటున్నా. స్థానిక ఎంపీగా ప్రజల కోసం మరిన్ని సేవలందించేందు సిద్ధంగా ఉన్నా. అందరం కలిసి కరీంనగర్ జిల్లాను అభివృద్ధి, అవకాశాలకు కేంద్రంగా మారుద్దాం.





# నాలాల కబ్జా వల్లనే అకస్మాత్తు వరదలు

అఫ్జల్‌సాగర్‌లో ఇద్దరు గల్లంతయ్యారని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. నాలాల కబ్జా వల్లే వరద సమయంలో ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒక నిర్మాణం కారణంగా నాలాల్లో వరద నీరు అడ్డుపడింది. అఫ్జల్ సాగర్ వద్ద కొన్ని ఇళ్ల తొలగింపునకు నిర్ణయం తీసుకున్నాం. ఇప్పటికే ముగ్గురు గల్లంతయ్యారు.. ఇద్దరు మృతిచెందారు. అన్ని సమస్యల పరిష్కారానికీ హైడ్రా కృషిచేస్తుందని తెలిపారు.



అఫ్జల్‌సాగర్ డ్రైనేజీలో ఇద్దరు గల్లంతైన ఘటనలో బాధిత కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున నష్ట పరిహారాన్ని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన ప్రకటించారు. గల్లంతైనవారి ఆచూకీ ఇంకా లభించలేదన్నారు. పాత ఇళ్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఆమె ఈ సందర్భంగా సూచించారు. కొన్ని నాలాలపై నిర్మాణాలు ఉన్నాయి.. వాటితో అందరికీ ప్రమాదమేనని హెచ్చరించారు. అఫ్జల్‌సాగర్ పరిధిలో ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామని ఆమె తెలిపారు. హైదరాబాద్ ఆదివారం రాత్రి భారీ వర్షాలతో వణికిపోయింది. అకస్మాత్తుగా కురిసిన కుండపోత వాన కారణంగా నగరంలోని అనేక ప్రాంతాలు మునిగిపోయాయి. ఫ్లాష్‌ఫ్లడ్స్ కారణంగా రోడ్లు, కాలనీలు వరద నీటితో నిండిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో ఆసిఫ్‌నగర్‌లోని మాంగర్‌బస్తీ ప్రాంతం అతలాకుతలమైంది. వరద నీటికి ఇద్దరు కొట్టుకుపోవడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఆ ఘటనతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ హరిచందన, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తక్షణమే రంగంలోకి దిగారు. మాంగర్‌బస్తీ ప్రాంతాన్ని ప్రత్యక్షంగా సందర్శించి, అక్కడి పరిస్థితిని సమీక్షించారు. ప్రజలకు జరిగిన ఇబ్బందులను తెలుసుకొని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు మళ్లీ జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి స్పష్టమైన యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేస్తున్నట్టు- వెల్లడించారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మాంగర్‌బస్తీ మాత్రమే కాదు, హైదరాబాద్‌లోని అనేక ప్రాంతాల్లో నాలాలు కబ్జాకు గురయ్యాయని ఆయన పేర్కొన్నారు. అలాంటి కబ్జాలు ఉండటం వల్లే ఫ్లాష్‌ఫ్లడ్స్ రూపంలో విపత్తులు సంభవిస్తున్నాయని గుర్తుచేశారు. మాంగర్‌బస్తీ ఘటన మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడమే హైడ్రా ప్రధాన లక్ష్యమని అన్నారు. హైదరాబాద్‌లో హైడ్రా వ్యవస్థ ప్రాధాన్యత ప్రజలకు ఇప్పుడు బాగా అర్థమవుతోందని రంగనాథ్ వివరించారు. అంతేకాదు, ఈ మోడల్‌ను చూసి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోకూడా హైడ్రా తరహా వ్యవస్థ అవసరమన్న డిమాండ్ వస్తోందని తెలిపారు. మాంగర్‌బస్తీ పరిస్థితిపై జిల్లా కలెక్టర్ హరిచందన మాట్లాడుతూ, ఆ ప్రాంతంలో 145 ఇళ్లు నాలాపైనే నిర్మించబడ్డాయని తెలిపారు. స్థానికులు ముందుకొస్తే, వారికి ప్రభుత్వ పథకంలో అందించే ఇందిరమ్మ ఇళ్లకు తరలిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా త్వరితగతిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ కూడా దీనిపై స్పందిస్తూ, మాంగర్‌బస్తీ సమస్యకు వారంరోజుల్లో పరిష్కారం చూపుతామని చెప్పారు. నాలాకు అడ్డుగా ఉన్న నాలుగైదు ఇళ్లను తొలగిస్తామని స్పష్టం చేశారు. అయితే, అన్ని ఇళ్లను తొలగిస్తారని భయపడాల్సిన అవసరం లేదని, ప్రజల ఇళ్లను కూల్చేయాలన్న ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు. మాంగర్‌బస్తీ ఘటనతో ప్రభుత్వ యంత్రాంగం కదిలిపోయింది. నాలాల కబ్జాలు, అనధికార నిర్మాణాలు, వర్షాకాలంలో పునరావృతమయ్యే వరద సమస్యలపై సమగ్ర చర్యలు తీసుకోవాలని అధికారులు తేల్చుకున్నారు. వచ్చే వారాల్లో స్పష్టమైన చర్యలు అమలులోకి వస్తాయని, ప్రజలు నమ్మకంగా ఉండాలని సూచించారు.

# రాతియుగపు పరిశోధకుడు రాజారామ్ సింగ్

- ఇంటినే మ్యూజియంగా మార్చిన చరిత్రకారుడు
- బహుముఖ ప్రజ్ఞాశాలి, స్వాతంత్ర్య సమరయోధుడు
- అమర భారతిగా ప్రపంచం గుర్తించిన మన జిల్లా ముద్దు బిడ్డ
- రాజారాంసింగ్ జయంతిపై ప్రత్యేక కథనం...


**పెద్దపల్లి సెప్టెంబర్ 15, (వెలుతురు)**
రాతియుగపు ఆనవాళ్లను పరిశోధిస్తూ అంతర్జాతీయంగా ఎందరో పరిశోధకులకు మార్గదర్శకంగా నిలిచిన ప్రముఖ ఆర్కియాలజిస్టు ఠాకూర్ రాజారాం సింగ్ (అమరభారతి) చరిత్ర పుటల్లో నిలిచిన మన పెద్దపల్లి జిల్లా ముద్దుబిడ్డగా కీర్తించడం మనకెంతో గర్వం కారణం. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి, స్వా తంత్ర్య సమరయోదుడిగా క్విట్ ఇండియా ఉద్యమంలో కీలకపాత్ర వహించి న్యాయవాదిగా అందరికి సుపరిచితమే. ముఖ్యంగా అర్కియాలజిలో అద్భుతాలు సాధించి దేశవిదేశాల రిసెర్చ్ స్కాలర్స్ మన్ననలు పొందారు. రాజారాం సింగ్ 1928 సెప్టెంబర్ 15న పెద్దపల్లి జిల్లా కేంద్రం లోని శివాలయం వీధిలో ఠాకూర్ నారాయణసింగ్, కృష్ణా బాయిలకు జన్మించారు. కవి, రచయిత, చరిత్ర పరిశోధకునిగా రాణించారు. ఈయన స్వాతంత్ర సమరయోధుల పెన్షన్ తిరస్కరించారు. అలాగే అమరభారతి అనే కలం పేరుతో ఆంగ్లంలోను, ఉర్దూలోను తెలుగులోను కవితలు, వ్యాసాలు రాసాడు. శ్రీశ్రీ రాసిన మహాప్రస్థానం సంపుటిని ఉర్దూ , ఆంగ్లంలోకి అనువదించాడు. పూణేలో దక్కన్ కాలేజీలో పీహెచ్ డీ పట్టా పొందిన రాజారామ్ సింగ్ క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. శాతవాహనుల రాజధాని కోటి లింగాలను దాని నేపథ్యాన్ని శాతవాహను ల కాలం నాటి ఆనవాళ్లను, వారు ఉపయోగించిన పనిముట్లను పరిచయం చేశారు. గోదావరి పరివాహక ప్రాంతం వెంట నడుచుకుంటూ వెళ్లి రాతియుగం నాటి మనిషి ఆనవాళ్లు పాదముద్రలను సేకరించారు. అలాగే రాకాసి బల్లి ఆనవాళ్లను మొదటిసారి సేకరించిన చరిత్రకారునిగా నిలిచారు. పెద్దపల్లి జిల్లాకు కూత వేటు దూరంలో ఉన్న పెద్దబొంకూర్ గ్రామంలో గల శాతవాహనుల చారిత్రక ఆనవాళ్లను నాణేలను సేకరించి ఆనాటి చరిత్రను వెలుగులోకి తీసుకొచ్చి ఆంగ్లంలో ఒక పుస్తకంగా మలిచారు. కోటిలింగాలలోనూ ఆయన పరిశోధన మేరకే అక్కడ తవ్వకాలు జరిపారు. గోదావరి పరివాహకపు ప్రాంతాల్లో ఆదిను మానవుడి సంచారం, పాదముద్రలు, రాతి పనిముట్లు సేకరించి ప్రపంచానికి పరిచయం చేశాడు. రాకాసి బల్లిని కనుగొన్న వ్యక్తిగా రాజా రామ్ సింగ్ ప్రసిద్ధి. అనేక ఆనవాళ్లను తవ్వకాల ద్వారా సేకరించి, నాటి చారిత్రక అంశాలను పొందుపరిచి తన ఇళ్లనే మ్యూజియంగా మార్చారు. ఎందరో పరిశోధకులకు మార్గదర్శిగా నిలిచారు. పెద్దబొంకూర్ లో నాణాలను సేకరించి బౌద్ధ జైన ఆనవాళ్లను మన ముందుంచాడు. దూళి కట్ట బౌద్ధస్థూపం ప్రత్యేకతను వివరించాడు. ఆయన రచనలను ఏసోర్స్ ఆఫ్ మెటీరియల్ ఇజం అనే పేరుతో ఆంగ్లంలో ఒక పుస్తకంగా తీశారు. 27 జూలై 2003 గుండెపోటుతో మరణించాడన్న వార్త సాహిత్య ప్రపంచాన్ని ఒక్కసారి గా కుదిపివేసింది.




ఆయన మరణ వార్త విన్న తర్వాత ఎందరో పాశ్చాత్య ఆర్కియాలజిస్టులు ఇక్కడికి వచ్చి, చారిత్రక పరిశోధనలు, శివాలయం వీధిలోని తన ఇంటిని సందర్శించి పోయారు. చరిత్రకారులు మలయశ్రీ లాంటి మహానుభావులందరూ ఆయనతో ఉన్న పరిచయాల ను ప్రజలకు సాహితీ ప్రపంచానికి వివరిస్తుంటే ఇంతటి గొప్ప మహానీయుడు పెద్దపల్లి జిల్లాలో ఉన్నారా అంటూ విస్తుపోవడం మన పాలకులకే సాధ్యం. ప్రస్తుతం పెద్దపల్లి ప్రజల ముందు ఉన్న ఒకే ఒక ప్రశ్న ఎల్లమ్మ చెరువు ట్యాంక్ బండ్లపై ఠాకూర్ రాజారాం సింగ్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని అలాగే పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఠాకూర్ రాజారాం సింగ్ మెమోరియల్ గా ఒక మ్యూజియంలో ఏర్పాటు చేసి ఆయన సేకరించిన ఆనవాళ్లను అందులో పొందుపరచాలని పలువురు జిజ్ఞాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. తమ రాజకీయ పబ్బం కోసం ఎంతోమంది నాయకుల విగ్రహాలను ప్రతిష్టిస్తున్న రాజకీయ నాయకులు ఒక మహా మేధావి రచయిత బహుముఖ ప్రజ్ఞాశాలి, చరిత్రకారుని విగ్రహం ఏర్పాటు చేయడంలో తాత్సరం చేయవద్దని పలు వర్గాల ప్రజలు కోరుతున్నారు.

# వారసులకే కమలంలో అవకాశాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 15, (వెలుతురు)**
అందరివి నలుపు మరకలే. ప్రతి ఒక్కడూ ఆ తానులో ముక్కలే" వెనకటికి ఓ సినిమాలో బహుళ ప్రాచుర్యం పొందిన డైలాగ్ అది. అది నేటి రాజకీయాలకు ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో కమలం పార్టీలో చోటు చేసుకున్న మార్పులకు అచ్చు గుద్దినట్టు సరిపోతుంది. ఉదయం లేస్తే కమలం పార్టీ నాయకులు ఇతర పార్టీ నాయకులను తిడుతుంటారు. వారసత్వ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని.. కుటుంబ సభ్యులకే పదవులు ఇస్తున్నారని మండిపడుతుంటారు. ఇన్నాళ్ళ వరకు బిజెపి ని ఈ విషయంలో కార్నర్ చేసే అవకాశం మిగతా పార్టీలకు లభించలేదు. అయితే ఇప్పుడు బీజేపీ నే అవకాశాన్ని మిగతా పార్టీలకు దర్జాగా ఇచ్చేసింది. తెలంగాణలో అధికారంలోకి రావాలని.. కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని బలమైన నిర్ణయంతో ఉంది బిజెపి. ఇప్పటికే గులాబీ పార్టీని మట్టి కరిపించామని.. త్వరలో కాంగ్రెస్ పార్టీని కూడా గద్దె దింపుతామని బిజెపి నాయకులు బలమైన నమ్మకంతో ఉన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని బలంగా కోరుకుంటున్నారు. వారి కోరికలు నెరవేరుతాయా.. వారు ఇచ్చిన మాటలు నిలబెట్టుకుంటారా.. అనే విషయాలను పక్కన పెడితే తెలంగాణ బిజెపిలో ఇటీవల కొంతమందికి పదవులు ఇచ్చారు. అవి పార్టీకి సంబంధించిన పదవులు. అయితే ఆ పదవులు పొందిన వారిలో కొంతమంది పేర్లను పరిశీలిస్తే ఆశ్చర్యం అనిపించింది. అద్భుతం కూడా అనిపించింది. వారసత్వ రాజకీయాలకు బిజెపి దూరమని. బిజెపి అటువంటి వాటిని ప్రోత్సహించదని పదేపదే కమల నేతలు చెబుతుంటారు. కానీ వాస్తవానికి కమలం పార్టీ కూడా మిగతా వాటి మాదిరిగానేనని.. పైగా వారసత్వాన్ని పెంపొందించే విషయంలో బిజెపి పీహెచ్డీ చేసిందని తాజా పరిణామాలు రుజువు చేస్తున్నాయి. పార్టీకి సంబంధించిన పదవుల విషయంలో మీడియాకు ఓ జాబితా అందింది. అందులో మాజీ మంత్రి దేవేందర్ గౌడ్ కొడుకు తుళ్ల వీరేంద్ర గౌడ్ కు పార్టీ స్టేట్ జనరల్ సెక్రెటరీ పదవి ఇచ్చారు. మాజీమంత్రి పోతుగంటి రాములు కొడుకు భరత్ ప్రసాద్ కు కూడా స్టేట్ సెక్రటరీ పదవి ఇచ్చారు. పోతుగంటి రాములు గతంలో నాగర్ కర్నూల్ నియోజకవర్గానికి పార్లమెంట్ సభ్యుడిగా పని చేశాడు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి కి సెక్రెటరీగా ప్రమోషన్ ఇచ్చారు. మాజీ మంత్రి రామచంద్ర రావు కోడలు కరణం ప్రణీతకు కు సెక్రటరీ పోస్ట్ ఇచ్చారు. బద్దం మహిపాల్ రెడ్డి కొడుకు బద్దం బాల్రెడ్డికి మంచి పోస్ట్ ఇచ్చారు. పీవీ నరసింహారావు మనవడు, గులాబీ పార్టీ ఎమ్మెల్సీ వాణిదేవి అక్క కొడుకు ఎన్వి సుభాష్ కు చీఫ్ స్పోక్స్ పర్సన్ పదవి ఇచ్చారు.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కు చెందిన కాంగ్రెస్ నాయకుడు బొమ్మ వెంకన్న బిడ్డ జయశ్రీకి కీలకమైన పోస్ట్ కట్టబెట్టారు. 22 పోస్టులకు నాయకుల పేర్లు విడుదల చేస్తే.. అందులో ఆరుగురు వారసత్వ నాయకులే. అంటే మూడో వంతు పోస్టులు వారసత్వంగా వచ్చిన వారికే బిజెపి ఇచ్చింది అనుకోవాలి.



# పాకిస్తాన్ కు తీవ్ర అవమానం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15, (వెలుతురు)**

పహల్గాం దాడి తర్వాత పాకిస్తాన్ తో క్రికెట్ ఆడటాన్ని సగటు భారతీయుడు తప్పు



పట్టాడు. క్రికెట్ అభిమానులయితే భారత జట్టు మేనేజ్మెంట్ మీద తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రక్తం, నెత్తురు కలసి ప్రవహించలేవు అని చెప్పినవారు.. ఇప్పుడు ఎందుకు క్రికెట్ ఆడుతున్నారంటూ విమర్శించారు. సోషల్ మీడియాలో ఒక ఉద్యమాన్ని కూడా నడిపారు. మైదానంలో కాదు, చివరికి టీవీలో కూడా మ్యాచ్ చూడకూడదని తీర్మానించుకున్నారు. అయితే టీమిండియా ద్వైపాక్షిక సిరీస్ ఆడటం లేదని.. కేవలం న్యూట్రల్ వేదిక మీద మాత్రమే సిరీస్ ఆడుతోందని.. అది కూడా ఐసీసీ నిర్వహిస్తున్న మెగా టోర్నీ అని.. ఇందులో వివాదానికి తావు లేదని కేంద్ర క్రీడా శాఖ మంత్రి, బిసిసిఐ క్లారిటీ ఇచ్చాయి. అయినప్పటికీ వ్యతిరేక ఉద్యమం ఆగలేదు.మైదానంలోకి ప్రేక్షకులు భారీగానే వచ్చారు. టీవీలలో కూడా మ్యాచ్ ను భారీగానే వీక్షించారు. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన పాకిస్తాన్ జట్టు ముందు బ్యాటింగ్ ఎంచుకుంది.. భారత బౌలర్లు పిచ్ మీద డ్యూ ను సద్వినియోగం చేసుకొని అద్భుతంగా బౌలింగ్ వేశారు. నిర్ణీత 20 ఓవర్లలో పాకిస్తాన్ జట్టును 127 పరుగులకు పరిమితం చేశారు. కులదీప్ మూడు, అక్షర్, బుమ్రా చెరి రెండు వికెట్లు దక్కించుకున్నారు. పాకిస్తాన్ జట్టులో ఫర్హాన్ 40, అఫ్రీది 33 పరుగులతో టాప్ స్కోరర్లుగా నిలిచారు. చివర్లో అఫ్రిది 16 బంతుల్లో నాలుగు సిక్సర్లు కొట్టి 33 పగులు చేయడంతో పాకిస్తాన్ ఆమాత్రమైన స్కోర్ చేయగలిగింది.అనంతరం 128 పరుగుల విజయ లక్ష్యంతో రంగంలోకి దిగిన టీమిండియా ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. తొలి ఓవర్ నుంచి పాకిస్తాన్ మీద ఎదురుదాడికి దిగడం మొదలు పెట్టింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (31) దుమ్మురేపాడు. మరో ఓపెనర్ గిల్(10) నిరాశపరచాడు. కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ (47లి), తిలక్ వర్మ (31), శివం దుబే(10లి) సత్తా చూపించడంతో భారత జట్టు 15.5 ఓవర్లలో మూడు వికెట్ల కోల్పోయి టార్గెట్ ఫినిష్ చేసింది. ఈ విజయం ద్వారా టీమిండియా టాప్ 4 లోకి చేరుకుంది.. అయితే ఈ ఓటమి తర్వాత పాకిస్తాన్ జట్టుకు మరో షాకిచ్చింది టీం ఇండియా. టాస్ వేసే ప్రక్రియలో పాకిస్తాన్ కెప్టెన్ గెలిచినప్పటికీ.. అతడికి టీమ్ ఇండియా కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ షేక్ హ్యాండ్ కూడా ఇవ్వలేదు. మ్యాచ్ గెలిచిన తర్వాత భారత ప్లేయర్లు పాకిస్తాన్ ప్లేయర్లతో షేక్ హ్యాండ్ ఇవ్వడానికి ఆసక్తి చూపించలేదు. క్రికెట్ నిబంధనల ప్రకారం మ్యాచ్ గెలిచిన తర్వాత ఓడిన, గెలిచిన జట్లు కరచాలనం చేసుకొంటాయి. గెలిచిన జట్టును ఓడిన జట్టు అభినందిస్తుంది. కానీ ఆదివారం నాటి మ్యాచ్లో ఇది ఏదీ చోటు చేసుకోలేదు. దీనిని బట్టి పహల్గాం దాడికి సరైన రివెంజ్ తీర్చుకున్నట్టు అయిందని భారత అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు.

# నవంబర్ లో లోకల్ బాడీ ఎన్నికలు




**హైదరాబాద్, సెప్టెంబర్ 15, (వెలుతురు)**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయని అందరూ భావిస్తున్నారు. భారత ఎన్నికల సంఘం బీహార్ రాష్ట్ర ఎన్నికలతో పాటు అక్టోబర్ చివరి వారంలో లేదా నవంబర్ ప్రారంభంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను షెడ్యూల్ చేస్తుందని కాంగ్రెస్ అంచనా వేస్తోంది. దీంతో నవంబర్లో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందిగ్రామ పంచాయతీలు, మండల పరిషత్లు, జిల్లా పరిషత్లు, మునిసిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించడానికి గతంలో నిర్ణయించిన సెప్టెంబర్ 30 గడువును పొడిగించాలని కోరుతూ ప్రభుత్వం వచ్చే వారం హైకోర్టును ఆశ్రయించడానికి ప్రయత్నాలు చేస్తోంది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల మీద కూడా క్లారిటీ రావాల్సి ఉంది.ఈ అంశంపై ఇటీవల అసెంబ్లీ ఆమోదించిన బిల్లులు గవర్నర్, రాష్ట్రపతి ఆమోదం కోసం వేచి ఉన్నాయి. కోటా అంశంపై స్పష్టత వచ్చే వరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం కష్టమే. సెప్టెంబర్ చివరి నాటికి ఎన్నికలు పూర్తి చేయాలని జూన్లో ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అయితే సెప్టెంబర్ నెల దాదాపు సగం వరకు వచ్చింది. దీంతో ప్రభుత్వం అధికారికంగా మరింత సమయం కోరాలని నిర్ణయించింది. స్థానిక సంస్థల ఎన్నికలలో జాప్యం అనివార్యమన్నట్టుగా చెప్పారు. స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ కోటాను అమలు చేయడానికి కాంగ్రెస్ దృఢంగా కట్టుబడి ఉందని మరోసారి చెప్పారు. రిజర్వేషన్ల సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రభుత్వం ఎన్నికలను కొనసాగించదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకత్వం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ప్రాధాన్యత ఇస్తోందని పార్టీ అంతర్గత వర్గాలు చెబుతున్నాయి. అక్టోబర్ ప్రారంభంలో భారత ఎన్నికల సంఘం బీహార్ అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్తో పాటు ఉప ఎన్నికల షెడ్యూల్ను ప్రకటించే అవకాశం ఉందనే అభిప్రాయం ఉంది.అక్టోబర్ 2న దసరా తర్వాత వెంటనే జూబ్లీహిల్స్లో తన ప్రచారాన్ని ముమ్మరం చేయాలని పార్టీ ప్రణాళికలు సిద్ధం చేసింది. జూబ్లీహిల్స్లో విజయం సాధించడానికి అన్ని వనరులను ఉపయోగించాలని కాంగ్రెస్ అనుకుంటోంది. బీఆర్ఎస్ నుంచి కైవసం చేసుకున్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలాగా విజయాన్ని పునరావృతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. జూబ్లీహిల్స్లో విజయం సాధించి బీఆర్ఎస్ నుంచి సీటును కైవసం చేసుకోవడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు బలంగా ఎన్నికలకు వెళ్లొచ్చని హస్తం పార్టీ భావిస్తోంది. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా స్థానిక ఎన్నికల్లో ప్రభావం పడుతుందని ప్లాన్ వేస్తోంది.

# ఖమ్మం కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు

**ఖమ్మం సెప్టెంబర్ 15, (వెలుతురు)**

ఖమ్మం కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు బయటపడింది. ఇరువర్గాలు కర్రలతో పరస్పర దాడులు జరుపుకున్నాయి. ఘటనలో ఒక వ్యక్తి చెవి తెగిపోయింది. ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలో వర్గపోరు నేపథ్యంలో పార్టీ నేతలు కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. న్న ఒక వ్యక్తి చెవి తెగిపోగా, మరో వ్యక్తిని మహిళలు చెప్పులతో కొట్టారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అందరిని చెదరగొట్టారు.

# యూరియా వాడకం తగ్గించండి



వాడకం ఇలాగే కొనసాగితే క్యాన్సర్లో నంబర్-1కి వెళ్లిపోతాం. వచ్చే ఏడాది నుంచి ఎంతవరకు అవసరమో అంతే వినియోగించాలి. మైక్రో న్యూట్రియంట్స్ సప్లిమెంట్స్ కింద ఇవ్వాలి. యూరియా ఎక్కువ వాడితే ఎక్కువ పంట వస్తుందనుకోవడం సరికాదు. దీని అతివాడకంపై పంజాబ్ను కేస్ స్టడీగా చూడాలని చంద్రబాబు తెలిపారు. యూరియా వాడితే అధిక దిగుబడి వస్తుందనడం కరెక్ట్ కాదు అన్నారు. దీనికి పంజాబ్ను కేసు స్టడీగా తీసుకోవాలని సూచించారు. యూరియాను అవసరం మేరకే వాడాలని తెలిపారు. అయితే, రైతులు వచ్చే ఏడాది నుంచి యూరియా వాడకాన్ని తగ్గిస్తే, ఆ మేరకు ప్రోత్సాహం ఇస్తామని చెప్పుకొచ్చారు. కాగా, ప్రస్తుతం వాడుతున్న యూరియాను తగ్గించే ప్రతి కట్టకు రూ. 800 నేరుగా రైతులకు అందజేస్తామని వెల్లడించారు. మన రైతులు ఎక్కువ ఎరువులు వాడుతున్నారు, దాని వల్ల మిరప పంటను చైనా తిప్పి పంపించిందన్నారు. అలాగే, కొన్ని యూరప్ దేశాలు కూడా మన ఉత్పత్తులపై ధరలను తగ్గిస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలియజేశారు. ప్రజారోగ్యం దృష్ట్యా పంటల్లో యూరియా వినియోగం తగ్గిస్తే మంచిదని చంద్రబాబు అన్నారు. యూరియా వినియోగం తగ్గించే రైతులకు ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. ఇప్పటికే, ఏపీ క్యాన్సర్లో టాప్ 5 స్థానంలో ఉంది.. ఇలాగే, కొనసాగితే క్యాన్సర్లో ప్రథమస్థానంలోకి వెళ్తామన్నారు. త్వరలోనే దానికి సంబంధించిన విధి విధానాలను ప్రకటిస్తామన్నారు. పీఎం ప్రణామ్ కింద రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చే సబ్సిడీని రైతులకే ఇచ్చేద్దాం.. ఇక, యూరియా కొరత లేదు.. అవసరమైతే డోర్ డెలివరీ చేద్దామన్నారు. నియోజకవర్గానికో యానిమల్ హాస్టల్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. అర్బన్ నియోజకవర్గాలను మినహాయించి 157 నియోజకవర్గాల్లో యానిమల్ హాస్టళ్ల నిర్మాణం చేపట్టాలి అన్నారు. అలాగే, గోశాలల నిర్మాణం వల్ల పశు సంపద రాష్ట్రానికి రిటన్ గిఫ్ట్ ఇస్తోంది.. జీఎస్డీపీ వృద్ధిలో లైవ్ స్టాక్ పాత్ర కీలకం కానుంది. పాడి పరిశ్రమ అనేది చక్కటి ఆదాయ మార్గంగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఓవైపు అభివృద్ధి చేస్తూనే మరోవైపు సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజలు తమపై చూపిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో సీఎం మాట్లాడారు. కొత్తగా వచ్చిన కలెక్టర్లకు ప్రజల తరఫున చంద్రబాబు అభినందనలు తెలిపారు. పాత కలెక్టర్లు కూడా తమ పనితీరును నిరూపించుకోవాలన్నారు. జిల్లా రూపు రేఖలు మార్చే అవకాశం కలెక్టర్లకు ఉంది. పాలసీ ఇవ్వడమే కాదు.. అమలు చేయడం ముఖ్యం. పేదరిక నిర్మూలన లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇంతకుముందు హార్డ్వర్క్ ఉండేది. ఇప్పుడు స్మార్ట్ వర్క్ చేయాలని సూచించారు. ఎకో సిస్టమ్ తయారు చేయాలి. భారత్ను ప్రథమ స్థానంలో నిలపాలి. మోదీ ప్రధాని అయ్యాక 11వ ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్.. నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తయారైంది. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే సమయానికి మన దేశం అగ్రస్థానానికి చేరుకుంటుంది. నిర్దిష్టమైన ఆలోచనతో ముందుకెళ్తే ఏదైనా సాధించగలుగుతాం అన్నారు. 1991కి ముందు సంస్కరణలు రాలేదు. అప్పుడు ఆర్థిక వృద్ధి రెండు లేదా మూడు శాతం ఉండేది. దేశ వృద్ధి రేటును చూసి అప్పుడు కొందరు ఎగతాళి చేసేవారు. టెక్నాలజీపై మాట్లాడితే అవహేళన చేశారు. సంస్కరణలపై మాట్లాడితే చాలా మంది వద్దన్నారు. ఆనాడు సంస్కరణలు వద్దన్న రాజకీయ పార్టీల మనుగడే ఇప్పుడు లేకుండా పోయింది. కేంద్ర ప్రభుత్వం నిర్దిష్టమైన విధానంతో వికసిత్ భారత్-2047 తయారు చేసింది. మనం కూడా స్వర్ణాంధ్రప్రదేశ్-2047 రూపొందించాం.. ఇది అధికారులకు భగవద్గీత, బైబిల్, ఖురాన్ కావాలి. ప్రపంచంలో తెలుగువాళ్లు అగ్రస్థానంలో ఉండాలనేదే నా ఆలోచన. సామాజిక న్యాయాన్ని పరిగణిస్తూ సమర్థతకు పెద్దపీట వేస్తున్నాం. డబుల్ ఇంజిన్ సర్కార్.. డబుల్ డిజిట్ గ్రోత్ లక్ష్యంతో పనిచేస్తున్నాం. ప్రస్తుతం వృద్ధిరేటు- 10.5 శాతంగా ఉంది. 15 శాతం వృద్ధిరేటు సాధించగలగాలి. 2029 నాటికి రూ.29 లక్షల జీఎస్డీపీ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. అప్పటికి రూ.4.67లక్షల తలసరి ఆదాయం లక్ష్యంగా మనం పనిచేయాలి. ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు పీ4 తీసుకొచ్చాం. ప్రధాని, సీఎం తర్వాత కలెక్టర్లే అత్యంత కీలకమైన వ్యక్తులు. ప్రభుత్వ విధానాలను సక్రమంగా అమలు చేసే బాధ్యత కలెక్టర్లదని చంద్రబాబు అన్నారు.

వాట్సప్ గవర్నెన్సు ద్వారా పౌరసేవలు అందిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. టెక్నాలజీ ద్వారా ప్రజలకు పౌరసేవలు చేరువ చేశామని అమన్నారు. సోమవారం సచివాలయంలో కలెక్టర్ల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో అధికారులకు సీఎం చంద్రబాబు పలు అంశాలపై మార్గనిర్దేశం చేశారు. పాలనలో మొదటి ఏడాది పరీక్షలు పూర్తి అయిపోయాయని చెప్పుకొచ్చారు. ఇంకా బాధ్యతగా పనిచేయాల్సిన సమయం వచ్చిందని తెలిపారు సీఎం చంద్రబాబు. ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయకపోతే ఫలితాలు రావని పేర్కొన్నారు. సాంకేతికత పెరిగిన దృష్ట్యా స్మార్ట్ వర్క్ చేయాల్సిందేనని ఆదేశించారు. ఏఐ, డేటా లేక్ వంటి వాటి ద్వారా సమన్వయం చేసుకుంటూ వెళ్లాలని సూచించారు. పథకాలు, కార్యక్రమాల అమలు కోసం ఆర్టీజీఎస్ సేవలను ఉపయోగించుకోవాలని మార్గనిర్దేశర చేశారు. విజన్ రూపొందించి దానికి నిధులు కేటాయించక పోతే ఇబ్బందులు వస్తాయని చెప్పుకొచ్చారు. సంపద సృష్టించి ఆదాయాన్ని పెంచి సంక్షేమం అమలు చేస్తామని చెప్పామని.. అదే విధంగా సూపర్ సిక్స్ను సక్సెస్ చేశామని ఉద్ఘాటించారు. దేశంలోనే అతిపెద్ద సంక్షేమ పథకంలో భాగంగా 64 లక్షల మంది లబ్ధిదారులకు పెన్షన్ ఇస్తున్నామని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు. తల్లికి వందనం ద్వారా చదువుకునే ప్రతి విద్యార్థికి ఆర్థికసాయం చేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఏడుగురు పిల్లలు ఉన్న తల్లికి కూడా ఈ పథకాన్ని వర్తింప చేశాం. ఆ కుటుంబాల్లో సంతోషం వ్యక్తం అవుతోంది. ?విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలకు వెళ్లే పరిస్థితులు వచ్చాయి. ఉచిత బస్సు అమలు చేయలేమని కొందరు విమర్శించారు... కానీ స్త్రీశక్తి పథకం సఫలమైందని బాబు అన్నారు. 50 శాతం మహిళలను వంటింటికే పరిమితం చేస్తే వారి శక్తియుక్తులు వృథా అవుతున్నాయి. పనిచేయగల వారిని సమర్థంగా వినియోగించుకుంటే జీఎస్డీపీ పెరుగుతుంది. ఉచిత బస్సు ప్రయాణం - స్త్రీశక్తి పథకం ఆర్థిక వ్యవస్థలో చాలా మార్పు తెస్తుందన్నారు. ఈ పథకం అమలు తర్వాత 90 శాతం మేర ఆర్టీసీలో ఆక్యుపెన్సీ పెరిగింది. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలుపుతున్నట్లు వెల్లడించారు. దీపం - 2 పథకం ద్వారా.. ఏడాదికి ఉచితంగా మూడు సిలిండర్లు ఇస్తున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. అన్నదాత సుఖీభవ ద్వారా మొదటి విడతలో రూ.7 వేలు ఇచ్చాం. మూడు విడతల్లో రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లకు కూడా రూ.15 వేలను అక్టోబరు 1 తేదీన ఇస్తాం. పీపీపీ విధానంలో పోర్టులు, ఇన్ఫ్రా పెరిగింది. ఆర్థిక అసమానతలు పెరుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిదీ. సమాజంలోని అన్ని ప్రాంతాల్లోనూ అవకాశాలు రావాలి... ప్రతిఫలాలు అందాలి. గతంలో రాయలసీమ అత్యంత గడ్డు పరిస్థితిని ఎదుర్కొనే ప్రాంతం.. ఇప్పుడు కోనసీమతో సమానంగా ఉంది. ప్రపంచంలోని నలుగురు ఐటీ- నిపుణుల్లో ఒకరు భారతీయుడైతే.. అందులో ఏపీవాళ్లే ఎక్కువ ఉన్నారని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. రాయలసీమలో డ్రిప్ ఇరిగేషన్ లాంటి విధానాలతో సమర్థనీటి నిర్వహణ ద్వారా మంచి ఫలితాలు సాధించామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. పట్టిసీమతో డెల్టాలో వాడే కృష్ణానీటిని పొదుపు చేసి శ్రీశైలం ద్వారా రాయలసీమకు నీళ్లు ఇవ్వగలిగాం. ప్రస్తుతం హంద్రీనీవా ప్రధాన కాలువను వంద రోజుల్లో పూర్తి చేసి కుప్పం వరకూ కృష్ణా నీళ్లు తీసుకెళ్లాం. గోదావరిలో వేలాది టీఎంసీల నీళ్లు సముద్రంలోకి వృథాగా పోతున్నాయి. సమర్థ నీటి నిర్వహణతో రిజర్వాయర్లు నింపాం. వాణిజ్య పంటల విషయంలోనూ సరైన సమయానికి నిర్ణయాలు తీసుకుని లాభం వచ్చేలా చేయాలి. కలెక్టర్లు బ్యూరోక్రాటిక్గా కాకుండా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకుని పాలసీలు అమలు చేయాలన్నారు. ఐదేళ్లలో 25 కలెక్టర్ల కాన్ఫరెన్సులు, 125 కేబినెట్ సమావేశాలు, ఎస్ఐపీబీ సమావేశాలు నిర్వహిస్తాం. ప్రభుత్వం అందించే సేవలన్నిటిలోనూ సంతృప్త స్థాయే కొలమానం అవుతుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. వివిధ జిల్లాల కలెక్టర్లు, సిఎస్ విజయానంద్, మంత్రులు, అధికారులు పాల్గొన్నారు.

# నేపాల్... అంతా స్వయం కృతాపరాధమే

**ఖాట్మాండు,సెప్టెంబర్ 15, (వెలుతురు)**

నేపాల్.. ప్రపంచంలో ఏకైక హిందూ దేశం. రాచరికం నుంచి ప్రజాస్వామ్యంగా పరిణామం చెందినా ఇప్పటికీ అక్కడ సుస్థిర ప్రభుత్వం లేదు. కేవలం 3.5 కోట్ల జనాభాకు సుస్థిర పాలన అందించడంలో అక్కడి నేతలు విఫలమవుతున్నారు. కేవలం వ్యక్తిగత ప్రయోజనాల కోసమే అధికారాన్ని వాడుకుంటున్నారు. ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగుతున్నారు. అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇక వీరి పిల్లలు వేసే వేషాలు మామూలుగా ఉండడం లేదు. తమ తల్లిదండ్రుల సంపాదించిన సొమ్ముతో విదేశాల్లో విలాసాలు చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా చెలరేగిన ఆందోళనలు ఆ దేశ రాజకీయాల్లో ఒక కొత్త అధ్యాయాన్ని రాస్తున్నాయి. జనరేషన్ జెడ్ (జెన్ జెడ్) నేతృత్వంలో మొదలైన ఈ పోరాటం, అవినీతి, ఆర్థిక అసమానతలపై దృష్టి సారించడంతో ప్రభుత్వాన్ని కూల్చివేసింది. సోషల్ మీడియా నిషేధం ఈ తిరుగుబాటుకు ఊపందుకునేలా చేసింది, ఫలితంగా ప్రధాని కేపీ శర్మ ఓలీ రాజీనామా చేశారు. ఈ సంఘటనలు యువత ఆగ్రహాన్ని, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని, సామాజిక మార్పు అవసరాన్ని సూచిస్తున్నాయి.నేపాల్లో యువత నిరుద్యోగం ఒక ప్రధాన సమస్యగా మారింది. 15%-%24 సంవత్సరాల దాటిన యువతలో 20.8% మంది నిరుద్యోగులుగా ఉన్నారు, ఇది వారిని విదేశాలకు వలసలు వెళ్లేలా చేస్తోంది. దేశంలో చేరుకున్న వార్షిక ఆదాయం సగటున 1,400 డాలర్లు మాత్రమే, 20% ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో, రాజకీయ నేతల కుటుంబాలు విలాసవంతమైన జీవితాలు గడపడం యువతలో ఆగ్రహాన్ని రేకెత్తించింది. ట్రాన్స్పరెన్సీ ఇంటర్నేషనల్ నివేదికల ప్రకారం, నేపాల్ ఆసియాలో అవినీతి ఎక్కువగా ఉన్న దేశాల్లో ఒకటి.



ఈ అసమానతలు యువతను రోధాలకు దూరం చేసి, పొలిటికల్ 'నెపో కిడ్స్' (నెపోటిజం పిల్లలు)పై దృష్టి పెట్టేలా మార్చాయి.గత వారాల్లో, సోషల్ మీడియాలో 'నెపో కిడ్స్' ట్రెండ్ వైరల్ అయింది. ఇది రాజకీయ నేతల పిల్లల విలాస జీవనశైలిని టార్గెట్ చేసింది. మాజీ మంత్రి కుమార్తె శ్రింఖల ఖతీవాడ, మాజీ ప్రధాని కోడలు శివానా శ్రేష్ఠ, ప్రచండ మనవరాలు స్మితా దహాల్ వంటి వారి ఖరీదైన దుస్తులు, విదేశీ పర్యాటనలు, లగ్జరీ వస్తువులు ఎక్స్పోజ్ అయ్యాయి. చ%చీవజూశీదీుఎఱవంచీవజుఖశ్రీ% హ్యాష్ట్యాగ్ మిలియన్ల వ్యూస్ సాధించింది, ఇది యువత ఆగ్రహాన్ని డిజిటల్ ప్లాట్ఫారమ్లకు మార్చింది. ఈ క్యాంపెయిన్ టిక్టాక్, ఇన్స్టాగామ్, ఎక్స్ వంటి సైట్లలో వ్యాపించి, సామాన్య ప్రజల బాధలతో పోల్చి సెటైర్లు, వీడియోలు సృష్టించింది. దీని పరిణామంగా, కొందరు తమ అకౌంట్లు మూసివేశారు, మరికొందరు ఆన్లైన్ యాక్టివిటీ ఆపేశారు.మీడియా నిషేధం (26 ప్లాట్ఫారమ్లపై) ఈ ట్రెండ్ను అడ్డుకోవడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యగా కనిపించింది. కానీ ఇది యువతను రోధాలకు దారి తీసింది. సెప్టెంబర్ 8న కాఠ్మండూలో మొదలైన నిరసనలు పార్లమెంట్ భవనంపై దాడులు, మంత్రుల ఇళ్లపై దాడులుగా మారాయి. పోలీసులు టియర్ గ్యాస్, రబ్బర్ బులెట్లు, లైవ్ ఫైరింగ్ ఉపయోగించడంతో 19 - 31 మంది మరణించారు, వేలాది మంది గాయపడ్డారు. ప్రభుత్వం సైన్యాన్ని రంగంలోకి దించి, కర్ఫ్యూ విధించింది, ఇది హింసను మరింత పెంచింది. ఈ ఘటనలు యువత ఆందోళనలను అవినీతి వ్యతిరేక పోరాటంగా మాత్రమే కాకుండా, ప్రభుత్వ దమనపరమైన విధానాలపై తిరుగుబాటుగా మార్చాయి.హింసాత్మక ఆందోళనలు ప్రధాని కేపీ శర్మ ఓలీని రాజీనామా చేయించాయి. ఇది దశాబ్దాల్లో అరుదైన మార్పును తీసుకొచ్చింది. అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ మధ్యవర్తిత్వం చేస్తూ, యువత నేతలతో చర్చలు జరుపుతున్నారు. సైన్యం పహారా విధించి, రాజ్యాంగపరమైన పరిష్కారాలు కోరుతోంది. యువత డిమాండ్లు: అవినీతి విచారణలు, రాజ్యాంగ మార్పులు, మరణించినవారి కుటుంబాలకు సహాయం, ఆస్తులపై దర్యాప్తు. మాజీ చీఫ్ జస్టిస్ సుషీలా కార్కి ఇంటరిమ్ పీఎంగా ఎంపిక అయినట్లు ట్రెండింగ్, ఇది యువత ఆశలకు కొత్త ఆకారాన్ని ఇస్తోంది.

# నవంబర్ తర్వాత మెట్రో నిర్మాణం పనులు


**హైదరాబాద్, సెప్టెంబర్ 15, (వెలుతురు)**

హైదరాబాద్ పాతబస్తీ మెట్రో ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతి రాగానే టెండర్లు పిలిచేందుకు HMR సిద్ధంగా ఉంది. నవంబర్ నాటికి అనుమతులు వస్తాయని అధికారులు ఆశిస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే పాతబస్తీ ప్రజల ప్రయాణ కష్టాలు తీరుతాయి. అయితే నిర్మాణానికి కనీసం రెండున్నరేళ్లు పట్టే అవకాశం ఉంది.హైదరాబాద్ పాతబస్తీ మెట్రో ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రీన్సిగ్నల్ రాగానే టెండర్లను పిలిచేందుకు హైదరాబాద్ ఎయిర్పోర్ట్ మెట్రో రైలు మిలిటెడ్ (HMR) సిద్ధమవుతోంది. మెట్రో అధికారులు నవంబర్ నాటికి అనుమతులు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ కసరత్తును ఇప్పటికే పూర్తి చేశారు. పాతబస్తీ మెట్రో మార్గం హైదరాబాద్లో మెట్రో విస్తరణలో ఒక కీలక భాగంగా మారనుంది. కొత్తగా ప్రతిపాదించిన ఈ మెట్రో మార్గం ఇప్పటికే ఉన్న కారిడార్లకు పొడిగింపు కావడంతో కేంద్రం కొన్ని కీలక అంశాలపై వివరణ కోరిందిముఖ్యంగా తొలి దశ మెట్రోను నిర్వహిస్తున్న ఎల్అండ్టీ హైదరాబాద్ మెట్రోతో టికెటింగ్, ఆదాయం, నిర్వహణ ఎలా పంచుకుంటారనే అంశంపై కేంద్రం ప్రశ్నలు లేవనెత్తింది. నిర్మాణం పూర్తయిన తర్వాత నిర్వహణ సమస్య కాదని అధికారులు తెలిపారు. ఇప్పుడున్న ఎల్అండ్టీకి నిర్వహణ బాధ్యతలు అప్పగించడమో, లేదా థర్డ్ పార్టీకి అప్పగించి ఆదాయాన్ని పంచుకోవడమో చేస్తామని వివరించారు. ఈ రెండు ఆప్షన్లలో రెండో దానికే ఎల్అండ్టీ మొగ్గు చూపుతోంది. ఒకవేళ స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి నిర్వహణ అప్పగించడానికి సిద్ధమని ఎల్అండ్టీ పేర్కొంది.ప్రస్తుత ప్రభుత్వం రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి పాతబస్తీ మెట్రో ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే అధికారుల అంచనా ప్రకారం ఈ పనుల పూర్తికి కనీసం రెండున్నరేళ్లు పట్టే అవకాశం ఉంది. సమయం తక్కువగా ఉండటం, పనులకు అవసరమైన 'రైట్ ఆఫ్ వే' (నిర్మాణానికి మార్గం) సిద్ధంగా ఉండటంతో టెండర్ల జారీకి అత్యవసరంగా చర్యలు తీసుకుంటున్నారు. కాగా, నష్టాల కారణంగా ప్రాజెక్టు నుంచి తప్పుకోవాలని ఎల్అండ్టీ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. రద్దీకి తగ్గ కోచ్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని కేంద్రం వివరణ కోరింది. దీనిపై సంస్థ త్వరలో కొత్త కోచ్లను కొనుగోలు చేస్తామని బదులిచ్చింది.రైలు సంస్థ కేంద్రం అడిగిన అన్ని వివరణలు ఇచ్చామని దీపావళి తర్వాత ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఒక శుభవార్త వినే అవకాశం ఉందని విశ్వాసం వ్యక్తం చేస్తోంది. పాతబస్తీ మెట్రో ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంత ప్రజల ప్రయాణ కష్టాలు చాలా వరకు తగ్గుతాయి.

# cinema

# శరవేగంగా పెద్ది సినిమా షూటింగ్

## దసరాకు మ్యూజికల్ సింగ్ విడుదలకు సన్నాహాలు




గేమ్ ఛేంజర్' సినిమాతో ఈ ఏడాది పెద్దగా ఆకట్టుకోలేని రామ్‌చరణ్ ఇప్పుడు తన నెక్ట్స్ సినిమాతో మళ్ళీ మాస్‌ను ఉర్రూతలూగించేందుకు రెడీ అవుతున్నారు. ప్రస్తుతం చరణ్ 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న 'పెద్ది' సినిమాలో నటిస్తున్నారు. ఇది ఒక విలేజ్ స్పోర్ట్స్ రివెంజ్ డ్రామాగా రూపొందుతోంది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో శరవేగంగా జరుగుతోంది. రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన భారీ సెట్స్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఇక కర్ణాటకలోని మైసూరు ప్రాంతంలో వెయ్యి మందికి పైగా డ్యాన్సర్లతో షూట్ చేశారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీలో తెరకెక్కిన ఈ పాట సినిమాకే హైలైట్ కానుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రాన్ని రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా వచ్చే మార్చి 27న వరల్డ్ వైడ్‌గా విడుదల చేయాలని టీమ్ ప్లాన్ చేసింది. కాగా, దసరా పండుగ సందర్భంగా 'పెద్ది' నుంచి ఓ మ్యూజికల్ సింగిల్ విడుదల చేయనున్నట్లు- సమాచారం. ఇప్పటికే రామ్‌చరణ్ ఆ పాటను విన్నట్టు-, అది అద్భుతంగా ఉందని మెచ్చుకున్నట్టు సమాచారం. ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ బ్యూటీ- జాన్వీ కపూర్ నటిస్తుండగా, సంగీత దర్శకుడిగా ఏఆర్ రెహమాన్ పనిచేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ కు ప్రేక్షకుల నుంచి విపరీతమైన రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా రామ్‌చరణ్ క్రికెట్ షాట్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. కొంతమంది అంతర్జాతీయ క్రికెటర్లు కూడా దానిని రీ-క్రియేట్ చేయడంతో, సినిమా పట్ల ఆసక్తి మరింత పెరిగింది. రామ్‌చరణ్ అభిమానులు 'గేమ్ ఛేంజర్' ఫ్లాప్ తరువాత ఈ సినిమాపైనే ఆశలు పెట్టుకున్నారు. సుకుమార్ శిష్యుడు డైరెక్ట్ చేస్తుండటం, కథలో విలేజ్ బ్యాక్‌డ్రాప్, క్రికెట్, రివెంజ్ అంశాలు ఉండటంతో పాటు-, ఏఆర్ రెహమాన్ సంగీతం మేజర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. దసరా సీజన్‌లో మెగాస్టార్ చిరంజీవి తన కొత్త సినిమా షూటింగ్ ప్రారంభించనున్నట్టు- సమాచారం. బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ చిత్రం 'వాల్తేరు వీరయ్య' తరువాత వారి రెండో కాంబో కావడం విశేషం. దీంతో దసరాకి తండ్రి, కొడుకులిద్దరూ మెగా ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్ ఇవ్వనున్నట్టు- గాసిప్ ఫిలింనగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

# 77వ ఎమ్మీ అవార్డుల ప్రకటన

అంతర్జాతీయ సినీ పరిశ్రమలో ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే 77వ ఎమ్మీ అవార్డుల వేడుక లాస్ ఏంజెలెస్‌లోని పికాక్ థియేటర్ వేదికగా అత్యంత వైభవంగా జరిగింది. హాలీవుడ్‌కు చెందిన ప్రముఖులు ఈ వేడుకలో సందడి చేశారు. ఎమ్మీ అవార్డులు అనేవి అమెరికన్ టెలివిజన్ పరిశ్రమలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వాటికి ఇచ్చే ప్రత్యేక గౌరవం. ఈ అవార్డులని అకాడమీ ఆఫ్ -టె-లివిజన్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ప్రతి సంవత్సరం ఇస్తూ వస్తుంది. ఈసారి నామినేషన్ల బరిలో ఎన్నో సినిమాలు, సిరీస్‌లు పోటీ- పడ్డాయి. అందులో నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన 'అడాల్‌సెన్స్ ఘన విజయం సాధించి ఏకంగా 5 అవార్డులు సొంతం చేసుకోవడం విశేషం. ఇక ఇందులో నటించిన ఓవెన్ కూపర్, చిన్న వయసులోనే ఎమ్మీ అవార్డు గెలుచుకుని కొత్త రికార్డు సృష్టించాడు. ఈ వేడుకలో 2024-2025 సీజన్‌లో ప్రసారమైన కార్యక్రమాలకి అవార్డులని అందించారు. నెట్‌ఫ్లిక్స్‌లో ప్రసారమైన అడోలెసెన్స్, ఆర్కేన్ లీగ్ ఆఫ్ లెజెండ్స్ సిరీస్ అవార్డులని దక్కించుకున్నాయి. ఇక సెవరెన్స్ డ్రామా సిరీస్‌లో అద్భుతమైన నటనకు గాను ట్రామెల్ టిల్మాన్ ఉత్తమ సహాయ నటు-డిగా అవార్డు అందుకోగా, ఆయన తొలి నల్లజాతి సంతతికి చెందిన వ్యక్తిగా చరిత్ర సృష్టించారు.

# సంస్కారం లేని వార్తలు ప్రచారం



## జగపతి బాబు టాక్‌షోలో నటి మీనా ఆవేదన

చైల్డ్ ఆర్టిస్టుగా ఇండస్ట్రీలోకి వచ్చిన మీనా అగ్ర కథానాయకుల సరసన నటించి స్టార్‌గా ఎదిగారు. తాజాగా జగపతిబాబుతో ఆమె 'జయమ్ము నిశ్చయమ్మురా' కార్యక్రమానికి అతిథిగా హాజరై తన కెరీర్, పర్సనల్ లైఫ్ గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. స్టార్ హీరోలతో నటించిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కృష్ణ, రజనీకాంత్ ఇద్దరికీ తాను కూతురుగా, హీరోయిన్‌గా నటించినట్లు- చెప్పారు. నటుడు జగపతి బాబు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఈ టాక్ షో 'జీ 5' లో స్ట్రీమింగ్ అవుతోంది. ఇక తాను భర్తను కోల్పోయినప్పుడు సోషల్ మీడియాలో తనపై వచ్చిన న్యూస్‌పై మీనా అసహనం వ్యక్తంచేశారు. నా భర్త చనిపోయిన వారం తర్వాత నేను రెండో పెళ్లి చేసుకుంటున్నట్లు- రాశారు. వాళ్లకు కుటుంబాలు ఉండవా.. ఇలా రాస్తున్నారు. అని చాలా బాధపడ్డాను. ఆ తర్వాత ఎవరు విడాకులు తీసుకొన్నా నాతో పెళ్లి అని రాసేవారు. అలాంటి వార్తల వల్ల నాకు అసహ్యం వేసేదని తెలిపారు. 1986లో చైల్డ్ ఆర్టిస్టుగా ఇండస్ట్రీలోకి వచ్చిన మీనా తమిళంతో పాటు- తెలుగులోనూ అగ్ర హీరోల సరసన నటించారు. రజనీకాంత్, చిరంజీవి, వెంకటేశ్, నాగార్జున, బాలకృష్ణ అందరితోనూ హిట్ సినిమాల్లో అలరించారు. కెరీర్‌లో మంచి అవకాశాలు వస్తున్నప్పుడే 2009లో విద్యాసాగర్‌ను వివాహం చేసుకున్నారు. ఆయన 2022లో అనారోగ్యం కారణంగా తుదిశ్వాస విడిచారు. ప్రస్తుతం మీనా 'మూకుతి అమ్మన్ 2'లో నటిస్తున్నారు. చాలామంది నిర్మాతలు ఫ్లాప్‌లలో ఉన్నామని తక్కువ అమౌంట్‌తో సినిమా చేస్తున్నామని నన్ను సంప్రదించేవారు. నేను సరేనని అంగీకరించేదాన్ని. ఆ చిత్రాలు సూపర్‌హిట్ అయ్యేవి. తర్వాత నన్ను మర్చిపోయేవారు. ఎప్పుడూ ఇలానే జరిగేది. కెరీర్‌లో వరుస అవకాశాలు వస్తున్నప్పుడే పెళ్లి చేసుకున్నాను. ఆ తర్వాత పాప పుట్టిన రెండేళ్లకు మలయాళం సినిమా దృశ్యం కోసం నన్ను సంప్రదించారు. పాపను వదిలి వెళ్లలేక తిరస్క రించాను. వాళ్లు రిక్వెస్ట్ చేశారు. కథ రాసేటప్పుడు నన్ను దృష్టిలోపెట్టుకున్నట్లు- తెలిపారు. వేరే వారితో సినిమా చేయలేమన్నారు. దీంతో అంగీకరించాను. జగపతిబాబు నాకు ఎప్పుడూ పోటీనే.. మీ పక్కన నేను వస్తుంటే నన్ను ఎవరూ చూసేవారు కాదు. అందరూ మిమ్మల్నే చూసేవారు' అంటూ మీనా సరదా సంగతులు పంచుకున్నారు. దివంగత నటి సౌందర్యతో తన అనుబంధాన్ని పంచుకొని మీనా ఎమోషనల్ అయ్యారు. ఆరోజు ఎన్నికల ప్రచారానికి సౌందర్యతో పాటు- తాను వెళ్లాల్సిఉందని కాకపోతే షూటింగ్ కారణంగా కుదరక వెళ్లలేదన్నారు.

# నంవబర్ 7న జటాధర విడుదల




## సోషల్ మీడియా ద్వారా ప్రకటన

సక్సెస్, ఫెయిల్యూర్స్‌తో సంబంధం లేకుండా సినిమాలు చేసుకుంటూ వెళ్తున్న యాక్టర్లలో ఒకడు సుధీర్ బాబు. ఈ టాలెంటె-డ్ యాక్టర్ ఈ సారి రూటు మార్చి సరికొత్త ప్రయోగంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. సుధీర్ బాబు నటిస్తోన్న సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ జటాధర వెంకట్ కల్యాణ్ కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్ట్ తెలుగు, హిందీ బైలింగ్యువల్ సినిమాగా వస్తోంది. కాగా మేకర్స్ ఎన్నో రోజులుగా విడుదలపై నెలకొన్న డైలామాకు తెరదించారు. ఈ మూవీని నవంబర్ 7న తెలుగు, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ కూడా త్వరలో మొదలు కానున్నట్టు- ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. ఓ వైపు శివుడు మరోవైపు చేతిలో త్రిశూలాన్ని పట్టు-కున్న సుధీర్‌బాబు, ఇంకోవైపు ఉగ్రరూపంలో కనిపిస్తున్న సోనాక్షి సిన్హా లుక్స్‌ను మేకర్స్ ఇప్పటికే విడుదల చేయగా.. సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తున్నాయి. ఈ మూవీలో బాలీవుడ్ భామ సోనాక్షి సిన్హా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శిల్పా శిరోద్కర్ కీలక పాత్ర పోషిస్తోంది. సుధీర్ బాబు నటించిన హరోం హర, మా నాన్న సూపర్ హీరో సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయని తెలిసిందే. దీంతో తన ఆశలన్నీ జటాధర సినిమాపైనే పెట్టు-కున్నాడు. మరి ఈ సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ సుధీర్‌బాబుకు ఎంతలా కలిసొస్తుందో చూడాలి.

# 32.15 కోట్ల రూపాయల గ్రాస్ వసూళ్లు దక్కించుకున్న హెూల్ సమ్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ మూవీ "లిటిల్ హార్ట్స్"

మౌళి తనూజ్, శివానీ నాగరం జంటగా నటించిన "లిటిల్ హార్ట్స్" సినిమా ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్ పై దర్శకుడు సాయి మార్తాండ్ రూపొందించారు. ఆదిత్య హాసన్ నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమాను అద్భుతంగా ప్రమోట్ చేసి నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్స్ బన్నీ వాస్ తన బీవీ వర్క్స్, వంశీ నందిపాటి తన వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై వరల్డ్ వైడ్ గ్రాండ్ గా థియేట్రికల్ గా రిలీజ్ చేశారు.




హెూల్ సమ్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా రూపొందిన "లిటిల్ హార్ట్స్" సినిమా రోజు రోజుకూ కలెక్షన్స్ పెంచుకుంటూ బాక్సాఫీస్ వద్ద స్ట్రాంగ్ హెూల్డ్ తో దూసుకెళ్తోంది. ఈ చిత్రానికి ఇప్పటివరకు వరల్డ్ వైడ్ 32.15 కోట్ల రూపాయల వసూళ్లు దక్కాయి. ప్రతి వారం కొత్త సినిమాలు రిలీజ్ అవుతున్నా ఆ పోటీని తట్టుకుని లిటిల్ హార్ట్స్ బాక్సాఫీస్ వద్ద స్టడీగా కలెక్షన్స్ సాధిస్తోంది. 32.15 కోట్ల రూపాయల వసూళ్లతో చిన్న చిత్రాల్లో బ్లాక్ బస్టర్ సక్సెస్ దిశగా దూసుకెళ్తోందీ సినిమా.

నటీనటులు – మౌళి తనూజ్, శివానీ నాగరం, రాజీవ్ కనకాల, ఎస్ ఎస్ కాంచి, అనిత చౌదరి, సత్య కృష్ణన్, తదితరులు


టెక్నికల్ టీమ్
రచన, దర్శకత్వం – సాయి మార్తండ్
ప్రొడ్యూసర్ – ఆదిత్య హాసన్
పీఆర్ఓ – జీఎస్ కే మీడియా (సురేష్ – శ్రీనివాస్)
మ్యూజిక్ – సింజిత్ యెర్రమల్లి
సినిమాటోగ్రఫీ – సూర్య బాలాజీ
ఎడిటర్ – శ్రీధర్ సొంపల్లి
ఆర్ట్ డైరెక్టర్ – దివ్య పవన్
ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ – వినోద్ నాగుల, మురళి పున్న
డిస్ట్రిబ్యూషన్ – బన్నీవాస్, వంశీ నందిపాటి
డిస్ట్రిబ్యూషన్ బ్యానర్స్ – బీవీ వర్క్స్, వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్

# రెండో బేబీ కోసం ప్లాన్ చేస్తున్నాం

## రామ్‌చరణ్- ఉపాసన దంపతులు వెల్లడి



టాలీవుడ్‌లో రామ్‌చరణ్-ఉపాసన దంపతులు ఎప్పుడూ అందరి దృష్టిని ఆకర్షిస్తూనే ఉంటారు. మొదట్లో ఉపాసన పై విమర్శలు వచ్చినప్పటికీ, ఇప్పుడు ఆమెపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ ఏడాది వీరిద్దరూ మెగా అభిమానులకు శుభవార్త అందించారు. పెళ్ళైన 11 ఏళ్ల తర్వాత ఉపాసన తల్లిగా మారారు. వీరికి పాప పుట్టగా, ఆ చిన్నారికి క్లీంకారా అని పేరు పెట్టారు. పాప పుట్టిన తర్వాత మెగా కుటుంబంలో ఆనందం అంబరాన్ని తాకింది. అయితే ఇప్పటి వరకు ఆ చిన్నారిని ప్రపంచానికి చూపించలేదు. అందుకే అభిమానులు కూడా ఆమెను చూడడానికి ఆతృతగా ఎదురు చూస్తున్నారు. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఉపాసన మాట్లాడుతూ.. రెండో సంతానం పై స్పందించారు.. మొదటి బిడ్డ విషయంలో ఆలస్యం చేశాం. నేను పదేళ్ల తర్వాత తల్లిని అయ్యాను. ఆ సమయంలో విమర్శలు, ఒత్తిడి ఎదురైనా పట్టించుకోలేదు. కానీ రెండో బిడ్డ విషయంలో అలాంటి తప్పు చేయదలచుకోవడం లేదు. సెకండ్ చైల్డ్ కోసం నేను సిద్ధంగా ఉన్నాను అని చెప్పింది. అంతే కాదు రామ్‌చరణ్-ఉపాసన దంపతులు కుటుంబ విషయాలతో పాటు- వ్యాపార రంగంలో కూడా ముందుకు సాగుతున్నారు. నిర్మాతగా ఇప్పటికే విజయాలు అందుకున్న రామ్‌చరణ్, ఇప్పుడు థియేటర్ బిజినెస్లోకి అడుగు పెట్టాలని నిర్ణయించుకున్నారు. హైదరాబాద్‌లో లగ్జరీ మల్టీప్లెక్స్‌ను నిర్మించే ప్రాజెక్ట్‌కు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మల్టీప్లెక్స్ నిర్వహణ బాధ్యతలను ఉపాసన తీసుకోబోతున్నట్లు- తెలుస్తోంది. అపోలో గ్రూప్స్‌తో కలిసి పలు విజయవంతమైన వ్యాపారాలు నడిపిన అనుభవం ఉన్నందున, ఈ ప్రాజెక్టు కూడా ఆమె చేతుల్లో విజయవంతమవుతుందని భావిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి కూడా ఈ నిర్ణయానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు- సమాచారం. మొత్తానికి మెగా అభిమానులకు ఇది నిజంగా గుడ్ న్యూస్.




# మహావతార్‌లో డీలిటెడ్ సీన్స్ విడుదల

చిన్న యానిమేటెడ్ సినిమాగా ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని సొంతం చేసుకుంది 'మహావతార్ నరసింహ'. ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చి 50 రోజులైన సందర్భంగా నిర్మాణ సంస్థ డిలీటెడ్ సీన్ వీడియోను పంచుకుంది. 50 రోజులైనా ఇంకా 200కు పైగా థియేటర్‌లలో ఈ సినిమా ఆడుతోందని తెలిపింది. ఇప్పటి వరకూ 'మహావతార్ నరసింహ' రూ.300కోట్లు- వసూళ్లు చేసిన విషయం తెలిసిందే.

## శ్రీవారి సేవలో
# మహిళా ప్రముఖులు

**- స్వామిని దర్శించుకున్న డికె అరుణ తదితరులు**




**తిరుమల,సెప్టెంబర్15( వెలుతురు):**
తిరుమల శ్రీవారిని పలువురు రాజకీయ ప్రముఖులు దర్శించుకున్నారు. సోమవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఎమ్మెల్యేలు మాధవి రెడ్డి, భూమా అఖిలప్రియ, ఎంపీ డీకే అరుణ, ఎంపీ రవిచంద్ర, గుజరాత్ ఎమ్మెల్యే రివాబా జడేజా.. స్వామివారి సేవలో పాల్గొన్నారు. తితిదే అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను వారికి అందజేశారు. శ్రీవారిని దర్శించున్న వారిలో టీమ్ఇండియా క్రికెటర్ రవీంద్ర జడేజా సతీమణి, గుజరాత్ ఎమ్మెల్యే రివాబా జడేజా ఉన్నారు. సోమవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో స్వామివారి సేవలో ఆమె పాల్గొన్నారు. తితిదే అధికారులు ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు- చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను ఆమెకు అందజేశారు. వీరంతా తిరుపతిలో జరుగుతున్న మహిళా సాధికార సదస్సులో పాల్గొనేందుకు వచ్చారు.

## మహిళల భాగస్వామ్యంతోనే వికసిత్ భారత్ సాధ్యం

**- బాలికా విద్యకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాల్సిందే**

**- జాతీయ మహిళా సాధికారత సదస్సులో స్పీకర్ ఓంబిర్లా**




**తిరుపతి,సెప్టెంబర్15( వెలుతురు):**
మహిళల భాగస్వామ్యం లేకుండా వికసిత్ భారత్ సాధించలేమని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. కొన్నిచోట్ల పాఠశాలలు దూరంగా ఉండటం వల్ల కొందరు చదువుకు దూరమవుతున్నారని చెప్పారు. అలాంటి చోట సాంకేతిక సహాయంతో బాలికలు విద్యావంతులు అయ్యేలా చూడాలన్నారు. తిరుపతిలో నిర్వహిస్తున్న జాతీయ మహిళా సాధికారత సదస్సులో రెండో రోజు ఆయన మాట్లాడారు. మహిళలను సామాజిక, ఆర్థిక, రాజకీయ, క్రీడా రంగాల్లో మరింత ముందుకి తీసుకువచ్చేలా రెండు రోజుల పాటు చర్చలు జరిగాయన్నారు. ప్రతి మహిళకు భద్రత, ఆత్మ నిర్భరత అందించాలి. పంచాయతీ స్థాయిలో కంప్యూటర్ సెంటర్ ఉండేలా చూడాలి. ప్రపంచ వ్యాప్తంగా ఐటీ-, ఎకనామిక్ రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు. మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యం సాధిస్తే.. భారత్ ఆర్థికంగా వృద్ధి చెందుతుంది. గ్రామంలోని ప్రతి మహిళకు పని కల్పించి, ఆర్థికంగా స్వతంత్రులను చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు, ఈ కమిటీ-లు ప్రణాళికలు రూపొందించాలి. దేశంలోని ఆఖరి మహిళకు కూడా ఫలితాలు అందేలా ప్రణాళికలు ఉండాలి. పంచాయతీ, మున్సిపాలిటీ- నుంచి పార్లమెంట్ వరకు ప్రతి ఒక్కరూ మహిళల వృద్ధి కోసం కృషి చేయాలి. గ్రామీణ స్థాయి నుంచే మహిళల నాయకత్వాన్ని ప్రోత్సహించాలి. అన్ని రాష్ట్రాల్లో విమెన్ కమిటీ-లు ఏర్పాటు- చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థిక, సామాజిక స్వావలంబన సాధించకపోతే మనం వికసిత్ భారత్ కల సాకారం చేసుకోలేం‘ అని ఓం బిర్లా అన్నారు.

## ముందుడి నడిపిస్తున్న మహిళలు

**- అభివృద్ధిలో వారిదే అగ్రభాగం**

**- మహిళా సాధికార కమిటీ ఛైర్‌పర్సన్ పురందేశ్వరి**



**తిరుపతి,సెప్టెంబర్15( వెలుతురు):**
మహిళలు అభివృద్ధిని ముందుండి నడిపిస్తున్నారని భాజపా ఎంపీ, పార్లమెంట్ మహిళా సాధికార కమిటీ- ఛైర్‌పర్సన్ పురందేశ్వరి అన్నారు.ప్రతిరంగంలోనూ వారు నిర్ణయాత్మక పాత్రపోషిస్తున్నారని అన్నారు. వారు ఏరంగంలోనైనా రాణించగలరని నిరూపిస్తున్నారని అన్నారు. తిరుపతిలో నిర్వహిస్తున్న మహిళా సాధికార కమిటీల జాతీయ సదస్సులో ఆమె ప్రసంగించారు. మారుతున్న సమాజానికి ఈ సమావేశం ఓ నిదర్శనంగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహిళలకు సమ న్యాయం, గౌరవ జీవితం ఇచ్చేందుకు ఇలాంటివి ఉపయోగపడతాయని తెలిపారు. వికసిత్ భారత్-2047 సాధనలో మహిళలు ముందుండి నడిపించాలి. విద్య, వైద్యం, పరిపాలన, వ్యాపార రంగాల్లో రాణించాలి. వృద్ధిలో భాగం కావడం కాదు.. ముందుండి నడిపించాలి. ఆశా కార్యకర్తల నుంచి ఐఏఎస్ వరకు మహిళల సంఖ్య పెరుగుతూ ఉంది. వర్క్ ఫోర్స్‌లో వారి సంఖ్య వృద్ధి చెందుతోంది. వారిని వ్యాపార రంగంలో ప్రోత్సహించేందుకు 70 కేంద్ర, 400 రాష్ట్ర పథకాలు ఉన్నాయి. ప్రస్తుత భారత్ ఆర్థిక వృద్ధిలో మహిళలు కీలక భూమిక పోషిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు వారి వృద్ధికి ఉపయోగపడేలా మనందరం కృషి చేయాలి. ఇక్కడ నేర్చుకున్న అంశాలను మీ రాష్ట్రాల్లో అమలు చేయాలి. స్వయం సహాయక సంఘాలు, ప్రజాప్రతినిధులు ఆయా అంశాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి. ప్రతి బాలిక గొప్ప కలలు కనేలా, ప్రతి మహిళా వర్క్‌ఫోర్స్‌లో రాణించేలా కలిసి పనిచేద్దామని పురందేశ్వరి అన్నారు.

## వైద్యకళశాలల నిర్మాణం పేరుతో
# 5వేల కోట్లు అప్పు

**- జగన్ చేసిన ఆ అపు ఎక్కడికి మళ్లిందో**

**- టిడిపి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు విమర్శలు**

**రాజమహేంద్రవరం,సెప్టెంబర్15( వెలుతురు):**
రాష్ట్రంలో వైద్య కళాశాలలు నిర్మిస్తామని జగన్ ప్రభుత్వం రూ.5వేల కోట్ల అప్పు చేసిందని.. ఆ నిధులు ఎటు మళ్లించారో సమాధానం చెప్పాలని తెదేపా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ అన్నట్టుగా రాజమహేంద్రవరం మెడికల్ కాలేజీ చూసి ఆహా అనలేం. వైకాపా కార్యాలయాన్ని మాత్రం ఓహో అనేలా నిర్మించుకున్నారు. ప్రైవేటీకరణకు పీపీపీకి మధ్య వ్యత్యాసం తెలియని జగన్ ఐదేళ్లు సీఎంగా ఎలా పనిచేశారు. అనేక అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో పీపీపీ విధానంలోనే వైద్య కళాశాలలు కొనసాగుతున్నాయి. పీపీపీ మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా మెరిట్ సీట్లను కూటమి ప్రభుత్వం 42 నుంచి 50 శాతానికి పెంచింది. జగన్ అధికారంలో ఉండగా ఎందుకు పెంచలేదో వైకాపా సమాధానం చెప్పాలి. జగన్ మాపై బురద చల్లేసి కడుక్కోమంటు-న్నారు. ఫ్యాక్షన్ తరహాలో మెడికల్ కాలేజీల కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల మధ్య జగన్ ఉండటం శ్రేయస్కరం కాదు. రాష్ట్ర శ్రేయస్సు కోసం ఆయన జైలులో ఉండటమే మంచిది. జగన్



తరహాలోనే ఆయన శిష్యులు కూడా ఫేక్ మాటలు మాట్లాడుతున్నారు. మాజీ ఎంపీ మార్గాని భరత్ రోజురోజుకీ దిగజారిపోతున్నారని ఆదిరెడ్డి వాసు విమర్శించారు. గోదావరి పుష్కరాల పనులు డిసెంబర్ నుంచి ప్రారంభమవుతాయని ఆదిరెడ్డి వాసు తెలిపారు. రూ.1500 కోట్లతో అధికారులు అంచనాలు రూపొందించారన్నారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఎన్నికల్లో నాలుగోసారి విజయం సాధించబోతున్నామని చెప్పారు.

## సమాజాభివృద్ధికి
# మహిళా సాధికారతే ముఖ్యం

**- వారితో కుటుంబమే కాదు..సమాజపురోగతీ సాధ్యం**

**- మహిళా సాధికారిత సదస్సులో గవర్నర్ నజీర్**

**తిరుపతి,సెప్టెంబర్15( వెలుతురు):**
మహిళా సాధికారత కేవలం మహిళలనే కాదు.. సమాజాన్నీ వృద్ధి పథంలో నడిపిస్తుందని ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. వారికి గౌరవం లేని చోట ఎన్ని గొప్ప కార్యక్రమాలు చేసినా ఫలితం లేదని పేర్కొన్నారు.తిరుపతిలో నిర్వహిస్తున్న మహిళా సాధికార కమిటీల జాతీయ సదస్సు రెండోరోజు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సతీ సహగమనం, బాల్య వివాహాలు పురాణాల్లో కనిపించవని చెప్పారు. మన వేదాలు, ఉపనిషత్తులు మహిళలను గౌరవించాలని




చెబుతున్నాయన్నారు. కుటుంబ సంతోషం ఆ ఇంట్లో మహిళల ఆనందంపై ఆధారపడి ఉంటుంది. ఇదే రాష్ట్రానికి, దేశానికి వర్తిస్తుంది. మొల్ల రామాయణం రాసిన కవయిత్రి మొల్లకు తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానం ఉంది. కేవలం ఆస్తుల్లో భాగస్వామ్యం లేకపోవడం వల్ల మహిళలు చాలా సార్లు తండ్రి, సోదరుడు, భర్తపై ఆధారపడతారు. పురుషాధిక్యత సమాజంలో వారికి రెండో స్థానం ఇచ్చారు. కానీ సమాజ నిర్మాణానికి మహిళలే సరైన ఆర్కిటెక్ట్‌లుఅ అని అన్నారు. భారత రాజ్యాంగం అందరినీ సమానంగా గుర్తిస్తుంది. లింగ సమానత్వానికి రాజ్యాంగంలో ప్రాధాన్యత ఉంది. మహిళలు ఎన్నో సవాళ్లను దాటి రాజకీయ, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో పురుషులకు గట్టి పోటీ ఇస్తున్నారు. సుప్రీంకోర్టు అనేక తీర్పుల్లో వారి హక్కులను కాపాడేలా తీర్పులు ఇచ్చింది. ఆయా తీర్పులు హక్కులను కాపాడటంలోనే కాదు, సమాజ నిర్మాణంలోనూ కీలక పాత్ర పోషించాయి. ఛత్తీస్‌గఢ్‌లో అత్యధికంగా 14 శాతం మంది మహిళా ఎమ్మెల్యేలు ఉన్నారు. రువాండాలో 30 శాతం పార్లమెంటరీ సీట్లు- కేటాయిస్తూ చట్టం చేసిన కొద్ది కాలానికే అక్కడ వృద్ధి పెరిగింది. భారత రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం తక్కువ. విద్య ద్వారానే వారికి సాధికారత సాధ్యం అవుతుందని గవర్నర్ అన్నారు.

# మేధా పాఠశాల మూసివేత

**- సమాచారం తెలియక తల్లిదండ్రుల ఆందోళన**




**హైదరాబాద్,సెప్టెంబరు15 ( వెలుతురు):**
అల్పాజ్రోలం తయారీ కేసులో సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలోని మేధా పాఠశాలను అధికారులు ఆదివారం సీజ్ చేశారు. ఈ సమాచారం తెలియక సోమవారం విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి పాఠశాలకు వచ్చారు. పాఠశాల సీజ్ అయినట్లు- కనీసం సమాచారం కూడా ఇవ్వలేదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. టీసీ ఇస్తే ఇతర పాఠశాలలో చేర్పించుకుంటామని తెలిపారు. పాఠశాలలో మత్తు పదార్థాలు తయారు చేయడం దారుణమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విద్యాశాఖ అధికారులు ప్రత్యామ్నాయ మార్గం చూపించాలని కోరారు. ఇప్పటికే పాఠశాలకు 70 శాతం ఫీజులు చెల్లించినట్లు- వెల్లడించారు. ప్రస్తుతం విద్యార్థుల భవితవ్యం అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మలేల జయప్రకాశ్‌గౌడ్(39) హైదరాబాద్ ఓల్డ్ బోయిన్‌పల్లి సాయికాలనీలో నివాసం ఉంటున్నాడు. అదే ప్రాంతంలో మేధా పేరుతో పాఠశాల నిర్వహిస్తున్నాడు. డబ్బు సంపాదించాలనే ఆశతో అల్పాజ్రోలం తయారీ దందాకు తెరలేపాడు. తయారీ ఫార్ములాను గురువారెడ్డి అనే వ్యక్తి ఇచ్చాడు. స్కూలు రెండో అంతస్తులోని రెండు గదుల్లో పరికరాల సాయంతో తయారుచేసి, మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలంలోని వివిధ ప్రాంతాల్లోని కల్లు దుకాణాలకు సరఫరా చేస్తున్నాడు. ఈ సమాచారం అందుకున్న ఈగల్ బృందం శనివారం ఆకస్మిక తనిఖీలు చేసింది. జయప్రకాశ్‌గౌడ్, అతడికి సహకరిస్తున్న బోయిన్‌పల్లికి చెందిన పెంటమోల్ ఉదయ్ సాయి(23), గౌ-టె- మురళి(23)లను అదుపులోకి తీసుకుంది. ఆదివారం అధికారులు పాఠశాలను సీజ్ చేశారు.

## 8ఏళ్ల బాలికపై అత్యాచారం కేసు

**- దోషికి 21 ఏళ్ల జైలు..30వేల జరిమాన**

**నల్గొండ,సెప్టెంబరు15 ( వెలుతురు):**
ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం కేసులో నల్గొండ కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. దోషి దోమల రాముకు 21 ఏళ్లు జైలు శిక్ష, రూ.30 వేలు జరిమానా విధించింది. ఈ ఘటనపై 2018 ఫిబ్రవరిలో చిట్యాల పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. 2022 నుంచి నల్గొండ పోక్సో కోర్టులో



వాదనలు కొనసాగుతున్నాయి. ఈక్రమంలో పోక్సో కోర్టు ఇన్‌ఛార్జి జడ్జి రోజారమణి సోమవారం తీర్పు వెలువరించారు.

బాధిత కుటు-ంబానికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించారు.


## సంక్షేమం,అభివృద్ధి ఆగిపోయిందన్న హరీష్



**హైదరాబాద్,సెప్టెంబరు15 ( వెలుతురు):**
రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పూర్తిగా ఆగిపోయాయని భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. బిల్లులు ఇవ్వట్లేదని ప్రైవేటు- ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ బందు చేశారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులు ఆపేయడంతో కాలేజీలు బందు అయిపోయాయని హరీష్ రావు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వ తీరు వల్ల చాలా సమస్యలు మొదలయ్యాయని విమర్శించారు.

## మరో మూడ్రోజులు
# భారీ వర్షాలు

**- వాతావరణశాఖ హెచ్చరిక**



**హైదరాబాద్,సెప్టెంబరు15 ( వెలుతురు):**
తెలంగాణలో మరో మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు పడే సూచనలున్నాయని చెప్పింది. మంగళవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని.. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. బుధవారం సిద్దిపేట, రంగారాఎడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ, గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలు కురిసే అవకాశం ఉందని వివరించింది.ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, వరంగల్‌తో పాటు- పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట గ్రామంలో 24.5 సెంటీ-మీటర్ల వర్షపాతం నమోదైంది.

## కర్నూలు జిల్లాలో దారుణం

**- కాంపౌండ్ వాల్ కూలి విద్యార్థి దుర్మరణం**




**కర్నూలు,సెప్టెంబరు15 ( వెలుతురు):**
కర్నూలు జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. కవ్వాడి వీధిలోని ఓ ప్రైవేటు- పాఠశాల గోడ కూలి విద్యార్థి మరణించాడు. వివరాల్లోకి వెళ్తే.. పాతబస్తీలోని కీర్తి ఇంగ్లీస్ మీడియం స్కూల్‌లో రాఖీబ్ (5) ఒకటో తరగతి చదువుతున్నాడు. సోమవారం నాడు అతను స్కూల్‌కు ఆలస్యంగా వచ్చాడు. రాఖీబ్‌తో పాటు- ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను టీచర్ క్లాస్ బయట కాంపౌండ్ వాల్‌వద్ద నిల్చోబెట్టారు. ఈ క్రమంలో శిథిలావస్థలో ఉన్న కాంపౌండ్ గోడ కూలి విద్యార్థులపై పడింది. ఈ ఘటనలో రాఖీబ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఐదుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన విద్యార్థులను చికిత్స కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. ప్రైవేటు స్కూల్ గోడకూలి విద్యార్థి మరణించడం పట్ల మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని కర్నూలు జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రైవేటు- స్కూళ్లలో భద్రతా ప్రమాణాల విషయంలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. మృతిచెందిన విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. స్కూల్ యాజమాన్యంతో మాట్లాడి బాలుడి కుటుంబానికి న్యాయం చేస్తానని స్పష్టం చేశారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com